ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 06.11.2025 | సంపుటి :12 సంచిక : 106 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## కొడంగల్‌లో నా గెలుపులో మైనారిటీలే కీలకం

### వారి సహకారంతోనే నేను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచా



- కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే మైనారిటీలకు అనేక అవకాశాలు
- అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే కిషన్‌రెడ్డికి ఏం నొప్పి?
- మోదీ,కేసీఆర్ ఇద్దరూ ఒక్కటే..
- సవాళ్లు విసిరి పారిపోవడం కేటీఆర్‌కు అలవాటుగా మారింది
- జూబ్లీహిల్స్‌లో నవీన్‌యాదవ్‌ను గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి పనులు
- షేక్‌పేట్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో భారత రాష్ట్ర సమితి పేరుతో భాజపా ఓట్లు అడుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా షేక్‌పేట్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో సీఎం పాల్గొన్నారు."జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నాం. నాలుగు వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం. నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేస్తాం. హైదరాబాద్‌లో మూసీ రివర్ ఫ్రంట్ ఎందుకు కట్టకూడదో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలి. మిగతా 2లో..

### భాజపా, బీఆర్‌ఎస్ ఒకే గూటి పక్షులు

- త్వరలోనే బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనం ఖాయం
- ఈ రెండు పార్టీలు ఒక్కటే అని రుజువయ్యింది
- గత పార్లమెంట్ ఎన్నికల్లో వీరి బంధం బట్టబయలు
- క్రైస్తవ సంఘాల నేతలతో భేటీలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): బీఆర్‌ఎస్ పార్టీని బీజేపీకి మాజీ సీఎం కేసీఆర్ తాకట్టు పెట్టాని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులకు ఎనిమిది చోట్ల డిపాజిట్ కూడా రాకపోవడానికి కుమ్మక్కు రాజకీయాలే కారణమని విమర్శించారు. బిజెపిలో బిఆర్‌ఎస్ విలీనం మిగతా 2లో..

## ట్రంప్‌కు ఎదురుదెబ్బ





- న్యూయార్క్, వర్జీనియా మేయర్లుగా డెమాక్రట్లు
- న్యూయార్క్ మేయర్‌గా భారత సంతతికి చెందిన జోహ్రాన్ మమ్దానీ ఘన విజయం

### బ్యాలెట్‌పై నా పేరు లేకపోవడంతోనే ఓటమి

కాలిఫోర్నియా ఓటింగ్ ప్రక్రియలోనూ రిగ్గింగ్

రాజ్యాంగ విరుద్ధమైన రీమ్యాపింగ్ పేరుతో కాలిఫోర్నియాలో భారీ స్కామ్

ఫలితాలపై ట్రంప్ అసహనం

2లో..

న్యూయార్క్(జనంసాక్షి):అమెరికాలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. అగ్రరాజ్యం అమెరికాలో పలు పదవులకు జరిగిన ఎన్నికల్లో భారతతి సంతతికి చెందిన వ్యక్తులు, డెమోక్రాట్లు తమ హవా కొనసాగించారు. యూఎస్ ఆర్థిక రాజధాని న్యూయార్క్, వర్జీనియాలో జరిగిన తాజా ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థులు, భారత సంతతికి చెందిన వ్యక్తులు విజయం సాధించారు.న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో భారత సంతతికి చెందిన జోహ్రాన్ మమ్దానీ విజయం సాధించారు. ఈ ఘనత సాధించిన తొలి ముస్లిం, భారత సంతతి, ఆఫ్రికన్ సంతతికి చెందిన తొలి మేయర్‌గా ఆయన రికార్డు సృష్టించారు. 34 ఏండ్ల మమ్దానీ జూన్‌లో జరిగిన డెమోక్రాటిక్ ప్రైమరీ ఎన్నికల్లో మిగతా 2లో..

- వర్జీనియాలో లెఫ్టినెంట్ గవర్నర్‌గా గజాలా హాష్మీ
- ఇద్దరూ భారతీయ మూలాలు ఉన్న వ్యక్తులే..

### భవిష్యత్తు మన చేతుల్లో ఉంది

- మార్పు కోసం ఈ ప్రస్థానం
- న్యూయార్క్‌లోని కొత్తతరానికి కృతజ్ఞతలు
- న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్‌దాని
- నెహ్రూ ప్రసంగం 'ట్రిస్ట్ విత్ డెస్టినీ'ని ప్రస్తావన

9లో..

## భాజపా రాజ్యాంగబద్ధ సంస్థల్ని దుర్వినియోగం చేసింది



- ఓట్ల దొంగలను కాపాడుతూ ఎలక్షన్ కమిషన్
- ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తోంది
- 2024 హరియాణా ఎన్నికల్లోనూ ఓట్ల చోరీ
- ఆ సమయంలో భాజపా అనేక వ్యవస్థలను వినియోగించి 25 లక్షల ఓట్లను దొంగలించారు
- హరియాణా ఎన్నికల్లో బ్రెజిల్‌కు చెందిన మోడల్‌కు 22 ఓట్లు
- ఓటు చోరీపై మీడియా సమావేశంలో రాహుల్

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఎన్నికల కమిషన్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. ఓట్ల దొంగలను ఈసీ కాపాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తోందని ఆరోపించారు. ఓట్ల చౌర్యంపై రాహుల్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ. .2024 హరియాణా ఎన్నికల్లోనూ ఓట్ల చోరీ జరిగిందని ఆరోపించారు. దీనికోసం భాజపా నేతలు అనేక వ్యవస్థలను వినియోగించి.. మిగతా 2లో..



## జూబ్లీహిల్స్‌లో సత్తా చాటాలి

- ఎవరి హయాంలో ఏం చేశామో చర్చిద్దాం
- హైదరాబాద్ అభివృద్ధిపై నాతో చర్చకు రావాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్

హైదరాబాద్(జనంసాక్షి):హైదరాబాద్ అభివృద్ధి పై తనతో చర్చకు రావాలని సిఎం రేవంత్ రెడ్డికి కెటిఆర్ సవాల్ విసిరారు. హైదరాబాద్ అభివృద్ధి ఎవరి హయాంలో ఏం జరిగిందో వివరిస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీ, సచివాలయం, గాంధీ భవన్ ఎక్కడైనా సరే.. రేవంత్‌తో చర్చకు రెడీ అని మిగతా 2లో..

### జూబ్లీహిల్స్‌లో ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్యే అవగాహన కుదిరింది: కిషన్‌రెడ్డి

### డిమాండ్లు పరిష్కరించే వరకు బంద్ కొనసాగిస్తాం

- బకాయిల్లో 50 శాతం చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం
- ఎల్బీ స్టేడియంలో 8న కళాశాలల అధ్యాపకుల సభ
- డిమాండ్లను పరిష్కరించకపోతే 10 లక్షల మంది విద్యార్థులతో భారీ సభ
- ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల పరిష్కారానికి కమిటీని స్వాగతిస్తున్నాం
- మూడు నెలలకు బదులు ఒక నెలలోనే రిపోర్టు అడగాలి
- తెలంగాణ ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య అధ్యక్షుడు రమేశ్‌బాబు

### ఢిల్లీ కాలుష్య నియంత్రణలో భారత్‌కు సహాయం చేస్తాం

ముందుకొచ్చిన చైనా

### నడి రోడ్డుపై ఏకంగా దేశాధ్యక్షురాలిపైనే లైంగిక వేధింపులు

మెక్సికోలో దిగ్భ్రాంతికర ఘటన

2లో..

### పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని..

యూపీలో ఆరుగురు మృతి

### కర్నాటక రోడ్డు ప్రమాదంలో సంగారెడ్డి వాసుల మృతి

ప్రమాదంలో నలుగురు దుర్మరణం

### అమెరికాలో కుప్పకూలిన కార్గో విమానం

- టేకాఫ్ సమయంలో దుర్ఘటన
- ముగ్గురు మృతి, మరో 11 మంది తీవ్రగాయాలు

### సంగారెడ్డి జిల్లాలో మరో రోడ్డు ప్రమాదం

పటాన్‌చెరు మండలం ముత్తంగి వద్ద అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు.. ప్రయాణికులు సురక్షితం

2లో..

## భారత్‌తో వాణిజ్య సంబంధాలకు కట్టుబడి ఉన్నాం



- ఇరు దేశాల మధ్య ఒప్పందం దిశగా చర్చలు కొనసాగిస్తున్నాయి
- ఈ విషయమై ట్రంప్, మోదీ తరచూ మాట్లాడుకుంటున్నారు
- టారిఫ్‌ల విషయంలో మా వద్ద 'ప్లాన్-బి' కూడా ఉంది : వైట్‌హౌస్

వాషింగ్టన్(జనంసాక్షి):డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్రమోదీ తరచూ మాట్లాడుకుంటున్నారని కరోలిన్ లీవిట్ వెల్లడించారు. రెండు దేశాల వాణిజ్య బృందాలు ఒప్పందం దిశగా చర్చలు కొనసాగిస్తున్నాయని చెప్పారు. అలాగే భారత్-అమెరికా సంబంధాల బలోపేతానికి ట్రంప్ కట్టుబడి ఉన్నారని చెప్పారు.అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు టారిఫ్‌లు విధించే అధికారాన్ని బుధవారం అమెరికా సుప్రీంకోర్టు సమీక్షించి తీర్పు ఇవ్వనుంది. ఫలితం ఎలా ఉన్నా తాము సిద్ధంగా ఉన్నామని ట్రంప్ యంత్రాంగం వెల్లడించింది. అందుకుతగ్గట్టుగా తాము ప్రత్యామ్నాయాలను సిద్ధం చేసుకొని ఉన్నామని వైట్‌హౌస్ మిగతా 9లో..

### 'సామూహిక వీసాల రద్దు దిశగా కెనడా!

అధికారాల కోసం ఆ దేశ ప్రభుత్వం ప్రయత్నాలు!

2లో..




జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
06.11.2025

# భాజపా రాజ్యాంగబద్ధ సంస్థల్ని దుర్వినియోగం చేసింది



25 లక్షల ఓట్లను దొంగలించారన్నారు. ఎన్నికల్లో పోల్ అయిన మొత్తం ఓట్లలో దాదాపు 12.5 శాతం నకిలీవేనన్నారు. హరియాణా ఎన్నికల్లో బ్రెజిల్‌కు చెందిన ఓ మోడల్‌కు కూడా 22 ఓట్లు ఉన్నాయని తెలిపారు. ఆమె ఫొటో ఒకటే అయినప్పటికీ సీమా, స్వీటీ, సరస్వతి వంటి వివిధ పేర్లు, వయసులు, జెండర్లతో 22 ఓట్లను సృష్టించారన్నారు. హరియాణాలో 5 లక్షలకు పైగా నకిలీ ఓటర్లు ఉన్నారని రాహుల్ ఆరోపించారు. ప్రతి 8 ఓట్లలో ఒకటి నకిలీదన్నారు. ఫేక్ ఫొటోలతో లక్షకు పైగా ఓట్లు ఉన్నాయని.. ఒకే ఫొటోతో రెండు బూత్‌లలో 223 ఓట్లు ఉన్నాయని పేర్కొన్నారు. తప్పుడు చిరునామాలతో 93 వేలకు పైగా ఓట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఎన్నికల సమయంలో కొందరు వ్యక్తుల ఓట్లను కావాలనే జోడిస్తున్నారని పేర్కొన్నారు. అందువల్లే హరియాణా ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తుందని అన్ని ఎగ్జిట్ పోల్స్ చెప్పినప్పటికీ తాము ఓడిపోయామన్నారు. ఇన్ని అక్రమాలు జరుగుతుంటే ఎన్నికల సమయంలో ఎలక్షన్ కమిషన్ ఏం చేసిందని కాంగ్రెస్ నేత ప్రశ్నించారు. డూప్లికేట్ ఓటర్లను గుర్తించేందుకు ఈసీ వద్ద సాఫ్ట్‌వేర్ కూడా ఉన్నప్పటికీ.. ఓటరు జాబితాలో 5లక్షలకు పైగా నకిలీ ఓటర్లు ఎలా వచ్చారని అన్నారు. ఈసీ తలుచుకుంటే నకిలీ ఓట్లను సెకన్లలోనే తొలగించేదని.. భాజపాకు లబ్ధి కలిగించేందుకు ఎన్నికల అధికారులు ఈ విషయాలను పట్టించుకోకుండా వదిలేశారని ఆరోపించారు. యూపీలో ఓటు వేసిన వేలాదిమంది హరియాణాలోనూ ఓటు వేశారని అన్నారు. భాజపా నేతల చిరునామాలతో వందల సంఖ్యలో నకిలీ ఓట్లు ఉన్నాయన్నారు. భాజపాకు సంబంధించిన వాళ్లు అయినంత మాత్రాన దేశంలో ఎక్కడైనా ఓటు వేస్తారా అని ప్రశ్నించారు.

# హరియాణాలో ఎన్నికలకు ముందు అభ్యంతరాలు తెలపలేదెందుకు?

**రాహుల్ ఆరోపణలకు ఈసీ కౌంటర్**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని బుధవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. హైడ్రోజన్ బాంబ్ పేరిట ఎన్నికల సంఘం, భాజపాపై తీవ్ర విమర్శలు గుప్పించారు. వాటికి ఎన్నికల సంఘం నుంచి కౌంటర్ వచ్చింది. గత ఏడాది హరియాణాలో ఎన్నికలు జరిగాయని, వాటికి ముందు హస్తం పార్టీ నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదని చెప్పారు. "రాహుల్ గాంధీ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సమర్థిస్తున్నారా? వ్యతిరేకిస్తున్నారా..? హరియాణాలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్ జాబితాపై కాంగ్రెస్ ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తంచేయలేదు. పోలింగ్ స్టేషన్లలో కాంగ్రెస్ పోలింగ్ ఏజెంట్లు ఏం చేస్తున్నారు" అని ప్రశ్నించింది.

# పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని..

**యూపీలో ఆరుగురు మృతి**



**లక్నో(జనంసాక్షి):** ఉత్తరప్రదేశ్‌లో రైలు ప్రమాదం చోటుచేసుకుంది. యూపీలోని మిర్జాపుర్‌లో బుధవారం రైల్వే పట్టాలు దాటుతున్న యాత్రికులను ఓ రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆరుగురు మహిళలు మృతిచెందినట్లు తెలుస్తోంది. కార్తిక పౌర్ణమి నేపథ్యంలో యాత్రికులు గంగానదిలో పవిత్ర స్నానాలు ఆచ రించడానికి చోపాన్ ప్రాంతం నుంచి వారణాసికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. యాత్రికులు చోపాన్–ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ రైలులో చునార్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అనంతరం వారు ప్లాట్‌ఫాం వైపు దిగకుండా మరోవైపు ఉన్న పట్టాలపై దిగారు. అక్కడి నుంచి ఎదురుగా ఉన్న ప్లాట్‌ఫాం పైకి వెళ్లడానికి ప్రయత్నిస్తున్న సమయంలో ట్రాక్ పైకి వచ్చిన హౌరా–కల్కా నేతాజీ ఎక్స్‌ప్రెస్ వారిని ఢీకొట్టింది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు.

# కర్నాటక రోడ్డు ప్రమాదంలో సంగారెడ్డి వాసుల మృతి

**సంగారెడ్డి(జనంసాక్షి):** కర్ణాటకలోని హల్లిఖేడ్‌లో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వ్యాను, కారు ఢీకొన్న ఈ ఘటనలో నలుగురు తెలంగాణవాసులు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులను సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్ గ్రామానికి చెందిన నవీన్ (40), రాచప్ప (45), కాశీనాథ్ (60), నాగరాజు (40)గా గుర్తించారు. వీరంతా గానుగాపూర్ దత్తాత్రేయ ఆలయానికి వెళ్లి కారులో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది.

# సంగారెడ్డి జిల్లాలో మరో రోడ్డు ప్రమాదం

**సంగారెడ్డి(జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల బస్సు ప్రమాదం ఘటన ఎంతటి విషాదాన్ని నింపిందో అందరికీ తెలిసిందే. బస్సును టిప్పర్ లారీ ఢీకొట్టడంతో అందులోని కంకర బస్సులో పడి దాదాపు 19 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మరువక ముందే మరో ప్రమాదం చోటు చేసుకుంది. సంగారెడ్డి జిల్లాలో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. అయితే ప్రాణాపాయం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సులోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. జాతీయ రహదారి 65 సమీపంలో పటాన్‌చెరు మండలం ముత్తంగి వద్ద ఆర్టీసీ బస్సుకు ప్రమాదం జరిగింది. ముందు ఉన్న కారును తప్పించబోయి బ్రేక్ ఫెయిల్ కావడంతో బస్సు డివైడర్‌పైకి దూసుకెళ్లి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే ప్రయాణికులు ఎవరూ కూడా గాయపడకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి గురైన బస్సు మేడ్చల్ డిపోకు చెందింది. మేడ్చల్ నుంచి ఇస్నాపూర్ వెళ్తుండగా ప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే పటాన్‌చెరు పోలీసులు సంఘటనా స్థలికి చేరుకున్నారు. బస్సులో సాంకేతిక లోపం కారణంగా ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు. అయితే ఆర్టీసీ బస్సులకు వరుసగా జరుగుతున్న ప్రమాదాలతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్న పరిస్థితి.

# అమెరికాలో కుప్పకూలిన కార్గో విమానం

**– టేకాఫ్ సమయంలో దుర్ఘటన**

**– ముగ్గురు మృతి, మరో 11 మంది తీవ్రగాయాలు**

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికాలో ఘోర విమాన ప్రమాద ఘటన చోటుచేసుకుంది. కెంటకీ విమానాశ్రయంలో టేకాఫ్ సమయంలో కార్గో విమానం ఒకటి కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. వివరాల ప్రకారం.. అమెరికాలోని లూయిస్‌విల్లేలో టేకాఫ్ సమయంలో యూపీఎస్ కార్గో విమానం కుప్పకూలింది. యూపీఎస్ ఫ్లైట్ నంబర్ 2976 విమానం హొనులులుకు మంగళవారం సాయంత్రం (అమెరికా కాలమానం) 5.15కు బయల్దేరగా ప్రమాదానికి గురైంది. ఈ విషయాన్ని అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ ధ్రువీకరించింది. ప్రమాదం కారణంగా ముగ్గురు మరణించినట్టు వెల్లడించింది. ఇక, విమానం గాల్లోకి ఎగురుతున్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి కుప్పకూలిపోయింది. విమాన ప్రమాదం జరిగిన తర్వాత ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలుముకుంది.

# కొడంగల్‌లో నా గెలుపులో మైనారిటీలే కీలకం



కిషన్‌రెడ్డికి సవాల్ విసిరితే ఎందుకు స్పందించడం లేదు. నిన్న నేను మాట్లాడిన మాటలను వక్రీకరించారు. మొదటి నుంచి నేను సెక్యులర్ భావాలు ఉన్న వ్యక్తిని. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు అనేక అవకాశాలు కల్పించింది. కొడంగల్‌లో నేను 3 సార్లు గెలవడానికి మైనార్టీల సహకారం ఉంది. 20 నెలల కాంగ్రెస్ పాలనలో మైనార్టీలకు ఇబ్బందులు లేకుండా చూశాం. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఎలా ఇచ్చారని కిషన్‌రెడ్డి అడుగుతున్నారు. ఎందుకు ఇవ్వొద్దో.. కిషన్‌రెడ్డి చెప్పాలి. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే కిషన్‌రెడ్డికి ఏం ఇబ్బంది. ప్రధాని మోదీ, మాజీ సీఎం కేసీఆర్ ఒక్కటే. ముస్లింలను భారత రాష్ట్ర సమితి మోసం చేస్తోంది. సవాల్ విసిరి పారిపోవడం కేటీఆర్‌కు అలవాటుగా ఉంది. కేసీఆర్ పదేళ్లలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించారా?" అని సీఎం ప్రశ్నించారు. జూబ్లిహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా షేక్‌పేటలో ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ" ప్రజలను కలుసుకున్నాను. మైనారిటీల పక్షపాతి కాంగ్రెస్ అన్న సత్యాన్ని గుర్తు చేశాను. ఈ దేశంలో లౌకిక, ప్రజాస్వామ్య వాతావరణాన్ని ప్రతిష్ఠించి, దానిని శాశ్వతంగా నిలబెట్టింది కాంగ్రెస్. రాహుల్ గాంధీ, నేనూ ఒక వైపు,మోదీ, కేసీఆర్ ఒక వైపు ఉన్నాం. ఈ ఎన్నిక ఉప ఎన్నికే కావచ్చు. కానీ, బీజేపీ – బీఆర్ఎస్ చీకటి స్నేహాలు, మైనారిటీల పై కుట్రలను ఛేదించేందుకు ఇది ఒక అవకాశం. నగరాభివృద్ధికి, అన్నీ వర్గాల గౌరవానికి, సమాన అవకాశాల కల్పనకు ప్రజా ప్రభుత్వం చేపట్టిన బృహత్తర ప్రణాళికల అమలుకు జూబ్లిహిల్స్ గెలుపు ఒక ప్రోత్సాహకం కావాలి. కుల, మతాలకు అతీతంగా జూబ్లిహిల్స్ నిర్ణయం తీసుకోవాలి." అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

# భాజపా, బీఆర్ఎస్ ఒకే గూటి పక్షులు

ఎంతోదూరం లేదన్నారు. ఈ మేరకు ఈ రెండు పార్టీలు ఒక్కటే అంటూ బీఆర్ఎస్ బీజేపీ లపై రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధామంత్రి నరేంద్రమోదీకి మద్దతు ఇస్తున్న కేసీఆర్ తెలంగాణకి అత్యంత ప్రమాదకరమని ఆక్షేపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కారు గుర్తుకు ఓటేస్తే కమలం గుర్తుకు వేసినట్లేనని ఆరోపించారు. జూబ్లీహిల్స్ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్స్ సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం కలిశారు. ఈ క్రమంలో సీఎంతో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు సమావేశం అయ్యారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్స్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం కోసం పనిచేస్తామని వారు హామీ ఇచ్చారు. అలాగే, తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వారి సమస్యలపై సానుకూలంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. వారి సమస్యలని వెంటనే పరిష్కారిస్తానని మాటిచ్చారు. భారత్ జోడో పాద యాత్ర ద్వారా ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశంలోని మైనార్టీలకు ఒక భరోసా ఇచ్చారని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్‌లో మైనార్టీలను మభ్యపెట్టడానికి కుట్ర జరుగుతోందని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేసీఆర్ ఒక వైపు ఉన్నారని.. రాహుల్ గాంధీ, తాను మరోవైపు నిలబడ్డామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి కేసును సీబీఐకి అప్పగించి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కేంద్రప్రభుత్వం ఎందుకు స్పందించలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. కార్ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు తెలంగాణ గవర్నర్ ఇప్పటి వరకు ఎందుకు అనుమతి ఇవ్వలేదని నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రాజకీయ ఒప్పందం లేకపోతే ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈ కేసుల విషయంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులను ఎందుకు విచారణకు పిలవడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అయ్యే పరిస్థితి ఉందని ఆరోపించారు. గతంలో కవితనే ఈ విషయాన్ని స్పష్టం చేసిందని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసేందుకు జూబ్లీహిల్స్‌ను ప్రయోగశాలగా చూస్తున్నారని విమర్శించారు. దేశం కోసం సర్వం త్యాగం చేసిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీలని ఈడీ ఆఫీసుకు పిలిచి విచారణ చేశారని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో జరిగిన భేటీకి మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతరావు, శ్రీ గణేశ్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, ఏఐసీసీ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు అనిల్ థామస్, తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

**కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే అవగాహన కుదిరింది: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**



**హైదరాబాద్(జనంసాక్షి):** జూబ్లీ హిల్స్ నియోజకవర్గానికి కాంగ్రెస్ ఏం చేస్తుందో చెప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా యూసఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ భాజపా అభ్యర్థి లంకల దీపక్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమకు, భారత రాష్ట్ర సమితికి మధ్య ఎలాంటి అవగాహనా ఒప్పందం జరగలేదని తేల్చిచెప్పారు. కేసీఆర్ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేశారని.. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి మధ్యనే అవగాహన కుదిరిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంతో పాటు జూబ్లీహిల్స్‌లోనూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు.

# ఢిల్లీ కాలుష్య నియంత్రణలో భారత్‌కు సహాయం చేస్తాం

**– ముందుకొచ్చిన చైనా**

**బీజింగ్(జనంసాక్షి):** దేశ రాజధాని నగరం దిల్లీ, దాని పొరుగున ఉన్న ప్రాంతాలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. గత రెండు వారాలుగా అక్కడ గాలి నాణ్యత బాగా క్షీణించింది అనేక ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 400 దాటిపోయిందని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) గణాంకాలు వెల్లడించాయి. ఈ సమయంలో భారత్‌కు సాయం చేసేందుకు చైనా ముందుకువచ్చింది. ఈ మేరకు భారత్‌లోని చైనా ఎంబసీ అధికార ప్రతినిధి యూజింగ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. "చైనా ఒకప్పుడు తీవ్రమైన పొగమంచుతో ఇబ్బంది పడింది. అలాంటి సమస్యను ఎదుర్కొంటున్నవారితో మా ప్రయాణాన్ని పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. భారత్ త్వరలో ఆ పరిస్థితి నుంచి బయటపడుతుందని విశ్వసిస్తున్నాం" అని యూజింగ్ రాసుకొచ్చారు. పొగమంచుతో తీవ్రంగా ఇబ్బందిపడిన చైనా.. గాలి నాణ్యతను మెరుగుపర్చుకొనే క్రమంలో గణనీయమైన విజయాలు సాధించింది. గతంలో చైనాలో కూడా రాజధాని బీజింగ్‌తో పాటు పలు నగరాలు, పారిశ్రామిక కేంద్రాల్లో కాలుష్యం ప్రపంచ రికార్డులు సృష్టించింది. ప్రభుత్వం వెంటనే మేల్కొని గట్టి నియంత్రణ చర్యలు తీసుకోవడంతో చైనా మహానగరాల్లో కాలుష్య మేఘాలు చెదిరిపోయాయి. చైనా గాలి నాణ్యత ప్రమాణాలను నిర్దేశించి నిక్కచ్చిగా పాటించింది. వాటిని ఉల్లంఘిస్తే కఠినమైన జరిమానాలు, శిక్షలు విధించింది. దీనివల్ల నగరాల్లో శుభ్రమైన గాలి వీస్తోంది. ఇండియా కూడా వాయు కాలుష్య నియంత్రణకు ఇదేస్థాయిలో కఠిన చర్యలు తీసుకుంటే పరిస్థితి మారుతుందని నిపుణులు సూచిస్తున్నారు

# నడి రోడ్డుపై ఏకంగా దేశాధ్యక్షురాలిపైనే లైంగిక వేధింపులు

**మెక్సికో(జనంసాక్షి):** మెక్సికోలో దిగ్భ్రాంతికర ఘటన చోటు చేసుకుంది. ఏకంగా దేశాధ్యక్షురాలే నడిరోడ్డుపై లైంగిక వేధింపులు ఎదుర్కోవడం కలకలం సృష్టించింది. అసలేమయ్యిందంటే మెక్సికో దేశాధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ మంగళవారం ఓ బహిరంగ కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడ ఆమె ప్రజలతో మాట్లాడుతుండగా..వెనుక నుంచి వచ్చిన ఓ వ్యక్తి అధ్యక్షురాలిపై చేయి వేస్తూ..ఆమెను ముద్దు పెట్టుకోబోయాడు. వెంటనే అధ్యక్షురాలి భద్రతా సిబ్బంది అతడిని పక్కకు నెట్టారు. అయినప్పటికీ అతడు క్లాడియాను అసభ్యంగా తాకుతుండడంతో ఆమె ఇబ్బంది పడుతూ..అతడి చేతిని పక్కకు నెట్టిన దృశ్యాలు వీడియోలో కనిపిస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల్లో దేశాధ్యక్షురాలికే భద్రత లేకపోతే సాధారణ మహిళల పరిస్థితేంటని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇది భారీ భద్రతా వైఫల్యమని.. ఆ వ్యక్తి అంత దగ్గరకు వచ్చే వరకు భద్రతా సిబ్బంది ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. అయితే ఈ విషయంపై అధ్యక్ష కార్యా లయం ఎటువంటి ప్రకటన చేయలేదు. ఘటన జరిగిన సమ యంలో సదరు వ్యక్తి మద్యం మత్తులో ఉన్నట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు.

# డిమాండ్లు పరిష్కరించే వరకు బంద్ కొనసాగిస్తాం



**హైదరాబాద్(జనంసాక్షి):** తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేవరకు బంద్ కొనసాగిస్తామని తెలంగాణ ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య అధ్యక్షుడు రమేశ్‌బాబు అన్నారు. గత నాలుగు రోజులుగా బంద్ చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చర్చలకు పిలిచిందని చెప్పారు. "జేఎన్‌టీయూ, ఉస్మానియా పరిధిలో నిర్వహిస్తున్న పరీక్షలను కళాశాలలు బహిష్కరించాయి. కళాశాల విద్య కమిషనర్ దేవసేన ఎంత వేధిస్తున్నా భరించాం. ఆమెను ఆ విభాగం నుంచి బదిలీ చేయాలని ఇప్పటికే ప్రభుత్వాన్ని కోరాం. ఫీజు బకాయిల్లో 50 శాతం చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం. మా డిమాండ్‌లను పరిష్కరించే వరకు బంద్ కొనసాగిస్తాం. ఎల్బీ స్టేడియంలో ఈనెల 8న కళాశాలల అధ్యాపకుల సభ నిర్వహిస్తాం. సుమారు 70వేల మంది దీనికి హాజరవుతారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల పరిష్కారానికి కమిటీ వేయడాన్ని స్వాగతిస్తున్నాం. మూడు నెలలకు బదులు ఒక నెలలోనే కమిటీ రిపోర్టు అడగాలి. మార్చి నాటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి. కాలేజీలపై విజిలెన్స్ దాడుల్లో నియంతృత్వ ధోరణి కనిపిస్తోంది. ఈ డిమాండ్లను పరిష్కరించకపోతే 10లక్షల మంది విద్యార్థులతో భారీ సభ నిర్వహిస్తాం" అని అన్నారు.

# బీహార్‌లో మళ్లీ ఎన్‌డీయేదే అధికారం

**మరోసారి ప్రజలు పట్టం కట్టబోతున్నారు**

**ప్రజల్లో మార్పు గమనించా: ప్రధాని మోదీ**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** బిహార్‌లో గత ఇరవై ఏళ్లలో కనీవినీ ఎరగని విజయాన్ని ఎన్డీయే కూటమి ఈసారి సాధించబోతోందని, ఓటర్లు ఆ మేరకు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. మరోమారు ఎన్‌డిఎదే బీహార్ అని అన్నారు. ప్రజల్లో కనిపిస్తున్న మార్పునకు ఇది సంకేతం అన్నారు. 'ఆటవిక రాజ్య' నేతలు చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. బిహార్లో తాను ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నప్పుడు ప్రతిచోటా మునుపటి సభ కంటే భారీగా ప్రజలు వస్తున్నారని, ముఖ్యంగా మహిళలు పెద్దఎత్తున పాల్గొంటున్నారని చెప్పారు. బిహార్‌లో భాజపా–ఎన్డీయే మహిళా కార్యకర్తల్ని ఉద్దేశించి మంగళవారం ఆయన నమో యాప్ ద్వారా ప్రసంగించారు. 'మేరే బూత్.. సబ్‌సే మజ్‌బూత్' అనే సంకల్పంతో భాజపా మహిళా కార్యకర్తలు అమోఘమైన కృషి చేస్తున్నారని ప్రధాని ప్రశంసించారు. బిహార్ ఎన్నికలను నేనెంతో క్షుణ్నంగా పరిశీలిస్తున్నాను. అందువల్ల ఎన్డీయేదే గెలుపు అని ఖాయంగా చెప్పగలను. విజయంపై నాకెలాంటి సందేహం లేదు. పోలింగ్ మాత్రం ఇంకా పెరగాలని కోరుకుంటున్నాను. మహిళల సులభతర జీవనాన్ని మెరుగుపరడానికి, వారికి సాధికారత కల్పించడానికి ఎన్డీయే సర్కారు కట్టుబడి ఉంటుందని ఆయన చెప్పారు. ఎన్డీయే విజయం కోసం బిహార్ ప్రజలు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారన్నారు

# ట్రంప్‌కు ఎదురు దెబ్బ

ఘన విజయం సాధించి మేయర్ అభ్యర్థిగా నిలిచారు. తాజాగా జరిగిన మేయర్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ గవర్నర్ ఆండ్రూ క్యూమోపై మమ్దానీ విజయం సాధించారు. ఒక ఉన్నత కుటుంబం నుంచి స్వయం ప్రకటిత ప్రజాస్వామ్య సోషలిస్ట్ అయిన మమ్దానీ భారత సంతతికి చెందిన తల్లిదండ్రులకు ఉగాండాలో జన్మించాడు. ఏడేళ్ల నుంచి అమెరికాలో ఉంటున్నారు. 2018లో సహజ పౌరసత్వం పొందారు. మరోవైపు వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్ రేసులో భారత సంతతికి చెందిన డెమొక్రటిక్ అభ్యర్థిని గజాలా హాష్మీ విజయం సాధించారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి జాన్ రీడ్‌పై భారీ మెజారిటీతో గెలుపొందారు. హాష్మీ 15వ సెనెటోరియల్ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వర్జీనియా సెనేట్‌లో పనిచేసిన మొదటి ముస్లిం, తొలి దక్షిణాసియా అమెరికన్ గజాలా. ఇలా న్యూయార్క్ నగర మేయర్ పదవికి జరిగిన ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీకి చెందిన జొహ్రాన్ మమ్‌దానీ గెలిచి చరిత్ర సృష్టించారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎత్తులను చిత్తు చేస్తూ 34 ఏళ్ల జొహ్రాన్ మేయర్ గా విజయం సాధించారు. ఈ పదవి దక్కించుకున్న తొలి భారత–అమెరికన్ ముస్లిం ఈయనే. భారతీయ మూలాలున్న మమ్‌దానీ మరెవరో కాదు.. బాలీవుడ్ ప్రముఖ దర్శకురాలు మీరా నాయర్ కుమారుడే. జొహ్రాన్ మమ్‌దానీ 1991 అక్టోబరులో ఉగాండాలోని కంపాలాలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులిద్దరూ భారత మూలాలున్న వ్యక్తులే కావడం విశేషం. తల్లి మీరా నాయర్ పంజాబీ హిందూ మహిళ. భారత దిగ్గజ దర్శకుల్లో ఆమె ఒకరు. 'సలామ్ బాంబే', 'మాన్‌సూన్ వెడ్డింగ్' వంటి ప్రముఖ చిత్రాలతో అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు. తండ్రి మహ్మద్ మమ్‌దానీ గుజరాతీ ముస్లిం. బాంబేలో జన్మించిన మహ్మద్ మమ్‌దానీ ఆ తర్వాత ఉగాండాకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ఈయన విద్యావేత్త. జొహ్రాన్ మమ్‌దానీకి ఐదేళ్ల వయసు ఉన్నప్పుడు ఆయన కుటుంబం దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌కు మారింది. ఆ తర్వాత రెండేళ్లకే న్యూయార్క్‌కు మకాం మార్చి అక్కడే స్థిరపడింది. సైన్స్, ఆఫ్రికన్ స్టడీస్‌లో జొహ్రాన్ మమ్‌దానీ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. జొహ్రాన్ మమ్‌దానీ రాజకీయ విజయాల వెనుక తల్లిదండ్రుల పాత్రే ఎక్కువ. ముఖ్యంగా తల్లి మీరా నాయర్ జీవితం నుంచే ఆయన ఎన్నో పాఠాలు నేర్చుకున్నారు. నాలుగు దశాబ్దాల తన సుదీర్ఘ కెరీర్‌లో ఆమె ఎన్నో ఎత్తుపల్లాలు చూశారు. సంప్రదాయ వాద, మూస సిద్ధాంతాలను సవాల్ చేస్తూ ముందుకుసాగారు. తన జీవిత అనుభవాలను ఒక్కగానొక్క కొడుకు జొహ్రాన్‌కు పాఠాలుగా చెప్పారు. 'మన కథలను తర్వాతి తరానికి మనం చెప్పకపోతే ఇంకెవరు చెబుతారు' అనేది ఆమె సిద్ధాంతం. ఆమె చెప్పిన కథలే జొహ్రాన్ రాజకీయ ప్రయాణానికి మూలస్తంభాలుగా నిలిచాయి. అణచివేతకు గళమెత్తాల్సిందే అనే నినాదంతో జొహ్రాన్ రాజకీయాల్లోకి వచ్చారు. 2020లో తొలిసారి న్యూయార్క్ అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఇప్పుడు న్యూయార్క్ నగర మేయర్‌గా విజయం సాధించి మరో చరిత్ర సృష్టించారు. మమ్‌దానీ విజయం అధ్యక్షుడు ట్రంప్ పాలనకు గట్టి ఎదురుదెబ్బగా మారింది. ఈ ఎన్నికల్లో ఆయనను అడ్డుకునేందుకు రిపబ్లికన్ నేతలు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించ లేదు. రిపబ్లికన్ల విధానాలను తీవ్రంగా వ్యతిరేకించే మమ్‌దానీ.. తన ప్రచారంలో పదునైన విమర్శలతో ఓటర్లను ఆకట్టుకున్నారు. దీంతో ట్రంప్ స్వయంగా రంగంలోకి దిగాల్సి వచ్చింది. మమ్‌దానీ ఎన్నికల్లో గెలిస్తే న్యూయార్క్ సిటీకి ఫెడరల్ సాయం అందదని ఓ దశలో అధ్యక్షుడు హెచ్చరించారు కూడా..! యూదు వ్యతిరేకి అంటూ రిపబ్లికన్లు ఆయనపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. వాటన్నింటికి ఎదురొడ్డి నిలిచిన మమ్‌దానీ.. ఓటర్ల దృష్టిని ఆకర్షించడం పైనే ప్రధా నంగా దృష్టిపెట్టారు. ఉచితాలు, హామీలతో ప్రచారం చేశారు. అవన్నీ కలిసొచ్చి మమ్‌దానీ విజయం సాధించారు.

## బ్యాలెట్‌పై నా పేరు లేకపోవడంతోనే ఓటమి..

వాషింగ్టన్(జనంసాక్షి): అమెరికా స్థానిక ఎన్నికల్లో అధికార రిపబ్లికన్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కీలకమైన న్యూయార్క్ మేయర్ పదవి సహా పలు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో డెమొక్రాట్లు విజయం సాధించారు. ఈ ఫలితాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. బ్యాలెట్‌లో తన పేరు లేకపోవడం వల్లే ఇలా జరిగిందనే అర్థం వచ్చేలా పోస్ట్ చేశారు. "బ్యాలెట్‌లో ట్రంప్ పేరు లేదు. మరోవైపు నెల రోజులకు పైగా కొనసాగుతోన్న ఫెడరల్ షట్‌డౌన్. ఈ రెండు కారణాల వల్ల రిపబ్లికన్లు ఎన్నికల్లో ఓడిపోవాల్సి వచ్చింది" అని పోల్‌స్టర్స్ సర్వే అభిప్రాయాన్ని ట్రంప్ తన ట్రూత్ ఖాతాలో షేర్ చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.

**కాలిఫోర్నియాలో రిగ్గింగ్..**

కాలిఫోర్నియాలో ఈ ఎన్నికల ఫలితాలపై ట్రంప్ అసహనం వ్యక్తంచేశారు. "రాజ్యాంగ విరుద్ధమైన రీమ్యాపింగ్ పేరుతో కాలిఫోర్నియాలో భారీ స్కామ్ జరిగింది. ఓటింగ్ ప్రక్రియలోనూ రిగ్గింగ్ చోటు చేసుకుంది. మెయిల్–ఇన్ ఓట్లను పక్కనబెట్టేశారు. ఇది చాలా తీవ్రమైన అంశం" అని ఆరోపించారు.

# జూబ్లీహిల్స్‌లో సత్తా చాటాలి

ఛాలెంజ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరాశ, నిస్పృహతో ఉన్నారని విమర్శించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఓటమి ఖాయమని రేవంత్‌కు అర్థమైందని సెటైర్లు గుప్పించారు. అందుకే తనపై రేవంత్‌రెడ్డి వ్యక్తిగత దూషణలకు దిగారని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి తప్పదని భావించి.. రేవంత్‌రెడ్డి తనపై విమర్శలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఆయన కంటే గట్టిగా తాను మాట్లాడగలనని... రేవంత్‌రెడ్డికి సమాధానం చెప్పే సత్తా తనకు ఉందని స్పష్టం చేశారు. కానీ తమ అధినేత కేసీఆర్ సూచనల తోనే రేవంత్‌రెడ్డిపై వ్యక్తిగత దూషణలకు తాను దిగటం లేదని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు చెప్పాలని కేసీఆర్ తనకు చెప్పారని పేర్కొన్నారు. తనను వ్యక్తిగతంగా విమర్శించిన.. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు కాబట్టి రేవంత్‌రెడ్డిని తాను గౌరవిస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్, జూబ్లీహిల్స్ అభివృద్ధిపై రేవంత్‌రెడ్డి చర్చకు రావాలని సవాల్ విసిరారు. హోంశాఖను పర్యవేక్షిస్తున్న రేవంత్‌రెడ్డి హయాంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఫైర్ అయ్యారు. హైదరాబాద్‌లో గన్, డ్రగ్ కల్చర్ పెరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్.. చెత్త సిటీ, క్రైం సిటీగా మారిందని విమర్శించారు. అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్లు కేసీఆర్ హయాంలోనే నిర్మించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్ని ఫ్లై ఓవర్లు కట్టారో చెప్పాలని సవాల్ విసిరారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో వంద లింకు రోడ్లు నిర్మించామని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రోడ్లపై ఉన్న ఒక గుంత కూడా ఎందుకు పూడ్చలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. సీఎం అంటే కటింగ్ మాస్టర్ మాదిరిగా రేవంత్ వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ సిటీలో మళ్లీ తాగునీటి కష్టాలు తెచ్చింది కాంగ్రెస్ సర్కార్‌నేనని విమర్శించారు. చెత్త సమస్య పరిష్కారానికి స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమానికి తాము శ్రీకారం చుట్టామని నొక్కిచెప్పారు. మెట్రో నిర్మించిన ఎల్అండ్ టీని సీఎం రేవంత్‌రెడ్డి బెదిరించారని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఫ్లైఓవర్లు, అండర్‌పాసులు నిర్మించామన్నారు. రేవంత్ ప్రభుత్వం కనీసం రోడ్లపై పడిన గుంతలనైనా పూడ్చిందా? అంటూ ప్రశ్నించారు.

# 'సామూహిక వీసాల రద్దు దిశగా కెనడా!

**అధికారాల కోసం ఆ దేశ ప్రభుత్వం ప్రయత్నాలు!**

**ఒట్టావా(జనంసాక్షి):** వీసా మోసాలను అరికట్టేందుకు కెనడా మరిన్ని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా భారత్, బంగ్లాదేశ్ నుంచి వీసా మోసాలు పెరుగుతున్నాయన్న అనుమానాల నేపథ్యంలో సామూహికంగా వీసాలను రద్దు చేసే అధికారాల కోసం కెనడా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి అమెరికా సంస్థలతో కలిసి ఇమిగ్రేషన్, రెఫ్యూజీ, సిటిజన్‌షిప్ కెనడా (ఐఆర్‌సీసీ), కెనడా బోర్డర్ సర్వీసెస్ ఏజెన్సీ (సీబీఎస్ఏ)లు ఇమిగ్రేషన్ మంత్రిత్వ శాఖకు ఇప్పటికే ఓ ప్రజెంటేషన్ ఇచ్చినట్లు సీబీసీ వార్తా కథనం వెల్లడించింది. మోసపూరిత విజిటర్ వీసా దరఖాస్తులను గుర్తించి రద్దు చేయడమే దీని ఉద్దేశంగా పేర్కొంది. మోసపూరిత విజిటింగ్ వీసా దరఖాస్తులను తిరస్కరించడం, రద్దు చేయడం కోసం కెనడా సంస్థలు–అమెరికా భాగస్వామ్యపక్షాలు ఓ వర్కింగ్ గ్రూపుగా ఏర్పడినట్లు ఆ ప్రజెంటేషన్ ద్వారా తెలిసినట్లు తాజా నివేదిక వెల్లడించింది. భారత్, బంగ్లాదేశ్ నుంచి వచ్చే వీసా దరఖాస్తులను అందులో ప్రముఖంగా ప్రస్తావించినట్లు తెలిపింది. ఎటువంటి సందర్భాల్లో సామూహిక వీసా రద్దు అధికారాలు ఉపయోగించాలనే అంశాలను వివరించినట్లు సమాచారం.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ మరో సంచలన నిర్ణయం

- ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ సూల్ పిల్లలకు అండ
- టెన్త్ విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లించాలని నిర్ణయం
- ఆయా జిల్లా కలెక్టర్లకు లేఖ ద్వారా వెల్లడి



**కరీంనగర్, నవంబర్5 (జనంసాక్షి) :** కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుకునే విద్యార్థులందరికీ కేంద్రమంత్రి బండి సంజయ్ శుభవార్త అందించారు. ఈ ఏడాది టెన్త్ ఎగ్జామ్ ఫీజును పూర్తిగా చెల్లించేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముందుకొచ్చారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు కేంద్ర మంత్రి లేఖ రాశారు. అధికార వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 12,292 మంది విద్యార్థినీ, విద్యార్థులు పదో తరగతి చదువుకుంటున్నారు. వీరిలో కరీంనగర్ జిల్లాలో 4,847, సిరిసిల్ల జిల్లాలో 4059, సిద్దిపేట జిల్లాలో 1118, జగిత్యాల జిల్లాలో 1135, హన్మకొండ జిల్లాలో 1133 మంది విద్యార్థులున్నారు. వీరందరికీ పరీక్ష ఫీజు చెల్లించాలంటే రూ.15 లక్షలకుపైగా ఖర్చవుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారే. వారిలో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు కూలీ పని చేసి బతికేటోళ్లు .. పిల్లలకు పరీక్ష ఫీజు కూడా చెల్లించే పరిస్థితి లేదని తెలుసుకున్న బండి సంజయ్ తన నియోజకవర్గ పరిధిలోని ఆయా స్కూళ్లలో చదివే విద్యార్థుల ఫీజు మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించు కున్నారు. ఆ మొత్తాన్ని తన వేతనం నుండి చెల్లించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖలు పంపారు. వాస్తవానికి బండి సంజయ్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులతోపాటు సరస్వతి శిశు మందిరాల్లో చదువుకునే విద్యార్థులుసహా దాదాపు 20 వేల మందికి 'మోడీ గిఫ్ట్' పేరుతో బ్రాండెడ్ సైకిళ్లను పంపిణీ చేశారు. అతి త్వరలోనే సర్కారీ స్కూళ్లలో 9వ తరగతి చదువుకునే విద్యార్థులకు సైతం సైకిళ్లను పంపిణీ చేస్తామని ప్రకటించారు. అట్లాగే వచ్చే ఏడాది విద్యా సంవత్సరం ఆరంభంలోనే 'మోడీ కిట్స్' పేరుతో విద్యార్థులందరికీ స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్, జామెట్రీ బాక్స్, పెన్ను, పెన్సిళ్లు, స్టీల్ వాటర్ బాటిల్ ను పంపిణీ చేయబోతున్నారు.

# వరల్డ్ క్లాస్ ఫిలిం సిటీ ఏర్పాటు ఆలోచనలో ప్రభుత్వం

- సినీ పరిశ్రమకు నాడు నేడు మేలు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే
- సినిమా రంగ ప్రముఖుల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** వరల్డ్ క్లాసు ఫిలిం సిటీ ఏర్పాటు చేసే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో కలిసి తెలుగు క్లబ్ లో సినీ రంగ ప్రముఖులు, శ్రీరంగ కార్మిక నాయకుల సమావేశంలో ప్రసంగించారు. రాష్ట్రంలో సినీ పరిశ్రమ గురించి చాలామంది చాలా రకాలుగా మాట్లాడుతున్నారు కానీ నాడు ఉమ్మడి రాష్ట్రంలో నేడు ప్రత్యేక రాష్ట్రంలో సినీ పరిశ్రమకు ఏదైనా మేలు జరిగింది అంటే అది కాంగ్రెస్ ప్రభుత్వాల ఆధ్వర్యంలో నే అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. వేలాదిమంది సినీ కార్మికుల జీవితాలను మెరుగుపరచడానికి, చెన్నైలో ఉన్న సినీ పరిశ్రమను హైదరాబాద్ రప్పించడానికి సినీ స్టూడియోలు నిర్మించేందుకు ప్రభుత్వమే భూములు ఇచ్చిందని వివరించారు. ఒక అన్నపూర్ణ, పద్మాలయ, రామానాయుడు తదితరసిని స్టూడియోలు అన్ని కాంగ్రెస్ ప్రభుత్వాల ఆధ్వర్యంలోనే ప్రారంభం అయ్యాయని వివరించారు. ఫిలిం క్లబ్ కు స్థలం సైతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలోనే ఇవ్వడం జరిగిందని అన్నారు. సినీ కార్మికుల కోసం సీనియర్ నటుడు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో చిత్రపురి కాలనీ ఏర్పాటు కోసం దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డిని అడిగిమరీ ఏర్పాటు చేయించారని గుర్తు చేశారు. సినీ పరిశ్రమకు ఏ సమస్య వచ్చినా ఎలాంటి వినతి వచ్చినా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. హైదరాబాద్ గొప్పనగరం అన్ని భాషల వారిని అక్కున చేర్చుకుంటుంది ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ చక్కటి వాతావరణం తక్కువ ధరకే మానవ వనరులు లభ్యత హైదరాబాద్ కే సొంతం అన్నారు. సినీ పరిశ్రమ కోసం కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రతి సందర్భంలో నూ నిలబడ్డాయి అన్నారు భవిష్యత్తులోనూ నిలబడతాయని తెలిపారు. సినీ పరిశ్రమ బాగా ఎదగాలి ఎంత ఎదిగితే అంతమందికి ఉపాధి తద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. సినీ పరిశ్రమ ఈ రాష్ట్రంలో ఎదగాలంటే ఈ ప్రభుత్వం బలంగా ఉండాలి ఈ ప్రభుత్వం బలంగా ఉంటేనే సినీ పరిశ్రమ బాగా ఎదుగుతుందని తెలిపారు. సినీ పరిశ్రమకు సంబంధించిన ప్రతి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. మా అసోసియేషన్ కార్యాలయం నిర్మాణానికి స్థలం విషయంలో ఎఫ్డిసి చైర్మన్ తో మాట్లాడి ఆ కలను ప్రభుత్వం సహకారం అయ్యేలా ప్రయత్నం చేస్తుందని తెలిపారు. భవిష్యత్తులో మంచి సినిమాలు రావాలి. చిన్న సినిమాలు కూడా రావాలని అన్నారు. కార్యక్రమంలో ఎఫ్డిసి చైర్మన్ జిల్ రాజు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాస్వామ్యంలోనే నిజమైన విప్లవం

- మంత్రి సీతక్క
- నెదర్లాండ్స్ లో జరిగిన వీవీజీఎఫ్ సదస్సులో ప్రసంగం
- పెరూ దేశపు మొట్టమొదటి మహిళ ప్రధాని బెట్రిజ్ మెరినోతో మంత్రి సీతక్క భేటీ
- తెంతర్జాతీయ వేదికపై తెలంగాణ స్ఫూర్తిని చాటిన మంత్రి సీతక్క



**హైదరాబాద్(జనంసాక్షి) :** ప్రజాస్వామ్యంలోనే నిజమైన విప్లవం ఉంటుందని మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు. "ప్రతికూలతల నుండి మహిళా సాధికారత వైపు" అనే అంశంపై నెదర్లాండ్స్ లో జరిగిన వీవీజీఎఫ్ సదస్సులో ఆమె ప్రసంగించారు. తెలంగాణ పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అంతర్జాతీయ వేదికపై తెలంగాణ స్ఫూర్తిని ప్రతిధ్వనింపజేశారు. తన చిన్ననాటి ఆదివాసీ బాలిక జీవితం నుండి రాష్ట్ర మంత్రిగా ఎదిగిన ప్రేరణాత్మక ప్రయాణాన్ని, ఆ మార్గంలో సమాజానికి అందించిన సేవలను, ప్రజాస్వామ్య పోరాటాలను, కరోనా కాలంలో చేసిన సహాయ కార్యక్రమాలను సీతక్క వివరించారు. పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి, పేదల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రపంచ వేదికపై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ "నేను తెలంగాణలోని చిన్న ఆదివాసీ గిరిజన గ్రామంలో పుట్టాను. పేదరికం, అసమానతలు నా బాల్యాన్ని మలిచాయి. 16 ఏళ్ల వయసులో న్యాయం కోసం అడవుల్లోకి వెళ్లి నక్సలైట్ ఉద్యమంలో చేరాను. కానీ అసలైన మార్పు తుపాకీతో కాదు, విద్య, అనుభూతి, సాధికారతతో సాధ్యమవుతుందని తెలుసుకున్నాను " అని తెలిపారు. తాను జనజీవన స్రవంతిలో కలిసిన తర్వాత తిరిగి విద్యను ప్రారంభించి, ఎం.ఏ., ఎల్.ఎల్.బి., ఎల్.ఎల్.ఎం., మరియు ఉస్మానియా యూనివర్సిటీ నుండి పీహెచ్.డి పూర్తి చేసినట్లు చెప్పారు. "అడవుల నుండి ప్రజాస్వామ్య సభల వరకు నా ప్రయాణం సాక్ష్యం. ప్రజల కోసం ప్రజాస్వామ్యంలోనే నిజమైన విప్లవం ఉంటుంది" అన్నారు. సీతక్క తెలంగాణలో మహిళల సాధికారతపై ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. "ఇందిరా మహిళా శక్తి పాలసీ ద్వారా మహిళా సంఘాలను ఆర్థికంగా స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దుతున్నాం. మహిళలు క్యాంటీన్లు నడుపుతున్నారు, సోలార్ ప్లాంట్లు నిర్వహిస్తున్నారు, ఆర్టీసీకి బస్సులు అద్దె కు ఇస్తున్నారు, పెట్రోల్ బంకులు నడుపుతున్నారు. ఆర్టీసి బస్సులో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. ఉచిత ప్రయాణికులు ఇప్పుడు ఆర్టీసి అద్దె బస్సులకు యాజమానులుగా ఎదిగారు" అని ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళలు సాధించిన విజయాలను గ్లోబల్ వేదికపై ఆవిష్కరించారు.

ప్రపంచవ్యాప్తంగా మహిళల సాధికారత లక్ష్యంగా మారిందని ఆమె పేర్కొన్నారు. "ఆఫ్రికాలో కోడింగ్ నేర్చుకుంటున్న అమ్మాయి, లాటిన్ అమెరికాలో వ్యాపారం ప్రారంభించిన తల్లి, భారతదేశంలోని గిరిజన స్త్రీ... మన అందరికి ఒకే గమ్యం. మహిళ అభివృద్ధి చెందితే, సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుంది. మహిళల సాధికారతే దేశ సాధికారత," అని ఆమె హితవు పలికారు. "నా ప్రయాణం అడవుల నుండి గ్లోబల్ వేదికల వరకూ సాగింది. సాధికారత ఎవరో ఇస్తే కాదు. మనమే సాధించేది, పంచేది. ప్రపంచానికి మహిళల శక్తి చూపించాల్సిన సమయం వచ్చింది" అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

మంత్రి సీతక్క ప్రసంగం సదస్సులో పాల్గొన్న అనేకమంది మహిళలకు ప్రేరణగా నిలిచింది. ఆమె ప్రసంగం ముగిసిన వెంటనే వేదిక మొత్తం చప్పట్లతో మారుమోగింది. చిత్తశుద్ధి, నిబద్ధత, పట్టుదలకి కృషిని జోడిస్తే – ఎక్కడో ఆదివాసీ గిరిజన ప్రాంతంలో పుట్టిన సీతక్కలాంటి సాధారణ మహిళలు కూడా ప్రపంచ వేదికలపై తమ ముద్ర వేయగలరని చెప్పడానికి ఆమె విజయగాథ ఒక అద్భుతమైన ఉదాహరణగా నిలిచిందని పలువురు పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ సదస్సులో పెరూ దేశపు మొట్టమొదటి మహిళ ప్రధాని బెట్రిజ్ మెరినో, వివిధ దేశాలకు చెందిన మహిళా ఎంపీలు, మహిళా ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు. ఆయా దేశాల్లో నెలకొన్న పరిస్థితులు, మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు, సాధించాల్సిన లక్ష్యాలపై తమ అనుభవాలను వివరించారు.

# మల్టీప్లెక్సుల్లో ధరాఘాతం

- ఇలాగే కొనసాగితే థియేటర్ల మూత తప్పదు
- హెచ్చరించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** దేశంలో సింగిల్ స్క్రీన్ థియేటర్లు బాగా తగ్గిపోయాయి. మల్టీప్లెక్స్‌ల హవా నడుస్తోంది. అయితే, టికెట్ రేట్ల దగ్గరినుంచి తినే వస్తువుల వరకు మల్టీప్లెక్స్‌లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మినిమం టికెట్ ధర 200 రూపాయలు పైనే ఉంటోంది. కొన్ని మల్టీప్లెక్స్‌లలో వాటర్ బాటిల్ ధర 100 రూపాయలు.. కాఫీ ధర 700 రూపాయలు ఉంటోంది. సాధారణ, మధ్య తరగతి కుటుంబాలు మల్టీప్లెక్స్‌లకు వెళ్లే పరిస్థితి కనిపించటం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మల్టీప్లెక్స్‌లపై భారత అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. అత్యధిక ధరలు ఇలానే కొనసాగితే సినిమా హాళ్లు మూసుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది. మల్టీప్లెక్స్‌లలోని టికెట్ రేట్లు 200 రూపాయల వద్ద ఉండాలని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాతో పాటు మరికొంతమంది హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ప్రభుత్వ నిర్ణయంపై స్టే విధించింది. కానీ.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా అమ్మే ప్రతీ టికెట్‌కు సంబంధించిన ఆడిటబుల్ రికార్డ్స్ మెయిన్‌టేన్ చేయాలని ఆదేశించింది. అంతేకాదు.. ఆఫ్‌లైన్‌లో టికెట్ కొనే వారి నుంచి ఐడీ ప్రూఫ్ తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు నిర్ణయంపై ఓ పిటిషన్ వేసింది. ఆ పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహ్తా బెంచ్ తాజాగా విచారణ జరిపింది. ఇ÷్వచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్ నాథ్ మాట్లాడుతూ.. 'వీరీరు వాటర్ బాటిల్‌కు 100 రూపాయలు, కాఫీకి 700 రూపాయలు తీసుకుంటున్నారు' అని అన్నారు. ఇందుకు మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తరఫున కేసు వాదిస్తున్న అడ్వకేట్ ముకుల్ రోహత్గీ స్పందిస్తూ.. 'తాజ్ హోటల్‌లో కాఫీకి 1000 రూపాయలు తీసుకుంటు న్నారు. మరి వీరీరు ఆ రేట్‌ను ఫిక్స్ చేస్తారా?' అని అడిగారు. ఇందుకు విక్రమ్ నాథ్ బదులిస్తూ.. 'ఈ రేట్లు స్థిరంగా ఉండాలి. సినిమా రంగం రోజురోజుకు దెబ్బ తింటోంది. ఇలాంటి సమయంలో జనం వచ్చి సినిమాను ఎంజాయ్ చేసేలా రేట్లు ఉండాలి. లేకపోతే సినిమా హాళ్లు ఖాళీగా ఉండాల్సి వస్తుంది' అని అన్నారు. ముకుల్ స్పందిస్తూ..'కర్ణాటక హైకోర్టు తీసుకున్న నిర్ణయం సరైనది కాదు. ఆఫ్‌లైన్‌లో టికెట్ కొనే వారి నుంచి ఐడీ ప్రూఫ్ తీసుకోమంటే ఎలా?. ఐడీ కార్డులు పెట్టుకుని థియేటర్లకు ఎవరు వస్తారు?' అని ప్రశ్నించారు.

# ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



**రూ. 3 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన**

**పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

**పాలకుర్తి, నవంబర్ 05(జనంసాక్షి)** ప్రజల అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి పెద్దపీట వేస్తుందని. ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని వల్మిడి. ముత్తారం గ్రామాల మధ్య రూ.3 కోట్లతో సీఆర్ఆర్ నిధులతో బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు, రైతులను దృష్టిలో ఉంచుకొని కొత్త రోడ్లకు నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. వల్మిడి, ముత్తారం గ్రామాల మధ్య పురాతన బ్రిడ్జి ఇటీవల మొంథా తుఫాన్ తో కొట్టుకుపోయిందని దీంతో వారం రోజుల నుంచి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. గత పాలకులు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా కాలయాపన చేశారని విమర్శించారు. ఒక్క తుఫాన్ తాకిడికి గత 30 క్రితం నిర్మించిన బ్రిడ్జి కొట్టుకుపోయిందని అన్నారు. బ్రిడ్జి నిర్మించి తలపెటేందుకు ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఆర్ అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సీఆర్ఆర్ నిధుల నుంచి రూ. 3 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, తండాలు, గూడాలకు బీటి రోడ్లు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. సీసీరోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణానికి కూడా కృషి చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్పర్సన్ లావుడ్యా భాస్కర్, మాజీ ఎంపీటీసీ బొమ్మగాని మానస, భాస్కర్, రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి. భూమ రంగయ్య. తదితరులు ఉన్నారు.


# అమెరికాపై అదనపు సుంకాల సస్పెన్షన్ పొడిగింపు

- మరో ఏడాది పాటు అమల్లో..
- చైనా కీలక నిర్ణయం
- యధావిధిగా పది శాతం టారిఫ్

**బీజింగ్(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్– చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ల భేటీ తర్వాత రెండు దేశాల మధ్య ట్రేడ్‌వార్ కాస్త సద్దుమణిగింది. ఆ ఫలితంగా సుంకాల విషయంలో కీలక నిర్ణయాలు వెలువడుతున్నాయి. అమెరికా వస్తువులపై ఉన్న అదనపు 24 శాతం సుంకాల సస్పెన్షన్‌ను పొడిగిస్తున్నట్లు చైనా ప్రకటించింది. ఈ పొడిగింపు ఏడాది పాటు అమల్లో ఉండనుంది. పది శాతం టారిఫ్ మాత్రం కొనసాగనుంది. నవంబర్ 10 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానుంది.గత నెల చివర్లో డొనాల్డ్ ట్రంప్, షీ జిన్‌పింగ్‌ల భేటీ యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించిన సంగతి తెలిసిందే. గతవారం దక్షిణ కొరియా వేదికగా వీరిద్దరూ సమావేశమయ్యారు. "జిన్‌పింగ్‌తో భేటీ అద్భుతంగా జరిగింది. మా సమావేశంలో పలు అంశాలు చర్చకు వచ్చాయి. ఫెంటనిల్ తయారీలో వాడే ముడి ఉత్పత్తుల రవాణాను కట్టడి చేసేందుకు జిన్‌పింగ్ తీవ్రంగా శ్రమిస్తారని నేను విశ్వసిస్తున్నా. అందుకే ఫెంటనిల్ పేరుతో చైనాపై విధించిన 20శాతం సుంకాలను 10శాతానికి తగ్గిస్తున్నా. దీంతో బీజింగ్‌పై మొత్తం టారిఫ్‌లు 57శాతం నుంచి 47శాతానికి దిగి రానున్నాయి. ఇక, అమెరికా సోయాబీన్ ఉత్పత్తుల కొనుగోళ్లను చైనా తక్షణమే పునరుద్ధరించేందుకు అంగీకారం కుదిరింది" అని ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అరుదైన ఖనిజాలకు సంబంధించిన సమస్య కూడా పరిష్కారమైందని అమెరికా అధ్యక్షుడు ఈ సందర్భంగా తెలిపారు. ఇకపై చైనా నుంచి అమెరికాకు అరుదైన ఖనిజాల ఎగుమతులకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదన్నారు. చైనాతో త్వరలోనే వాణిజ్య ఒప్పందం కూడా కుదరనున్నట్లు సంకేతాలిచ్చారు.

# ప్రజావ్యతిరేక విధానాలపై నవంబర్ 26న జిల్లా కేంద్రాల్లో కార్యక్రమాలు

- సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, వ్యతిరేక కార్పొరేట్ కంపెనీల అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ నవంబర్ 26న జిల్లా కేంద్రాలలో కార్యక్రమాలను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం పశ్యపద్మ అధ్యక్షతన హైదరాబాద్ రాజ్ బహదూర్ గౌడ్ హాల్లో జరిగింది. ఈ సమావేశానికి టీ సాగర్,బి రాము, మండల వెంకన్న, ఎం బిక్షపతి, వి ఉపేందర్ రెడ్డి, జక్కుల వెంకటయ్య, ఈ విజయ్ పాల్గొన్నారు. కార్పొరేట్ కంపెనీల దోపిడీకి వ్యతిరేకంగా, దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడాలని, పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని, నాలుగు లేబర్ కోడ్లలకు వ్యతిరేకంగా బ్లాక్ డేని పాటించడం, విద్యుత్ సవరణ బిల్లు 2025 ను ఉపసవరించాలని,రుణమాఫీ చట్టం చేయాలని, తదితర డిమాండ్లపై పోరాటాలను ఉధృతం చేసినా,సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయడం లాంటి అనేక కార్యక్రమాలను సంవత్సరాలుగా నిర్వహి స్తున్నా ,కేంద్ర పాలకులు స్పందించక పోగా కార్పొరేట్ అనుకూల విధానాలను బరితెగించి అమలు చేయటానికి పూను కుంటున్నారు. కేంద్ర పాలకుల విధానాలకు వ్యతిరేకంగా నవంబర్ 26వ తేదీన జిల్లా కేంద్రాలలో జరుగు కార్యక్రమాలను జయప్రదం చేయటానికి అధిక సంఖ్యలో రైతులను కార్మికులను ప్రజలను సమీకరించాల్సిందిగా సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. రౌండ్ టేబుల్ సమావేశాలను ఏర్పాటు చేసి నవంబర్ 26వ జరిగే కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.

# రియాజ్‌తో నాకు సంబంధం లేదు

**సోషల్ మీడియా వార్తలను ఖండించిన ఆసిఫ్**

**నిజామాబాద్, నవంబర్5 (జనంసాక్షి) :** నిజామాబాద్‌లో కానిస్టేబుల్ ప్రమోద్ ను దారుణంగా హత్య చేసిన కరుడుగట్టిన నేరస్థుడు రియాజ్ ను పోలీసులు ఎన్ కౌంటర్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఎన్ కౌంటర్ మృతుడు రియాజ్ తో తనకు ఎలాంటి పరిచయం లేదని రియాజ్ ను పట్టుకున్న ఆసిఫ్ వెల్లడించారు. కానిస్టేబుల్ ను హత్య చేసిన నిందితుడు పారిపోతుంటే పట్టుకున్నానని తెలిపారు. నాపై సోషల్ మీడియా లో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. దొంగ నోట్ల కేసు, వాహనాల దొంగతనానికి కేసులు ఉన్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. నా పేరు పై ఒక్క వాహనం లేదు, ఒక్క పోలీస్ కేసు లేదు అని ఆసిఫ్ వెల్లడించారు. తాను మెకానిక్ ని కాదని.. తనది వెల్డింగ్ షాప్ అని వెల్డింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నాని తెలిపారు. రియాజ్ ఎన్ కౌంటర్ పై ఫ్యాక్ట్స్ ÷రైడింగ్ కమిటీ నాపై దుష్ప్రచారం చేస్తుంది అని ఆసిఫ్ మండిపడ్డారు.

# జమ్మూకశ్మీర్‌లో ఆపరేషన్ ఛత్రు..

- ఉగ్రవాదులను చుట్టుముట్టిన భద్రతా దళాలు

**శ్రీనగర్(జనంసాక్షి):** జమ్మూకశ్మీర్‌లో భద్రతా బలగాలు బుధవారం ఆపరేషన్ ఛత్రు ను చేపట్టాయి. కిష్టివాడ్ జిల్లాలో ముగ్గురు ఉగ్రవాదులు దాక్కున్నట్లు సమాచారం అందుకున్న భద్రతా బలగాలు ఉగ్రవాదులను చుట్టుముట్టాయి. దీంతో సైనికులకు, ఉగ్రవాదులకు మధ్య భారీగా ఎదురుకాల్పులు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. కిష్టివాడ్‌లోని ఛత్రు ప్రాంతంలో ముగ్గురు ఉగ్రవాదులు కొన్ని నెలలుగా నక్కి ఉన్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఉగ్రవాదులు నక్కి ఉన్నారనే సమాచారం అందుకున్న వెంటనే భారత సైన్యంలోని వైట్ నైట్ కార్ప్స్, కశ్మీర్ పోలీసుల సంయుక్త బృందాలు తెల్లవారుజామున సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఉగ్రవాదులను గుర్తించిన భద్రతా దళాలు వారిని చుట్టుముట్టాయి. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
6 నవంబర్ 2025

# జీశాట్-7ఆర్ ఉపగ్రహ ప్రయోగం

## భారత నావికాదళానికి కొత్త శక్తి



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చరిత్రలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. 2025 నవంబర్ 2వ తేదీన, దేశీయంగా అభివృద్ధి చేసిన శక్తివంతమైన లాంచ్ వెహికల్ మార్క్-3 రాకెట్ ద్వారా, భారత నావికాదళానికి చెందిన అత్యంత అధునాతన కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్-7ఆర్ (సిఎంఎస్-03) విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టబడింది. ఈ విజయం ఇస్రోకు గొప్ప సాంకేతిక మైలురాయి మాత్రమే కాదు, దేశ రక్షణ సామర్థ్యాలను ఇది గణనీయంగా పెంపొందించింది. అంతరిక్ష రంగంలో స్వావలంబన సాధించాలనే భారతదేశ లక్ష్యానికి ఇది తిరుగులేని నిదర్శనం.

**అత్యంత బరువైన ఉపగ్రహ ప్రయోగం -బాహుబలి ఘనత:**
శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి సాయంత్రం 5:26 గంటలకు నింగిలోకి దూసుకెళ్లిన ఎల్.వి.ఎం.3 రాకెట్‌కు 'బాహుబలి' అనే పేరు ఉంది. ఈ రాకెట్ సుమారు 4,400 కిలోల బరువున్న జీశాట్-7ఆర్ ఉపగ్రహాన్ని జియోసింక్రనస్ బదిలీ కక్ష్యలోకి (జిటిఒ) విజయవంతంగా చేర్చింది. భారత్ గడ్డపై నుంచి ప్రయోగించిన కమ్యూనికేషన్ ఉపగ్రహాల్లో ఇంత బరువైనది ఇదే మొదటిసారి. నిజానికి నాలుగు టన్నుల కంటే ఎక్కువ బరువున్న ఉపగ్రహాలను ప్రయోగించడానికి గతంలో విదేశీ సంస్థలపై ఆధారపడవలసి వచ్చేది. ఇప్పుడు ఎల్.వి.ఎం.3 విజయం ద్వారా ఆ సాంకేతిక అవరోధాన్ని ఇస్రో పూర్తిగా తొలగించింది.

**క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్ పునఃప్రారంభం-చరిత్రలో తొలిసారి:**
ఈ మిషన్‌లో ఉపగ్రహ ప్రయోగం మాత్రమే కాక, అంతకు మించిన ఒక ముఖ్యమైన సాంకేతిక ప్రయోగం కూడా జరిగింది. జీశాట్-7ఆర్ ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టిన తర్వాత, ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్‌లోని సి25 క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్ ఇంజిన్‌ను అంతరిక్షంలో మళ్లీ మండించి చూపారు. ఈ సామర్థ్యం రాకెట్ యొక్క కార్యాచరణ సౌలభ్యాన్ని అసాధారణంగా పెంచుతుంది. భవిష్యత్తులో ఈ రాకెట్ ఒకేసారి అనేక ఉపగ్రహాలను వేర్వేరు కక్ష్యల్లోకి ఖచ్చితంగా చేర్చడానికి, అలాగే గగన్‌యాన్ వంటి మానవ అంతరిక్ష యాత్రలకు అవసరమైన సంక్లిష్టమైన విన్యాసాలను నిర్వహించడానికి ఈ సాంకేతికత పునాదిగా నిలుస్తుంది.

**నావికాదళానికి 'వ్యూహాత్మక వరం' -జీశాట్-7ఆర్ పాత్ర:**
జీశాట్-7ఆర్ ఉపగ్రహం భారత నావికాదళానికి ఒక వ్యూహాత్మక వరం. ఇది 2013 నుంచి సేవలందిస్తున్న పాత జీశాట్-7 (రుక్మిణి) ఉపగ్రహం స్థానాన్ని భర్తీ చేస్తుంది. పూర్తిగా దేశీయంగా రూపకల్పన చేసి, అభివృద్ధి చేసిన ఈ ఉపగ్రహం, నౌకలు, జలాంతర్గాములు, విమానాలు, తీర ప్రాంత కమాండ్ కేంద్రాల మధ్య నిరంతరాయంగా, సురక్షితమైన కమ్యూనికేషన్ అనుసంధానాన్ని అందిస్తుంది. ఇది వాయిస్, డేటా, మరియు రియల్-టైమ్ వీడియోలను సైతం అత్యధిక వేగంతో పంపగల సామర్థ్యాన్ని కలిగి ఉంది.

**అధునాతన రక్షణ కవచం- జామింగ్‌కు చెక్:**
శత్రు దేశాల నుండి వచ్చే ఎలక్ట్రానిక్ దాడులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి జీశాట్-7ఆర్ అత్యాధునిక రక్షణ లక్షణాలను కలిగి ఉంది. ఇందులో ప్రధానంగా జామింగ్‌ను నిరోధించే సామర్థ్యాలు మరియు ఫ్రీక్వెన్సీ హాపింగ్ సాంకేతికత ఉన్నాయి. ఈ ప్రత్యేకతలు యుద్ధ వాతావరణంలో సైతం నావికాదళ కమ్యూనికేషన్ వ్యవస్థ పటిష్టంగా, భద్రంగా ఉండేలా చూస్తాయి. ఈ ఉపగ్రహం యూహెచ్ఎఫ్, ఎస్, సి, కేయూ, కేఏ వంటి బహుళ-బ్యాండ్‌లలో పనిచేస్తుంది.

**హిందూ మహాసముద్రంలో పటిష్టమైన పర్యవేక్షణ**
ఈ ఉపగ్రహం హిందూ మహాసముద్ర ప్రాంతం అంతటా పటిష్టమైన టెలికమ్యూనికేషన్ కవరేజీని అందిస్తుంది. ఈ కవరేజీ ఆగ్నేయాసియా వైపు మరియు తూర్పు ఆఫ్రికా తీరం వైపు కూడా విస్తరించి, తీరం నుండి 2,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న నావికాదళ ఆస్తులకు సైతం సేవలందిస్తుంది. జీశాట్-7ఆర్ అందించే ఈ మెరుగైన కమ్యూనికేషన్ అనుసంధానం ద్వారా, నావికాదళం యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, గగనతల నిఘా పరికరాలన్నింటినీ ఒకే నెట్‌వర్క్‌లోకి తీసుకురాగలదు. ఫలితంగా, నిజ సమయ పరిస్థితులపై అవగాహన పెరిగి వ్యూహాత్మకంగా కీలకమైన ఇండో-పసిఫిక్ జలాల్లో నావికాదళం సమన్వయంతో కూడిన కార్యకలాపాలను వేగంగా నిర్వహించడానికి వీలవుతుంది. అందుకే ఈ ఉపగ్రహాన్ని నావికాదళానికి శక్తి గుణకం అని వ్యవహరిస్తున్నారు.

**దేశ భద్రతలో స్వావలంబన వైపు ఒక అడుగు:**
రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, సంక్లిష్టమైన భద్రతా సవాళ్ల మధ్య, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దేశ సముద్ర ప్రయోజనాలను కాపాడాలనే భారత నావికాదళ సంకల్పాన్ని జీశాట్-7ఆర్ ప్రతిబింబిస్తోంది. ఈ ఉపగ్రహం పూర్తిగా దేశీయంగా తయార వ్వడం మరియు దేశీయ రాకెట్ ద్వారా ప్రయోగించడం వలన, అత్యవసర సమయాల్లో విదేశీ కమ్యూనికేషన్ వ్యవస్థలపై ఆధారపడాల్సిన అవసరం తప్పింది. ఇది భారత సార్వభౌమత్వానికి, భద్రతకు అత్యంత కీలకమైన అంశం.



జనక మోహన రావు దుంగ
ఫోన్: 8247045230

# బ్లూమ్‌స్క్రోలింగ్: డిజిటల్ మాయ



స్మార్ట్‌ఫోన్ ఇప్పుడు మన రోజువారీ జీవితంలో అంతర్భాగమైపోయింది. సమాచారం, సంభాషణ, వినోదం – అన్నీ ఒక్క చిటికెలో అందుబాటులోకి వచ్చేశాయి. ప్రపంచం మొత్తం మన చేతిలో ఉన్నట్లు అనిపిస్తుంది. కానీ ఈ సౌలభ్యం తగు మోతాదులో లేకపోతే, అది మన మనసు, సంబంధాలు, పనితనం – అన్నింటినీ దెబ్బతీస్తుంది. ఇటీవల 'బ్లూమ్ స్క్రోలింగ్' అనే పదం ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇది ఒక ఆధునిక డిజిటల్ అలవాటుగా మారింది. సామాజిక మాధ్యమాలు, యాప్‌లు మనకు తక్షణ ఆనందాన్ని ఇస్తాయి. కానీ ఆ ఆనందం క్షణికమైనది, దీర్ఘకాలంలో మనల్ని బానిసలుగా మారుస్తుంది. ఈ అలవాటు మొదట సరదాగా మొదలై, తర్వాత వ్యసనంగా రూపాంతరం చెందుతుంది. ప్రపంచ వ్యాప్తంగా మిలియన్ల మంది దీని ప్రభావంలో పడుతున్నారు. మన దేశంలోనూ యువత, ఉద్యోగులు, విద్యార్థులు ఈ మాయలో చిక్కుకుంటున్నారు.

**అలవాటా.. వ్యసనమా?**
బ్లూమ్‌స్క్రోలింగ్ అంటే సంతోషం, మోటివేషన్ ఇచ్చే పోస్టులు, రీల్స్, వీడియోలు చూస్తూ మనసు తృప్తి పొందే వరకు స్క్రోలు చేయడం. మొదట్లో ఇది చిన్న ఆనందాన్ని ఇస్తుంది. ఒక మోటివేషనల్ కోట్ చూసి మనసు ఉత్సాహపడుతుంది, ఒక ఫన్నీ రీల్ చూసి నవ్వు వస్తుంది. కానీ తర్వాత అదే ఆనందం కోసం మనసు ఎక్కువ సమయం స్క్రీన్ వైపు చూస్తుంది. ఫలితంగా అది మానసిక వ్యసనంగా మారుతుంది. ఉదాహరణకు, ఇన్‌స్టాగ్రామ్‌లో మోటివేషనల్ కోట్స్ చూస్తూ చదువు సమయంలో ఫోన్ పట్టుకున్న విద్యార్థి దృష్టి కోల్పోతాడు. లింక్‌డిన్, యూట్యూబ్‌లో మోటివేషనల్ వీడియోలు చూస్తూ పని ఆలస్యం చేసిన ఉద్యోగి ఉత్పాదకత తగ్గిస్తాడు. రాత్రి ఇంట్లో దంపతులు మాటలు మార్చుకోకుండా ఒకే కౌచ్‌పై రీల్స్ చూస్తే భావోద్వేగ దూరం పెరుగుతుంది. ఈ అలవాటు డోపమైన్ హార్మోన్‌ను ఉత్పత్తి చేసి మనల్ని మరింత స్క్రోల్ చేయమంటుంది. ఫలితంగా రోజుకు గంటల తరబడి సమయం వృథా అవుతుంది. పరిశోధనల ప్రకారం, సగటు వ్యక్తి రోజుకు 3-4 గంటలు సోషల్ మీడియాలో గడుపుతున్నాడు. ఇది మొదట అలవాటుగా మొదలై, తర్వాత వ్యసనంగా మారి మన జీవితాన్ని నియంత్రిస్తుంది.

**మనసుపై ప్రభావం**
బ్లూమ్‌స్క్రోలింగ్ మనసులో 'ఇంకో మంచి వీడియో చూడాలి' అనే అశాంతిని పెంచుతుంది. దీని వల్ల నిద్రలో అంతరాయం వస్తుంది. రాత్రి ఆలస్యంగా స్క్రోల్ చేస్తే మెదడు రిలాక్స్ కాకుండా ఉత్తేజితమవుతుంది. దృష్టి కేంద్రీకరణ తగ్గుతుంది – ఒక పని మొదలుపెట్టి మధ్యలో ఫోన్ చూసి మళ్లీ కొనసాగించలేకపోతాం. నిజమైన ఆనందం మరచిపోతాం. ప్రకృతిలో నడక, స్నేహితులతో మాటలు, పుస్తకం చదవడం – ఇవన్నీ దూరమవుతాయి. పోలికలు పెరిగి స్వీయ-సందేహం ఎక్కువవుతుంది. ఇతరుల హైలైట్ రీల్స్ చూసి 'నా జీవితం ఇంతేనా?' అని అనిపిస్తుంది. మానసిక ఆరోగ్య నిపుణులు దీన్ని 'డిజిటల్ డిప్రెషన్'కు కారణంగా చెబుతున్నారు. స్క్రీన్‌పై ఆధారపడిన ఆనందం నిజ జీవిత సంతోషాన్ని దూరం చేస్తుంది. దీర్ఘకాలంలో ఆందోళన, ఒంటరితనం, డిప్రెషన్ పెరుగుతాయి. మన మెదడు ఎప్పుడూ 'నెక్స్ట్' కోసం వెతుకుతూ అలసిపోతుంది.

**సంబంధాలపై దెబ్బ**
స్నేహం, కుటుంబం, దాంపత్యం – ఏ సంబంధంలోనైనా బ్లూమ్‌స్క్రోలింగ్ భావోద్వేగ అనుబంధాన్ని బలహీనపరుస్తుంది. ఫోన్ ఫీడ్‌లో సంతోషం వెతికే సమయంలో మనిషిపై కాకుండా యాప్‌పై దృష్టి నిలుస్తుంది. మాట్లాడే సమయం తగ్గుతుంది – భోజనం సమయంలో కూడా ఫోన్ చూస్తూ మాటలు మార్చుకోం. అర్థం చేసుకునే తత్వం క్షీణిస్తుంది – ఇతరుల భావాలు పట్టించుకోకుండా స్వీయ ఫీడ్‌లో మునిగిపోతాం. ఫలితంగా సంబంధాలు యాంత్రికమవుతాయి. దంపతుల మధ్య శారీరక సామీప్యం ఉన్నా భావోద్వేగ దూరం పెరుగుతుంది. పిల్లలు తల్లిదండ్రులతో మాటలు తక్కువ, ఫోన్‌తో ఎక్కువ సమయం గడుపుతారు. స్నేహితుల మధ్య రియల్ టైమ్ సంభాషణలు తగ్గి, వర్చువల్ లైక్‌లు పెరుగుతాయి. పరిశోధనలు చెబుతున్నాయి – అధిక సోషల్ మీడియా ఉపయోగం సంబంధాల్లో అసంతృప్తిని పెంచు తుంది. నిజమైన అనుబంధం కోసం మనిషి అవసరం, యాప్ కాదు.

**పనితనం.. విద్యపై ఆటంకం**
కార్పొరేట్ రంగంలో బ్లూమ్‌స్క్రోలింగ్ ఉత్పాదకత హంతకంగా మారింది. మోటివేషనల్ వీడియోలు, కెరీర్ బూస్టింగ్ కంటెంట్ చూస్తున్నప్పుడు అది గ్రోత్ మైండ్‌సెట్‌లా కనిపిస్తుంది. కానీ నిజానికి రియల్ యాక్షన్‌ను ఆలస్యం చేస్తుంది. దిశారహిత మల్టీటాస్కింగ్ పెరుగుతుంది – ఒక ఈ-మెయిల్ రాస్తూ మధ్యలో రీల్ చూసి మళ్లీ మొదలు. పనిపట్ల ఆసక్తి తగ్గుతుంది, మీటింగ్‌ల్లో ఏకాగ్రత లోపిస్తుంది. కంపెనీలు ఇప్పుడు 'డిజిటల్ డిటాక్స్' ప్రోగ్రామ్‌లు ప్రవేశపెడుతున్నాయి. విద్యాసంస్థల్లో విద్యార్థులు 'స్టడీ వ్లాగ్స్' చూస్తూ చదువుతానంటారు కానీ నిజంగా చదవడం మరచిపోతారు. వర్చువల్ ప్రోగ్రెస్ ఎక్కువ – ఇతరుల స్టడీ రొటీన్ చూసి సంతృప్తి పొందడంబీ రియల్ ప్రోగ్రెస్ తక్కువ – సిలబస్ పూర్తి చేయడం ఆలస్యం. ఫలిత ఆందోళన పెరుగుతుంది, నేర్చుకోవడం కంటే పోలికలు ఎక్కువవుతాయి. పరీక్షల సమయంలో ఆందోళన, గ్రేడ్‌లు తగ్గడం సాధారణమవుతున్నాయి. ఈ అలవాటు భవిష్యత్ తరాల మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది.

బ్లూమ్‌స్క్రోలింగ్‌ను నియంత్రించేందుకు స్క్రీన్ టైమ్ పరిమితులు ఉంచండి – యాప్‌లు ఆటోమాటిక్‌గా లిమిట్ సెట్ చేయండి. ఫోన్ ఉపయోగానికి స్పష్టమైన ఉద్దేశం కలిగి ఉండండి – సమాచారం కోసమే, వినోదం కోసం కాదు. రాత్రివేళలో 'నో-స్క్రోల్ జోన్' సెట్ చేయండి – బెడ్‌రూమ్‌లో ఫోన్ లేకుండా చేయండి. రియల్ లైఫ్ సంతోషాలు – కుటుంబం, స్నేహం, ప్రకృతి, హాబీలు – పై దృష్టి పెట్టండి. మెడిటేషన్, ఎక్సర్‌సైజ్, పుస్తకాలు చదవడం వంటివి అలవాటు చేసుకోండి. పాఠశాలలు, కార్పొరేట్‌లు డిజిటల్ వెల్‌నెస్ ప్రోగ్రామ్‌లు నిర్వహించాలి.

బ్లూమ్‌స్క్రోలింగ్ మనసును ఉత్తేజపరచదు, మాయ చేస్తుంది. లైక్‌ల కంటే లైఫ్ విలువైనది. స్క్రోలింగ్‌తో కాకుండా స్మైల్‌తో జీవితాన్ని మార్చుకుందాం. మన మనసు ఎలా వికసించాలో మనమే నిర్ణయించుకోవాలి. డిజిటల్ ప్రపంచం సాధనం మాత్రమే, జీవితం కాదు.




సంపత్ జాంగిలి
చైల్డ్ ట్రైనర్, మానసిక ఆరోగ్య నిపుణుడు, శిక్షకుడు.
సెల్ :9849051812.

## ధర్మో రక్షతి!

ధర్మోరక్షతి రక్షితః
వినటానికి బాగుంది!
వేలసంవత్సరాలుగా
వింటున్న నీతిసూత్రం!
ధర్మాన్నిఎవరురక్షించాలి?
ఎవరు రక్షించటం లేదు?
రక్షించేవాళ్ళు బాగున్నారా?
రక్షించనివాళ్ళుబాగున్నారా?
అసలు ఏది ధర్మం?
చాతుర్వర్ణ ధర్మాలు!
ఆ కాలంలో చెప్పారు!
కాలం మారిపోయింది!
బ్రాహ్మణ క్షత్రియ వైశ్య
త్రైవర్ణ ధర్మాలు ఏవి?
సూద్ర ధర్మాలు ఏవి?
ఇవి రక్షించబడాలి!
బ్రాహ్మణ ధర్మం ఏది?
వాళ్ళు 'గుడి'నినమ్మారు!
నేటికీ'గుడి'తోనే ఉన్నారు!
ధర్మ రక్షణ జరుగుతోంది!
క్షత్రియధర్మం ఏది?
రాజ్యభారం! సుజనరక్షణ!
ఇపుడుపాలించేవాళ్లెవరు?
ధర్మమే మారిపోయింది!
వైస్యులధర్మం ఏది?
వ్యవసాయం చెయ్యటం!
అదీ ఆనాటి వాళ్ళ ధర్మం!
ఇప్పుడు ధర్మం మారింది!
సూద్ర ధర్మం ఏది?
త్రైవర్ణాలను సేవించటం!
ఇప్పుడు సాధ్యమౌతుందా?
ఇక్కడా ధర్మం మారింది!
మారుతుంది కాబట్టే
ధర్మం 'చర' అన్నారు!
చాతుర్వర్ణ ధర్మం కాదు
నేడు ప్రజాస్వామ్య ధర్మం!
ఆ పాత నీతి సూత్రం
నేడు పనికిరాదు!
ప్రజాస్వామ్య సూత్రాలతో
కొత్తగారాసిందే రాజ్యాంగం!
రాజ్యాంగ ఉల్లంఘనచేసి
మనువాద ఫాశిస్టులు
వీరంగమాడుతున్నారు!
ధర్మాన్ని చెడగొట్టారు!
కంచే చేను మేస్తోంది!
మనువాద ఫాశిస్ట్ కార్పొరేట్
అధర్మపాలననుంచి
దేశాన్నికాపాడదాం రండి!
వాళ్ళు చెప్పినధర్మాన్ని
వాళ్ళే తుంగలో తొక్కారు!
ధర్మం కాలాను గుణం!
ధర్మో రక్షతి రక్షితః!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# ప్రజాస్వామ్య పరిణామం – అసమానత, స్వేచ్ఛ కోసం మనిషి!




సామాజిక మత రాజకీయ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అర్థం చేసుకోవాలంటే మనిషి సామాజిక జీవన చరిత్ర మొత్తం దాదాపు ఒక చూపులో కనిపించాలి. ఆదిమ గుంపుల నుంచి ఆధునిక రాజ్యాంగ ప్రజాస్వామ్యాల వరకు వచ్చేటప్పటికి బాహ్య రూపం మారినా అధికారం, అసమానత, దోపిడీ, ప్రతిఘటన అనే నాలుగు ధారలు పదేపదే కనిపిస్తూనే ఉంటాయి.

ఆదిమ కాలంలో చిన్న చిన్న వేటగాళ్ల గుంపులు, వలస జీవితమో లేక చిన్న వ్యవసాయ గ్రామాల రూపమోలో మనిషి జీవితం సాగింది. నాయకత్వం గుంపుకు బలంగా ఉన్నవారి చేతిలో ఉండేది, బలహీనులపై ఆధారపడిన జీవితం, ప్రకృతి విపత్తుల భయం, బలవంతపు శ్రమ అనే సమస్యలు అప్పటికే ఉన్నాయి. రాజ్యం, చట్టం, రాజ్యాంగం లాంటి భావనలు లేవు కాని సామాజిక ఒత్తిడి, లింగ వివక్ష, బలాబల సంబంధాలు చాలా బలంగా ఉండేవి.

2.వ్యవసాయ విప్లవంతో స్థిర గ్రామాలు, దాని వెంట రాజ్యాలు, సామ్రాజ్యాలు ఏర్పడ్డాయి. పురాతన భారతదేశం, మెసపొటేమియా, ఈజిప్ట్, చైనా, గ్రీస్, రోమ్ వంటి నాగరికతల్లో ప్రజల మెజారిటీకి రాజనీతి హక్కులే లేవు. రాజు, సామంతులు, పూజారి వర్గాలు పైభాగంలో, దాసులు, బానిసలు, అట్టడుగు కూలీలు క్రిందభాగంలో ఉండే కఠినమైన పిరమిడ్ ఆకారం ఏర్పడింది. ధర్మశాస్త్రాలు, మతపుస్తకాలు చాలా సార్లు ఈ హైరార్కీకి పవిత్ర ముద్ర వేసే పని చేశాయి. పన్నుల భారంతో రైతు జీవితమేలాంటిదో, న్యాయం పేరుతో జరిగే శిక్షలు ఎంత కఠినంగా ఉన్నాయో చరిత్ర చెబుతుంది. ప్రజల సమస్యల కేంద్రం అప్పుడు అధికార దుర్వినియోగం, యుద్ధాల బాధ, బలవంతపు శ్రమ, దాస్య జీవితం.

ఇలాంటి నేపథ్యంతోనే గ్రీసు దేశంలోని ఏథెన్స్ నగర రాష్ట్రంలో క్రీస్తుపూర్వ అయిదో శతాబ్దం వెలుగులోకి వచ్చిన డెమోక్రసీ భావనకు ప్రత్యేక ప్రాధాన్యం వచ్చింది. అక్కడ "డెమోక్రటికా" అంటే ప్రజల పాలన అనే భావం అభివృద్ధి చెందింది. అన్ని వయోజన పురుష పౌరులు సభలో నేరుగా పాల్గొని నిర్ణయాలు తీసుకునే విధానం అమలులోకి వచ్చింది. అయితే స్త్రీలు, బానిసలు, విదేశీయులు పౌరులుగా పరిగణించబడలేదు, అంటే ప్రాజాతంత్ర భావం పరిమిత వర్గానికే. ప్రజలు ఎదుర్కొన్న సమస్య ఏమిటంటే స్వేచ్ఛ భావన పుట్టినా సమానత్వం భావన పూర్తి స్థాయిలో అమలుకాలేదు, ప్రజా సమావేశాలు కూడా ప్రభావవంతుల చేతిలోకి జారిపోవడం, జనతను రెచ్చగొట్టే నాయకుల ప్రభావం పెరగడం వంటి సమస్యలు అప్పుడే కనిపించాయి.

మధ్యయుగాల్లో యూరప్, ఆసియా చాలా ప్రాంతాల్లో సామంత రాజ్యాలు, చర్చి సంస్థలు, ఖలీఫా రాజ్యాలు విస్తరించాయి. భూమి ఆధీనంలోని రైతు భద్రత యజమాని దయాధీనంగా ఉండేది. మతాధికారులు సాధారణ ప్రజలపై నీతి చట్టం పేరుతో ఒత్తిడి తెచ్చేవారు. కులవ్యవస్థ, జాతి వివక్ష, వర్ణ వివక్ష, జాతీయత విభజనలు సామాజిక జీవనాన్ని బిగించి పెట్టాయి. ప్రజాస్వామ్యమేమీ లేని పరిస్థితిలో సామూహిక తిరుగుబాట్లు, రైతు సంగ్రామాలు, మతసంస్కరణోద్యమాలు ప్రజా అసంతృప్తికి ప్రతిఫలం.

ఈ చీకటి నేపథ్యంలోనేగాని "రాజు కూడా చట్టానికి లోబడాలి" అనే భావన ముందుకు రాలేదు. ఇంగ్లాండ్‌లో 1215లో మాగ్నా కార్టా అనే ఒప్పందం రాజు అధికారానికి మొదటి చట్టపరమైన అడ్డుకట్టగా నిలిచింది, రాజాధికారాన్ని కాస్త చట్ట పరిమితుల్లో పెట్టింది, చట్టపరమైన హక్కులు, న్యాయస్థానం ముందు రాజు సహా అందరూ సమానులు అనే భావనకు బీజం వేసింది. అయినా ఓటు హక్కు, ప్రజాస్వామ్య పాలన భావనలు ఇంకా పెద్దగా అమలులోకి రాలేదు.

సామంత వ్యవస్థ క్రమంగా కూలిపోతుండగా సంస్థానాల స్థానంలో జాతీయ రాజ్యాలు, కాపిటలిస్ట్ ఆర్థిక వ్యవస్థ ఉద్భవించాయి. అమెరికా, ఫ్రాన్స్ విప్లవాలు "ప్రజల సార్వభౌమత్వం", "మనుషుల హక్కులు" అనే భావనలకు గొంతుకాయాయి. కానీ అప్పుడు కూడా ఓటు హక్కు పురుష భూస్వాములు, ఆస్తి కలిగినవారికి పరిమితం. క్రమంగా పద్దెనిమిదో శతాబ్దం నుంచి ఇరవయ్యో శతాబ్దం వరకు ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య పర్వం సాగే కొద్దీ ఓటు హక్కు విస్తరణ, కార్మికుల హక్కుల కోసం పోరాటాలు, మహిళా ఓటు హక్కు ఉద్యమాలు విస్తరించాయి. "యూనివర్సల్ సఫ్రేజ్" అంటే శరతుల్లేకుండా పెద్దవయసు పౌరులందరికీ ఓటు హక్కు అనే భావన స్థిరపడింది కాని ఇది చాలా దేశాల్లో చాలా ఆలస్యంగా అమలులోకి వచ్చింది.

భారతదేశంలో మాత్రం స్వేచ్ఛా సంగ్రామం మొదటి నుంచే రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సామాజిక సమానత్వ లక్ష్యాలతో కలిపి చూసింది. వలస పాలనా కాలంలో ఓటు హక్కు ఆదాయం, ఆస్తి, చదువు వంటి శరతులతో కూడుకున్న ప్రత్యేక హక్కు మాత్రమే, మొత్తం జనాభాలో మూడు నుంచి పది శాతం వరకూ మాత్రమే ఓటు వేసే అవకాశం ఉండేది. జాతీయోద్యమ నాయకులు "యూనివర్సల్ అడల్ట్ ఫ్రాంచైస్" అనే లక్ష్యాన్ని స్పష్టంగా ప్రకటించారు. భారత రాజ్యాంగ సభ పని ప్రారంభించేలోపు ఒక మనిషి ఒక ఓటు అనే మౌలిక సూత్రం దాదాపు ఏకగ్రీవంగా అంగీకరించబడింది. 1950లో అమలులోకి వచ్చిన రాజ్యాంగం ద్వారా 21 ఏళ్లుపైబడిన పౌరులం దరికీ ఓటు హక్కు ఇవ్వబడింది, తర్వాత 18 సంవత్సరాలకు తగ్గించబడింది. ఇది ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య ప్రయోగంగా పరిగణించబడింది. ఇంత బలమైన రాజ్యాంగ హామీలుండీ సామాజిక మత రాజకీయ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు ఇంకా ఎందుకు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు అనే ప్రశ్నకి సమాధానం నిర్మాణాత్మక అసమానతలు, ఆర్థిక దోపిడీ, సాంస్కృతిక హింస, సంస్థల బలహీనత అనే నాలుగు మూలాల్లో దొరుకుతుంది.

సామాజిక అసమానత గురించి చూస్తే ఆదిమ కాలం నుంచి ఉన్న కుల, జాతి, వర్గ, లింగ ఆధారిత గీతలు ఆధునిక ప్రజాస్వామ్యాల్లో కూడా మునుపటి రూపాలు మార్చుకుని నిలిచిపోయాయి. చట్టపరంగా సమాన హక్కులు ఉన్నా సామాజిక వాస్తవంలో పుట్టుక ఆధారంగా అవకాశాలు, విద్య, ఆరోగ్యం, భద్రత విభజించబడ్డాయి. అట్టడుగు కులాలు, గిరిజన సమూహాలు, తక్కువ వనరులు ఉన్న వర్గాలు నిర్ణయ ప్రక్రియలో ప్రతినిధ్యానికి నోచుకోకుండా చట్ట పుస్తకాల్లోని హక్కులు కాగితపు హక్కులుగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది. రాజ్యాంగం హామీ ఇచ్చిన సమానత్వాన్ని ఆచరణలో అమలు చేయడానికి ప్రజాస్వామ్య ప్రభుత్వాలు అవసరమైన వనరులు కేటాయించకపోవడం, విధానాలు సరిగ్గా అమలు కాకపోవడం వల్ల సామాజిక అసమానత తరతరాలకు పునరుత్పత్తి అవుతోంది.

మత సంబంధ పరిణామాలు కూడా ప్రజల జీవనంపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి. ఆధ్యాత్మిక విలువలు, సామూహిక ఆచారాలు, భక్తి సంస్కృతి సామాజిక ఐక్యతకు బలం ఇచ్చినప్పటికీ మత సంస్థలతో కలిసిన అధికార రాజకీయం తరచుగా విభజనకు దారి తీసింది. మతం పేరుతో స్త్రీలపై ఆంక్షలు, కులవ్యవస్థకు ధార్మిక న్యాయపరమైన గౌరవం, భిన్న మతాలకు చెందినవారిపై ద్వేషం, అఘటిత ఘర్షణలు ప్రజలకు నిత్య భయాన్ని కలిగిస్తుంటాయి. ప్రజాస్వామ్య కాలంలో మతం ఓటు బ్యాంకు రూపంలో రాజకీయ రంగంలోకి అడుగు పెట్టినప్పుడు సమస్యలు ఇంకా క్లిష్టమవుతాయి. ఎన్నికల్లో మతపరమైన భావోద్వేగాలు రెచ్చగొట్టడంవల్ల తర్కసామర్థ్యం తగ్గిపోతుంది, అభివృద్ధి, విద్య, ఆరోగ్యం వంటి అసలైన సమస్యలు వెనుకబడి గుర్తింపు రాజకీయాలు అన్నింటినీ మింగేసే స్థితి ఏర్పడుతుంది. మత స్వేచ్ఛ హక్కు రక్షణ, లౌకిక రాజ్యాంగ విలువల అమలు మధ్య సమతులనం సాధించలేకపోతే మెజారిటీ సంస్కృతి ఆధిపత్యం బలపడుతుంది, మైనారిటీ సమూహాలు అనిశ్చితిలో జీవించాల్సి వస్తుంది.

రాజకీయ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రధాన లక్ష్యాలు ప్రతినిధ్య పాలన, న్యాయ పాలన, భావ ప్రకటనా స్వేచ్ఛ, మానవ హక్కుల రక్షణ. ఇవి సిద్ధాంత స్థాయిలో అంగీకరించబడినా ప్రాయోగికంగా పెద్ద గ్యాప్ ఉంది. ఎన్నికల వ్యవస్థ డబ్బు, కుల ప్రభావం, మీడియా ప్రచారం, కార్పొరేట్ ప్రయోజనాల చేతిలో చిక్కుకోవడంతో సామాన్య పౌరుడి స్వచ్ఛమైన నిర్ణయం ముసుగులో పడుతుంది. రాజకీయ పార్టీలు లోపలే అంతర్గత ప్రజాస్వామ్యం బలహీనంగా ఉన్నప్పుడు టిక్కెట్ల పంపకం, నాయకత్వ మార్పులు లోకతంత్ర కంటే వంశపారంపర్యం, వర్గ ప్రయోజనాల ఆధారంగా జరుగుతాయి. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రజాప్రతినిధులు ఐదు సంవత్సరాల పాటు విమర్శలను పట్టించుకోకుండా అధికారానికి అలవాటు పడితే ప్రజల విశ్వాసం దెబ్బతింటుంది.

ఇంకో వైపు బూర్జువా ప్రజాస్వామ్యం ఆర్థిక నిర్మాణంతో కూడా బలంగా అనుసంధానమై ఉంది. కాపిటలిస్ట్ మార్కెట్ వ్యవస్థలో పెద్ద కార్పొరేట్ సంస్థలు రాజకీయ పార్టీలకు నిధులు, మీడియా సంస్థలకు ప్రకటనలు ఇచ్చి విధానాలను ప్రభావితం చేసే స్థాయికి ఎదిగాయి. ఫలితంగా కార్మికుల హక్కులు, రైతు సంక్షేమం, సామాజిక భద్రత లక్ష్యాలు తరచుగా లాభాల గరిష్టీకరణ లక్ష్యానికి లోబడిపోతాయి. ఆర్థిక విధానాలు అసమానత పెంచుతూ ఉండగా ప్రజాస్వామ్యం పేరు మాత్రం అలాగే నిలిచి ఉంటుంది. వాస్తవానికి ప్రజాస్వామ్యం రూపం, బలవంతపు మార్కెట్ విధానాలు కలిసిపోతే పేద, మధ్యతరగతి, అసంఘటిత కార్మిక వర్గాలు అధిక ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, నిరుపేదితనం, నగరికరణలో బహిష్కరణ వంటి సమస్యలతో పోరాడాల్సి వస్తుంది.


ప్రజాస్వామ్య వ్యవస్థలో మరో కీలక సమస్య సంస్థల బలహీనత. శాసనసభలు బలహీనంగా, చర్చలు సూటిగా జరగని పరిస్థితి, చట్టాలు వేగంగా ఆమోదించబడే ధోరణి, ప్రతిపక్షం స్థలం తగ్గడం ప్రజాస్వామ్య ఆత్మను నెమ్మదిగా కొరికి తింటాయి. న్యాయవ్యవస్థపై ఒత్తిడి, నియంత్రణ సంస్థలపై రాజకీయ ప్రభావం, స్వతంత్ర మీడియా బలహీనత, పౌర సమాజ సంస్థలపై అనుమానం పెరగడం వంటి పరిణామాలు ప్రజలకు న్యాయం, పారదర్శకత, బాధ్యతలపై నమ్మకాన్ని దెబ్బతీస్తాయి. చట్టం సామాన్య పౌరుడిపై కఠినంగా, శక్తివంతులపై సడలింపుతో ఉండే ద్వంద్వ ప్రమాణం చాలా చోట్ల కనిపిస్తుంది.

సాంకేతిక పరిణామాలు ప్రజాస్వామ్యానికి కొత్త అవకాశాలు ఇవ్వడంతోపాటు కొత్త సమస్యలూ తెచ్చాయి. డిజిటల్ మీడియా ద్వారా సమాచారం వేగంగా చేరుట, ప్రజలు అభిప్రాయాలు పంచుకోవటం సులువైంది. అదే సమయంలో తప్పుడు సమాచారం, ప్రాచుర్య యంత్రాంగం, ట్రోల్ సంస్కృతి, ద్వేష ప్రసంగం విస్తరించాయి. అల్గోరిథం ఆధారిత సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరు తమకు నచ్చిన అభిప్రాయాలతో నిండిన బుడగల్లో బంధించబడి ఇతర దృక్కోణాల్ని వినకపోవడం, నిర్వహిత దుష్ప్రచారాలు ఎన్నికల ఫలితాలకూ ప్రభావం చూపడం వంటి సమస్యలు గ్లోబల్ స్థాయిలో కనిపిస్తున్నాయి. రాష్ట్రాలు ప్రజా భద్రత పేరుతో పెద్ద ఎత్తున నిఘా సాంకేతికత, డేటా సేకరణ సాధనాలు వినియోగిస్తే పౌరుల గోప్యత, స్వేచ్ఛలపై కొత్త రకాల ప్రమాదాలు ఏర్పడుతున్నాయి.

ఇక ఆదిమ కాలం నుంచి "ప్రజల గళం" తరచుగా అణచివేయబడిందన్న దృక్కోణం నుండి చూస్తే ప్రతిఘటన కూడా అంతే పురాతనమైనది. రైతు తిరుగుబాట్లు, దాస్య నిర్మూలన ఉద్యమాలు, కార్మిక సమ్మెలు, మహిళా విముక్తి ఉద్యమాలు, పౌరహక్కుల కోసం పోరాటాలు, దళిత బహుజన ఉద్యమాలు, పర్యావరణ ఉద్యమాలు ప్రజాస్వామ్యాన్ని కేవలం ఎన్నికల ప్రక్రియ నుంచి జీవమున్న సామాజిక శక్తిగా మార్చాయి. ఇరవయ్యో శతాబ్దంలో "డెమోక్రసీ యూనివర్సల్ విలువ"గా గుర్తింపు పొందడం కూడా ఈ ప్రపంచవ్యాప్త పోరాటాల ఫలితమే. అయితే ఈ ఉద్యమాలకే వ్యతిరేకంగా ప్రతిచర్యశక్తులు కూడా ఏర్పడి హక్కుల క్షీణత, పౌర స్థల సంకుచితత, కార్యకర్తలపై కేసులు అనే రూపాల్లో నేడు చాలా దేశాల్లో కనిపిస్తున్నాయి.

ఇన్ని క్లిష్టతల మధ్య సామాన్య పౌరుడు ఎదుర్కొనే రోజువారీ సమస్యలు ఏకకాలంలో వ్యక్తిగతం, నిర్మాణాత్మకం. ఓటు వేసే హక్కు ఉన్నప్పటికీ స్థానిక స్థాయిలో నీళ్లు, విద్యుత్, పబ్లిక్ హెల్త్ సేవలు, విద్యాసదుపాయాల కొరతతో పోరాడాల్సిన పరిస్థితి ఉంది. కాగితంపై ఉన్న పౌర హక్కులను న్యాయస్థానం వద్ద వినిపించాలంటే సమయం, డబ్బు, అవగాహన అవసరం, ఇవి పేదవర్గాలకు పెద్ద అవరోధం. అధికార కార్యాలయాల్లో అవినీతి, నిర్లక్ష్యం, మధ్యవర్తుల ప్రభావం వల్ల తమ హక్కుల కోసం ప్రజలు అనేకసార్లు అల్లాడాల్సి వస్తుంది. సమాజంలో కలిసిమెలిసి ఉండటానికి అవసరమైన నమ్మకం, పరస్పర గౌరవం కూడా మత, కుల, జాతి, వర్గ విభజనల మధ్య తరచుగా దెబ్బతింటోంది.

ఈ మొత్తం చిత్రణ చూస్తే ఆదిమ గుంపుల నుంచి సమకాలీన రాజ్యాంగ ప్రజాస్వామ్యాల వరకు మనిషి సమాజం చాల దూరం ప్రయాణించింది. రాజ్యాంగం ముందు సమానత్వం, ఓటు హక్కు, మానవ హక్కుల భద్రత, సామాజిక న్యాయం లక్ష్యాల రూపంలో అద్భుత సిద్ధాంతాలు మనకు లభించాయి. ఇందులోపు మన పూర్వీకులలో చాలామందికి తమ పాలకుడికి వ్యతిరేకంగా మాట్లాడటమే అసాధ్యం. కానీ ఇదే సమయంలో పురాతన కాలపు ఆధిపత్య శక్తులు తమ రూపాలు మార్చుకుని ఆధునిక సంస్థల్లో, మత రాజకీయ సంస్కృతిలో, ఆర్థిక వ్యవస్థల్లో తిరిగి ప్రత్యక్షమవుతున్నాయి. ఈ పరిస్థితిలో ప్రజాస్వామ్యం ఒక్కసారిగా సిద్ధమయిన నమూనా కాదు, నిరంతర పోరాటం, విమర్శ, సంభాషణ, సామాజిక చైతన్యంతో నిండిన జీవ ప్రక్రియ. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మనం ఎంత నిజాయితీగా గుర్తిస్తామో, వాటి మూలాలను చరిత్రలో, నిర్మాణాల్లో, సాంస్కృతిక భావజాలంలో ఎంత లోతుగా విశ్లేషిస్తామో, అంత వరకూ వాటిని అధిగమించడానికి మార్గాలు కూడా తెరుచుకుంటాయి.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# వజ్రా ఎన్‌క్లేవ్ పార్క్ స్థలాన్ని ఆక్రమణల నుంచి రక్షించండి

**అల్వాల్, నవంబర్ 5 (జనంసాక్షి) :** ప్రభుత్వం కాలనికి ఆమోదించిన ప్రజా పార్కు భూమిని, అక్రమ ఆక్రమణల మరియు రాజకీయ జోక్యాల నుండి రక్షించాలని వజ్రా ఎన్‌క్లేవ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలని వాసులు విజ్ఞప్తి చేసారు. అల్వాల్ సర్కిల్ మచ్చ బొల్లారం 133 డివిజన్ పరిధి వజ్రా ఎంక్లేవ్‌లో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు వెల్లడించారు. వజ్రా పార్క్ భూమి జిహెచ్ఎంసి అధికారిక లేఅవుట్‌లోనే ప్రజా ఉపయోగం కోసం కేటాయించ బడిందని, దానిని ఆపేందుకు జరుగుతున్న ప్రయత్నాలు ప్రజల హక్కులను తుంచుతున్నాయనీ అసోసియేషన్ సభ్యులు తీవ్రంగా ఖండించారు. ప్రజా సదుపాయాల కోసం దశాబ్దాల నుండి పోరాటం సాగుతుందని, అల్వాల్ మండలంలోని సర్వే నంబర్లు 15, 16లో ఉన్న వజ్రా ఎన్‌క్లేవ్ మొత్తం 24 ఎకరాలు 22.6 గుంటలు విస్తీర్ణంలో 1993 సంవత్సరంలో అసోసియేషన్ ఏర్పాటు చేసి, తద్వారా కాలనీకి రోడ్లు, డ్రెయినేజ్, తాగునీటి సదుపాయం వంటి మౌలిక సదుపాయాల కోసం దశాబ్దాలుగా పోరాడామన్నారు. 2022లో ప్రారంభమైన ఆక్రమణల తొలగింపు చర్యల అనంతరం, కాలనీ కమిటీ జిహెచ్ఎంసి అధికారులకు పార్క్ అభివృద్ధి కోసం ప్రతిపాదన సమర్పించిందన్నారు. చిన్న పిల్లలు రోడ్డుపై ఆడుతూ ప్రమాదాలకు గురైన నేపథ్యంలో సురక్షితమైన ఆట స్థలం అవసరం ఉందని స్పష్టం చేసింది. తదుపరి ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు మొదలైన వారిని పలుమార్లు కలసి విజ్ఞప్తులు చేసిన అనంతరం, జిహెచ్ఎంసి “వజ్రా పార్క్”



అభివృద్ధికి ఆమోదం తెలిపిందని, నిధులు మంజూరు చేసి, కాంట్రాక్టర్ తో పనులు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. పార్క్ పనులు ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే, కొందరు వ్యక్తులు తమ వద్ద నకిలీ “గిఫ్ట్ డీడ్” ఉందని చెబుతూ పనులు ఆపివేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం హైడ్రా అధికారులు మరియు కాలనీ సంక్షేమ సంఘం పరిశీలనలో ఆ డాక్యుమెంట్ నమోదు కానిదని, చట్టబద్ధత లేనిది కాగా, దానిలో స్పష్టంగా “సమర్పణ కోసమే, ఆక్రమించుకోరాదని” పేర్కొనబడిందన్నారు. గతంలో ప్లాట్లు అమ్మిన జిపిఏ హోల్డర్‌కి ఆ భూమిపై ఏ హక్కు లేకుండా, 1996లో తప్పుడు పత్రం జారీ చేశారని రుజువైందని. కాలనీ కమిటీ సభ్యులు స్పష్టంగా తెలిపినట్లుగా, ఈ భూమి జిహెచ్ఎంసి ఆమోదించిన లేఅవుట్‌లోని ప్రజా పార్క్ కోసం కేటాయించిన ఖాళీ స్థలం మాత్రమే అని వివరించారు. రాజకీయ జోక్యం మరియు అధికారుల విరుద్ధ ఆదేశాలతో.. జిహెచ్ఎంసి ఆమోదం ఉన్నప్పటికీ, కొంతమంది రాజకీయ నాయకులు మరియు అధికారులు అనుచిత జోక్యం వల్ల పనులు నిలిచిపోయాయని వివరించారు. సీఎం ప్రజావాణి ద్వారా వెల్లడైన వివరాల ప్రకారం, జిహెచ్ఎంసి 133 డివిజన్ 133 మచ్చ బొల్లారం కార్పొరేటర్ స్వయంగా జిహెచ్ఎంసి అధికారులకు పార్క్ పనులు ఆపాలని లేఖ ఇచ్చినట్లు తేలిందని, ఈ చర్యతో 5,000కి పైగా నివాసితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ పార్క్ చుట్టూ ఉన్న ఆక్రమణలు 10 రోజుల్లో కూల్చి, ఫెన్సింగ్ చేయాలని ఆదేశించినప్పటికీ, మరో అధికారి శ్రీకాంత్ అసోసియేషన్‌కి “మూడు ఖాళీ ప్లాట్లు ఆక్రమణదారులకి ఇవ్వండి, లేకపోతే పార్క్ పనులు నిలుస్తాయని హెచ్చరించారని కాలనీ కమిటీ సభ్యులు ఆరోపించారు. పార్క్ అభివృద్ధికి మద్దతు ఇస్తున్న నివాసితులపై దాడులు, బెదిరింపులు, ఇళ్ళను తగలబెట్టేస్తామనే హెచ్చరికలు అందాయని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. వజ్రా ఎన్‌క్లేవ్ అసోసియేషన్ పారదర్శకతతో జిహెచ్ఎంసి, హైడ్రా అధికారిక పత్రాలను మీడియా ద్వారా సమర్పించారు. ఇవన్నీ జిహెచ్ఎంసి నుండి సమాచార హక్కు దరఖాస్తులపై అధికారికంగా అందిన పత్రాలని స్పష్టం చేశారు. జిహెచ్ఎంసి ఆమోదం ఉన్న మా కాలనీ పార్క్ అభివృద్ధి పనులు వెంటనే పునఃప్రారంభించేందుకు అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మేము ఏ రాజకీయ పార్టీకి అనుబంధం కానివాళ్ళమని, మా పిల్లలు, భవిష్యత్తు తరాల కోసం కాలని పార్క్ భూమిని రక్షించండని కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి అధ్యక్షుడు మహేందర్ రెడ్డి కోరారు.

## సంక్షేమ సంఘాలు అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలి

- ఎమ్మెల్యే కెపి వివేకానంద



**కుత్బుల్లాపూర్, నవంబర్ 5 (జనం సాక్షి) :** సంక్షేమ సంఘం నాయకులు అభివృద్ధికి బాసటగా నిలవాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. బుధవారం గాజుల రామారం డివిజన్ ఎన్టీఆర్ నగర్ ఏ బ్లాక్ నూతన సంక్షేమ సంఘం నాయకులు చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ సంఘం నాయకులు ప్రజలకు ప్రజాప్రతినిధులకు మధ్య వారదలుగా నిలవాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధి అనేది నిత్య ప్రక్రియ అని పేర్కొన్నారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని మౌలిక వసతులను కల్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఅర్ఎస్ డివిజన్ అధ్యక్షులు విజయరామ్ రెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజు, తెలంగాణ సాయి, చందు ముదిరాజ్, నూతన కార్యవర్గ సభ్యులు అధ్యక్షులు చంద్ర గౌడ్, ప్రధాన కార్యదర్శి రజాక్, ఉపాధ్యక్షులు వీరేష్ గౌడ్, అజ్మత్, కోశాధికారి శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, ఆంజనేయులు, కిషోర్, మోయిన్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల్లో కార్తీక దీపాల వెలుగులు

- కనకమామిడి సంగమేశ్వర దేవాలయానికి పోటెత్తిన భక్తులు

**మొయినాబాద్, నవంబర్ 5 (జనంసాక్షి) :** కార్తీక పౌర్ణమిని పురస్కరించుకోని మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో కార్తీక దీపాల వెలుగునిచ్చాయి. ఉగ్రతేజ మహాతేజ జన్యూ విజయకాల పరమేశ్వరుడి అనుగ్రహం అందరిపై ఉండాలని భక్తులు శివ నామస్మరనతో శివుడిని ప్రార్థించుకున్నారు. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా మండల పరిధిలోని కనకమామిడి సమీపంలో గల సంగమేశ్వర దేవాలయానికి జంట నగరాలతో పాటు ఆయా ప్రాంతాల నుంచి చుట్టు పక్కల గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున వేలాది మంది తరలివచ్చారు. దీంతో ఆలయంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రజలతో కిక్కిరిసిపోయింది. మహిళలు దేవాలయం ముందు కార్తీక పౌర్ణమి దీపాలను వెలిగించారు. అదే విధంగా దేవాలయ గర్భగుడిలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. దీంతో విచ్చేసిన భక్తులందరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ పూజారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు గంటలతరబడి క్యూలో నిలబడి శివుడిని దర్శించుకున్నారు. పూజారులు దేవుడి దర్శనంతో పాటు



తీర్థప్రసాదాలు, ఆశీర్వాదం, అన్నప్రసాదం నిర్వహించారు. కార్తీకపౌర్ణమి కావడంతో ఆలయం పక్కనే ఉన్న నీటి గుండం సమీపంలో చెట్ల కింద వన భోజనాన్ని భక్తులకు ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని అమ్డాపూర్, చిన్నమంగళారం, నక్కలపల్లి, కేతిరెడ్డిపల్లి, వెంకటాపూర్, శ్రీరామ్ నగర్ ఆయా గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో భక్తులు కార్తీక పౌర్ణమి దీపాలను వెలిగించి స్వామి వారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయాలు భక్తులతో సందడి నెలకొన్నది.

## గాలికొదిలేసిన ఆక్సిజన్ ప్లాంట్

- వృథా అవుతున్న ప్రజాధనం

**మర్పల్లి, నవంబర్ 5 (జనంసాక్షి) :** పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నప్పటికీ కొన్ని సౌకర్యాలు రోగులకు రోగులకు అందడం లేదు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రులను ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది. కానీ ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులు లోపించడంతో నాణ్యమైన వైద్యం అందడంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే స్తోమత లేక, పేద ప్రజలే ఎక్కువగా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటారు. అత్యవసర సమయాల్లో చికిత్స చేయడానికి సరైన సౌకర్యాలు లేకపోవడంతో జిల్లా ఆసుపత్రులకు రిఫర్ చేయడంతో బీద ప్రజలు ఎలా తీసుకెళ్లాలి ఎలా వైద్యం చేయించుకోవాలి అని మదన పడుతున్నారు. మర్పల్లి మండల కేంద్రంలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి కి చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రతిరోజు 300 పైగా వైద్యం నిమిత్తం ఆసుపత్రికి వస్తారు. ప్రభుత్వ ఆసుపత్రికి రోగుల తాకిడి ఎక్కువ కావడంతో గత ప్రభుత్వ ఆయాంలో సుమారు 70 లక్షల పైగా వ్యయంతో ఆసుపత్రి ఆవరణలో ఆక్సిజన్ ఉత్పత్తి చేసే ప్లాంటును



ఏర్పాటు చేశారు. ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేసినప్పటికీ అది అందుబాటులోకి రాలేదు . లక్షల రూపాయలు వెచ్చించి ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని, ఆక్సిజన్ ప్లాంట్ అందుబాటులోకి వస్తే ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగుల ప్రాణాలు కాపాడేందుకు సంజీవనేలాగా ఉంటుందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్య ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఆక్సిజన్ ప్లాంటు అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## రోడ్ల భద్రతను మెరుగుపరచడం అత్యవసరం

- మృతుల కుటుంబాలకు సంఘీభావంగా కొవ్వొత్తులతో ర్యాలీ



**తాండూరు, నవంబర్ 5 (జనంసాక్షి) :** చేవెళ్ల వద్ద జరిగిన దుర్ఘటనలో తాండూర్‌కు చెందిన 13 మంది ప్రాణాలు కోల్పోవడం పట్ల గాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబాలకు సంఘీభావంగా తాండూర్ పౌర సమాజం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం అంబేద్కర్ చౌక్ నుండి ఇందిరా చౌక్ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. పౌరులు, వాలంటీర్లు, సామాజిక సేవా సంస్థలు, విద్యార్థులు సహా అనేక మంది ర్యాలీలో పాల్గొని మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమం శాంతియుతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రోడ్ల భద్రతను మెరుగుపరచడం అత్యవసరమని అభిప్రాయపడ్డారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలైన తాండూర్%-%చేవెళ్ల రహదారి వంటి మార్గాల్లో భద్రతా ప్రమాణాలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి మానవీయ నష్టం మరల జరగకుండా నిరోధక చర్యలు తీసుకోవాలని వినతిపెట్టారు. మృతుల కుటుంబాలకు అండగా నిలవాలి, గాయపడిన వారికి ఉత్తమ వైద్యం అందేలా చూడాలని కోరుతూ, రోడ్డు సౌకర్యాలు, ట్రాఫిక్ భద్రత, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మెరుగుదలకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని తాండూర్ పౌర సమాజం పేర్కొంది.

# మహేశ్వరంలో చెరువులు కుంటలు మాయం

- మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్

**మహేశ్వరం, నవంబర్ 5 (జనంసాక్షి) :** మహేశ్వరం మండలంలో చెరువులు, కుంటలు కాలువలు మాయమవుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారని మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. బుధవారం కేసితండాలో ఉన్న కస్తూర్బా గాంధీ, మోడల్ స్కూల్, అగ్నిమాపక కేంద్రంలో బిజెపి నాయకులతో కలిసి అందెల శ్రీరాములు యాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా అందెల శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అవగాహన లోపం వల్లనే నేడు ఈ దుస్థితి నెలకొందిదన్నారు. లోతట్టు ప్రాంతాలలో పాఠశాలలకు, ప్రభుత్వ కార్యాలయాలకు భూమిని కేటాయించి నిర్మాణం చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించకుండా భవనాలు ఏ విధంగా నిర్మించారో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చెప్పాలన్నారు. మహేశ్వరం మండలంలో ఉన్న చెరువులను, కుంటలను, కాలువలను హైడ్రా అధికారులు, ఇరిగేషన్ శాఖ అధికారులు గుర్తించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్



చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుండే వెంకటేష్, పోతర్ల సుదర్శన్ యాదవ్, అయిల్ల యాదయ్య గౌడ్, శ్రీరాముల యాదవ్, కాసుల సురేష్, వనంపల్లి శ్రావణ్, చెన్నారెడ్డి, నరసింహ, దేవేందర్, రఘువీర్, జాపాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐమాక్స్ ఐకేర్ క్లినిక్‌ను ప్రారంభించిన మధు యాష్కీ గౌడ్



**హయత్‌నగర్, నవంబర్ 5 (జనం సాక్షి) :** హయత్ నగర్ కెప్టెన్ కుక్ హోటల్ సమీపంలో నూతనం గా ఏర్పాటు చేసిన ఐమాక్స్ ఐ కేర్ క్లినిక్‌ను టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కీ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవునికి ఉన్న అవయవాలలో ముఖ్యమైన అవయవం కన్ను దాని ద్వారా ప్రపంచాన్ని చూడగలుగుతున్నామని వారు చెప్పారు. కన్ను చాలా సున్నితమైన అవయవం, దానిని కాపాడుకోవాల్సిన అవశ్యకత ఎంతో ఉన్నదని వారు గుర్తు చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకొని వైద్యాన్ని అందించాలని వారు కోరారు. ఐమాక్స్ ఐ కేర్ క్లినిక్ నిర్వాహకులు దుబ్బ నరేందర్ గౌడ్ మాట్లాడుతూ ఎలాంటి కంటి సమస్యలు ఉన్న పరీక్ష చేసి, కంటి అద్దాలను అందరికీ అందుబాటు ధరలకు అందించబడునని వారు తెలియజేశారు. ఐమాక్స్ ఐ కేర్ క్లినిక్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిథులకు, హయత్ నగర్ ప్రజలకు వారు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హయత్ నగర్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు చెన్నాగోని రవీందర్ గౌడ్, గజ్జి భాస్కర్ యాదవ్, ప్రజ్ఞ శ్రీనివాసు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుబ్బ మల్లేష్ గౌడ్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, మూల దయానంద్ గౌడ్, లింగాల రవీందర్ గౌడ్, కుంచ సాయి కిరణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రతి నిరుపేదకు సొంత ఇల్లు ఏర్పాటు
- ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 5 (జనంసాక్షి) :** పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుదిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం హైదరాబాద్ లోని మినిస్టర్ క్యాంప్ కార్యాలయంలో మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీ మంఖాల్ లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల అలాట్మెంట్‌ను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మంఖాల్ డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ కార్యక్రమం గతంలో కేసు ఉండడం వల్ల ఆగిపోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం,జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ



తీసుకోవడం జరిగిందన్నారు. పెండింగ్‌లో ఉన్న 2848 మందికి డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అందించడం జరుగుతుందన్నారు. నిజమైన ఇల్లు లేని నిరుపేదలకు సొంత ఇంటి కలను నెరవేర్చే ఉద్దేశంతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మిస్తున్నమన్నారు. లబ్ధిదారులు జిల్లా అధికార యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ నాయక్, కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేఎల్ఆర్, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జీవీకే బంజారా మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించిన మధుయాష్కి

**హయత్‌నగర్, నవంబర్ 5 (జనం సాక్షి) :** ఎల్బీనగర్‌లోని కామినేని- సిరీస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జీవీకే బంజారా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు వైద్యం ఎంతో ఖరీదుగా మారిందని, వైద్యం కోసమే పేదలు అత్యధికంగా ఖర్చు పెడుతూ అప్పుల పాలవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ ఆసుపత్రులు లాభాపేక్షనే లక్ష్యంగా వైద్యం అందిస్తున్నాయని, కరోనా సమయంలో తరాలకు సరిపడా దోచుకున్నారని వారు విమర్శించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు సాధారణ చార్జీలతో వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రిని ఏర్పాటు చేసిన మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, డాక్టర్ శంకర్ నాయక్ లను వారు అభినందించారు. పేద, తరగతి వర్గాలు అన్ని రంగాల్లో



రాణించాలని, వైద్యం, విద్య అన్ని వర్గాలకు అందుబాటులో ఉన్నప్పుడే దేశం అభివృద్ధి సాధిస్తుందని వారు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేవలం రిజర్వేషన్లు మాత్రమే కాకుండా, జనాభాకు తగ్గట్టుగా దేశ వనరుల్లో వాటా కావాలన్నదే రాహుల్ గాంధీ ఆకాంక్ష అని వారు అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు అన్యాయానికి గురయ్యారని వారు విమర్శించారు. పేద వర్గాల మధ్య చిచ్చు పెడుతూ పాలన సాగించాడని గోండులకు, లంబాడీలకు మధ్య కేసీఆర్ చిచ్చుపెట్టడని వారు ఆరోపించారు. రాములు నాయక్ మరి కొన్ని ఆస్పత్రులు ఏర్పాటు చేసి పేద వారికి వైద్య సేవలు అందించాలని, ప్రభుత్వం నుంచి వారికి సహాయ, సహకారం అందించేందుకు తామంతా కృషి చేస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు, మాజీ ఎంపీ సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ప్రముఖ రచయిత, అంబేద్కర్ వాది జెబి రాజు, టీపీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, ఎస్టీ సెల్ ఎల్బీనగర్ అధ్యక్షులు రమేష్ నాయక్, దాము మహేందర్ యాదవ్, కొండోజు శ్రీనివాస్, సెలెటి నరేష్, హాస్పటల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరిహారం చెక్కులు అందజేత

**తాండూరు, నవంబర్ 5 (జనంసాక్షి) :** చేవెళ్ల మండలం మీర్జాపూర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తాండూరు మండలం గౌతాపూర్ కు చెందిన ముస్కాన్ బేగం, తాండూరు పట్టణం వాల్మీకి నగర్ కు చెందిన కిష్టాపురం వెంకటమ్మ, బృందావన్ కాలనీకి చెందిన తబాస్సుం జహాన్, ఓల్డ్ తాండూరుకు చెందిన దస్తగిరి బాబా (బస్సు డ్రైవర్) మృతి చెందడంతో వారి నలుగురి



కుటుంబాలను వారి ఇంటికి వెళ్ళి పరామర్శించి, ప్రభుత్వం తరపున ప్రకటించిన రూ. 7 లక్షలు, నలుగురికి గాను రూ. 28 లక్షల విలువ గల చెక్కులను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్ , సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ , ఆర్టీసీ ఆర్ ఎం శ్రీలత , డిప్యూటీ ఆర్ఎం సరస్వతి, రెవిన్యూ, ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు ఉన్నారు.

# పత్తి పంటకు నష్టపరిహారం ఇవ్వాలని నిరసన దీక్ష

**మక్తల్, నవంబర్ 5 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ఈ సంవత్సరం పత్తి రైతులు అధిక వర్షాల కారణంగా పత్తి పంట తీవ్రంగా నష్టపోయారు కావున ఎకరాకు 30 వేల నష్టపరిహారం చెల్లించి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలని సామాజిక కార్యకర్త హెచ్. నర్సింహా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఉట్కూర్ మండలంలోని బిజ్వార్‌లో స్వామి వివేకానంద విగ్రహం వద్ద ఒక రోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి, వరి, మొక్కజొన్న రైతులు అధిక వర్షాల వల్ల చాలా నష్టపోయారని తెలిపారు. నారాయణ పేట జిల్లాలో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు పత్తి కేవలం నాలుగు నుండి ఐదు క్వింటాళ్ల పత్తి మాత్రమే వస్తుందని తెలిపారు. కేంద్ర ఆర్థిక, గణాంకాశాఖ డైరెక్టరేట్ నివేదిక ప్రకారం పత్తి దిగుబడి తగ్గిందని నివేదిక జారీ చేశారు. ఈ నివేదికనే రైతులు నష్టపోయారని తెలుపుతుంది కావున పత్తి పంట కు ఎకరాకు 30 వేల



నష్టపరిహారం ఇవ్వాలని అన్నారు. అదే విధంగా 20 వరకు తేమ శాతం ఉన్న పత్తిని కూడా మద్దతు ధరకు సీసీఐ ద్వారా కొనే విధంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఎకరాకు కొత్తగా 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొంటాం అనే నిబంధన ఎత్తివేసి 12 క్వింటాళ్ల పత్తి కొనాలని డిమాండ్ చేశారు. వరి పంటలు కూడా నిరంతరంగా కురుస్తున్న వర్షాలకు భూమిపై వాలి వరి మొలకలు వస్తున్నాయని, వరి పంట మొత్తం నీటిలో మురిగిపోతున్నాయని తెలిపారు. సంబంధిత వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి వరి రైతులకు కూడా నష్టపరిహారం ఇవ్వాలని అన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సీసీఐ ఎండి లలిత్ కుమార్ గుప్తా కు ఆదేశాలు జారీ చేసి రైతులకు పూటకోక కొత్త నిబంధనలు పెట్టి రైతులను ఇబ్బంది పెట్టకుండా ఆదేశాలు జారీ చేయాలని చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు అండగా ఉండటం కోసం వాతావరణ ఆధారిత పంట బీమా పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన దీక్ష కార్యక్రమానికి బీజేపీ నాయకులు, రైతులు రాఘవేంద్ర, నాగిరెడ్డి, హన్మంతు, చిన్న నర్సింహా, ఆంజనేయులు, గుడిసె రాజు, అశోక్, రాజప్ప, తులసీదాస్, తిరుపతి, వెంకటప్ప, వడెప్ప, బడేసాబ్, నరేష్ తదితరులు మద్దతు తెలిపారు.

## రిటైర్డ్ పోలీసులకు ఐడి కార్డులు అందజేత

- సంగారెడ్డి డిఎస్పి పి. సత్తయ్య



**సంగారెడ్డి, నవంబర్ 5 (జనం సాక్షి) :** రిటైర్డ్ పోలీసులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని సంగారెడ్డి డిఎస్పి పి. సత్తయ్య తెలిపారు. బుధవారం సంగారెడ్డి రూరల్ సీఐ యూనియన్ కార్యాలయంలో సంగారెడ్డి జిల్లా రిటైర్డ్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు బి. ఎల్లయ్య ఆధ్వర్యంలో రిటైర్డ్ పోలీస్ అసోసియేషన్ సభ్యులకు ఐడి కార్డుల డీఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ...రిటైర్డ్ పోలీసులకు సహాయ సహకారం అందించేందుకు కృషి చేస్తానన్నారు. రిటైర్డ్ పోలీసు సభ్యులకు ఐడి కార్డు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ పోలీస్ సంగం గౌరవ సభ్యులు విట్టల్, ప్రధాన కార్యదర్శి మహేష్, జాయింట్ సెక్రటరీ ప్రభాకర్ రావు, విజయ్ ప్రకాష్, జీవన్, మల్లికార్జున్, ఈశ్వరయ్య,మాణిక్ రెడ్డి, నర్సింలు, సురేష్, యదాగౌడ్ పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ కొరకు గద్వాలలో ఈ 9న జరిగే సదస్సును జయప్రదం చేయాలి



**గద్వాల నడిగడ్డ, నవంబర్ 5 (జనం సాక్షి) :** బీసీ 42 శాతం గురించి చర్చిందానికి, ఉద్యమ కార్యాచరణ కొరకై సదస్సు ఈ నెల 9న జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రం వాల్మీకి భవనంలో జరుగును అని బహుజన రాజ్యసమితి నాయకులు అన్నారు.బహుజన మధ్యతరగతి, పేదల భాగస్వామ్యం అన్ని రంగాలలో తగ్గిపోయి, వ్యవసాయ రంగం దెబ్బ తిని, గ్యారంటీ లేని సేవా రంగం మాత్రమే పెరిగిపోయి, బహుజన ప్రజలు ఎన్నో సమస్యలకూ గురి అవుతున్నారనీ,ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య కూడా బహుజన జనాభా మేరకు పెరగక పోవడం వల్ల బహుజన ప్రజలు ఎటూ పాలుపోని పరిస్థితులలో కొట్టుమిట్టడుతున్నారనీ, ప్రభుత్వ, పార్టీల హామీ మేరకు తెలంగాణ బీసీల 42% రిజర్వేషన్ అమలు చేయాలని, రాజ్యాంగములోని 9వ షెడ్యూల్ లో చేర్చాలని, కేంద్ర బిజెపి కూటమి ప్రభుత్వంపై వత్తిడి తేవాలని, అగ్రవర్ణ మంత్రులు బి.సి లకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నామనీ వారన్నారు.అయిజ మండల బహుజనులు, బి.సి నాయకులు పెద్ద ఎత్తున రావాలని విజ్ఞప్తి చేస్తున్నామనీ వారన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన రాజ్య సమితి జాతీయ నాయకుడు కె.వినోద్ కుమార్, బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకుడు వీరేష్,రైతు కూలీ సంఘం నాయకుడు ఉత్తనూర్ వెంకన్న,సామాజిక కార్యకర్త టి. భీమన్న తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్, నవంబర్ 5 (జనం సాక్షి) :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. మెదక్ జిల్లా కొల్చారం మండల పరిధిలోని సంగాయిపేట గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 34,520 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిర్దేశించిన రిజిస్టర్లు నిర్వహిస్తున్నారా లేదా అని పరిశీలించారు. అదేవిధంగా కలెక్టర్



స్వయంగా తేమశాతాన్ని పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చిన వెంటనే సీరియల్ నెంబర్ల వారీగా ఎంత ధాన్యం తెచ్చారు. ధాన్యం తేమ తెచ్చిన రోజు ఎంత ఉంది అనే వివరాలు రిజిస్టర్లలో నమోదు చేసుకోవాలని తెలిపారు. నిర్దేశించిన తేమ శాతం వచ్చిన వెంటనే కేటాయించిన మిల్లుకు ధాన్యాన్ని వెంటనే లోడ్ చేసి పంపించేయాలని సూచించారు. ఇక వరి కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు సన్న రకం వరి ధాన్యాన్ని, దొడ్డు రకం వరి ధాన్యాన్ని గుర్తించడంలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గతంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇచ్చిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన వారు మాత్రమే కొనుగోళ్ళ ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట రైతు సంఘం అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, మాజీ అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఉన్నారు.

## ప్రతి ప్రయాణికుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**ఉప్పునుంతల, నవంబర్ 5 (జనం సాక్షి) :** ప్రతి ఒక్క ప్రయాణికుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఉప్పునుంతల ఎస్సై వెంకట్ రెడ్డి అన్నారు మండల పరిధిలోని వెల్టూరు గేటు ఎన్ఎస్ 765 హైవే పై బుధవారం ప్రయాణికులకు అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్సిడెంట్స్ కీ గల కారణాలు నివారణ చర్యలు, ట్రాఫిక్ రూల్స్ ప్రతి ఒక్క ప్రయాణికుడు పాటించాలని అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడిపి మీ మీద ఆధారపడి ఉన్న మీ కుటుంబాలలో విషాదం నింపవద్దని వారన్నారు ఎక్కడైనా ప్రమాదం జరిగినప్పుడు పోలీసు అంబులెన్స్ వారికి వెంటనే సమాచారం అందించాలని మీరు అందించే ఈ సమాచారం ద్వారా కొన్ని ప్రాణాలు కాపాడవచ్చు అని వారు అన్నారు ఈ కార్యక్రమంలో పోలీస్ పెట్రోలింగ్ సిబ్బంది విలేజ్ రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 5 (జనం సాక్షి) :** జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో బుధవారం ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించి సరియైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధిస్తూ వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై కృష్ణ చైతన్య మాట్లాడుతూ..వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు సరైన పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. వాహనాలు నడిపే సమయంలో తప్పకుండా హెల్మెట్, సిట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడపరాదు అని, రాష్ డ్రైవింగ్ చేయరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, త్రిబుల్ రైడింగ్ చేయరాదు, వాహనాలకు సంబంధించిన ఆర్సి, లైసెన్స్ ఇన్సూరెన్స్ తప్పకుండా కలిగి ఉండాలని ఎస్ఐ తెలిపారు.ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించి పోలీసు వారికి సహకరించాలని ఎస్ఐ తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## ఘనంగా డివైఎఫ్ఐ 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**సదాశివపేట, నవంబర్ 5 (జనం సాక్షి) :** భారత ప్రజాతంత్ర యోజన సమాఖ్య డివైఎఫ్ఐ 46వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు బుధవారం పట్టణంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కార్యాలయం ఆవరణలో పతాకావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ పంజాబ్ రాష్ట్రంలో లూధియానా నగరంలో 1980 నవంబర్లో డివైఎఫ్ఐ ఏర్పడిందన్నారు. త్యాగం పోరాటం నినాదంతో భగత్ సింగ్ ఆదర్శంతో యువజన సమస్యలపై ఉద్యోగ, ఉపాధి కొరకు డివైఎఫ్ఐ పోరాడుతుందన్నారు. దేశంలో 15 లక్షల సభ్యత్వం గల అతిపెద్ద యువజన సంఘం డివైఎఫ్ఐ అని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చినాటి నుంచి యువతపై అనేక దాడులు నిర్వహిస్తుందని, కుల మతాల మధ్య చిచ్చులు పెట్టి మత ఘర్షణలు సృష్టిస్తుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకరణం చేసి ఉద్యోగ ఉపాధి అవకాశాలు యువతకు అందకుండా చేస్తుందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 22 నెలలు గడుస్తున్న జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని, ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి నిరుద్యోగ యువతను మోసం చేసిందని అన్నారు.ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.లేని పక్షంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా యువతని ఏకం చేసి ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు యూసుఫ్, కిరణ్, సిఐటియు జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, జిల్లా కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు కూలిన ఉద్యమకారుడి ఇల్లు

- సమాజ శ్రేయస్సుకే జీవితం అంకితం
- ఇల్లు లేక నరకం

**చేర్యాల, నవంబర్ 5 (జనంసాక్షి) :** నిత్యం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ, ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేసే తెలంగాణ ఉద్యమకారుడు కాంగ్రెస్ నేత ఓ ఛానల్ విలేకరి అంబటి అంజయ్య గౌడ్ ఇల్లు ఇటీవల భారీగా కురుస్తున్న ముంథ తుఫాన్ కు ఇల్లు గోడలు కూలి నేలపాలైంది. జీవితం ఉద్యమాలకు అంకితం నీళ్ళు, నిధులు నియామకాల కోసం సాగిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో చేర్యాల ప్రాంతంలో నిఖార్సయిన ఉద్యమకారుడిగా సొంత ప్రయోజన కంటే తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకపాత్ర పోషించి కేసులపాలై దుర్భర జీవనము గడుపుతున్నాడు. అసలే పేదరికం చేసేది ఉద్యమం, జర్నలిజం కానీ సమాజాన్ని బాగు చేసే



క్రమంలో ఇంటిని బాగుచేసే స్థోమత లేకుండాపోయింది. అంజయ్య తన పూర్వీకుల నుండి వచ్చిన పాత ఇంటిలోనే జీవనం సాగిస్తూన్నాడు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తనకున్న రేకుల ఇల్లుతో సహా మరుగుదొడ్లు కుంగి పోయి గోడలు కూడా కూలిపోయాయి. సమాజాన్ని బాగు చేసే క్రమంలో తను పెదవాడిగా మిగిలిపోయానని తనపై దయతలచి తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్ తన పరిస్థితిని పరిశీలించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. తనకూ 100 గజాల స్థలం ఉందని కూలిపోయిన ఇంటి స్థలంలో ఇంటిని నిర్మించుకునేందుకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వేడుకున్నారు.

## మతోన్మాదం ప్రగతికి ప్రమాదకరం

**వనపర్తి బ్యూరో, నవంబర్ 5 (జనంసాక్షి) :** దేశంలో మతోన్మాదం పెరగటం దేశ ప్రగతికి ఆటంకమని వామపక్ష ప్రజాసంఘాల నేతలు అభిప్రాయపడ్డారు. వనపర్తి సిపిఐ ఆఫీసులో కవిజనజ్వాల రాధాకృష్ణ రచించిన 'జనజ్వాల మహా కవిత్వం'పుస్తకాన్ని భారత విప్లవోద్యమ నిర్మాత కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డి 41వ వర్ధంతి సందర్భంగా ప్రోగ్రెస్ డెమోక్రటిక్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జె రమేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. జనజ్వాల రాధాకృష్ణ, డా. భగవంతు, కొంకల నారాయణ, గణేష్, కేశవులు, వెంకటేష్, మోష తదితరులు మాట్లాడుతూ పాలకులు దేశంలో మతాన్ని పెంచిపోషిస్తున్నారన్నారు. బడుగు బలహీన వర్గాల్లో మతాన్ని ఎక్కించి సమస్యలపై పోరాడకుండాపక్క దారి పట్టిస్తున్నారు.వామపక్ష భావజాలమే దేశంలో ఉండే 90% మంది పేదలు ఎస్సీ,ఎస్టీ బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తుంది అన్నారు. పార్టీలకతీతంగా వామపక్ష భావజాలం గల వారందరూ ఐక్యమై పోరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా చైతన్యానికి ప్రతిబంధకంగా పరిణమించే మతం కులం జాతి వివక్షతను ఎదుర్కోవలసిన అవసరం ఉందన్నారు. భారత రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ఐక్యమైపోనాల్సిన అవసరం ఉందన్నారు. భారత రాజ్యాంగాన్ని ప్రజాహక్కులను వామపక్షాలు మాత్రమే కాపాడగలవన్నారు.




వామపక్షవాదులందరూ సంఘటితం కావలసిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. శ్రీరామ్, గోపాలకృష్ణ శ్రీహరి రవిచంద్ర సంఘ రక్షిత కుతుబ్ అరవిందు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడం ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**రాజాపూర్, నవంబర్ 5 (జనంసాక్షి) :** మండలంలోని రంగారెడ్డి గూడ గ్రామంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను నేడు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు అనే కలను సాకారం చేయడం ప్రభుత్వం యొక్క ప్రధాన లక్ష్యంమని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు పథకం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు గౌరవప్రదమైన నివాసం లభిస్తోందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రతి అర్హ కుటుంబం



ఇల్లు కలిగే వరకు కృషి చేస్తాం" అన్నారు. ఎమ్మెల్యే అనిరుధ్, కలెక్టర్ విజయేందిర బోయి నర్సింహా దంపతులకు, నర్సింగ్ రావు దంపతులకు నూతన వస్త్రాలు అందించారు. అనంతరం లబ్దిదారులతో కలిసి భోజనం చేశారు. గ్రామ ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాధాకృష్ణ, ఎంపీడీఓ విజయలక్ష్మీ, ఆర్ఐ యాదగిరి, మంజూరు, ఎంపీ ఓ వెంకట్రాములు ,పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవ్, ప్రజాప్రతినిధులు ఏఎంసీ వైస్ చైర్మన్ శేఖర్ గౌడ్, దుష్యంత్ రెడ్డి, శశికళా రెడ్డి, శ్రీనివాస్ నాయక్, గోపీనాయక్, గోనేల రమేష్, రమణ, శ్రీధర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, శంకరయ్య, శివప్రసాద్, యాదగిరి గౌడ్, మల్లేష్ యాదవ్, పవన్, రాములు గౌడ్, అనంతయ్య,కృష్ణయ్య తదిరులు పాల్గొన్నారు.

## నేడు పేటలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు



**నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 5 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 6న గురువారం మధ్యాహ్నం గం 1:00లకు ఎస్.ఆర్.గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో బాల్యవివాహల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించబ డుతుందనీ జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పూజారులు, పాస్టర్స్, ఖ్వాజీలు జిల్లా లోని ఫంక్షన్ హాల్ యజమానులు. టెంట్ హౌస్ యజమానులు. సౌండ్ సిస్టమ్స్ మరియు డీజే నిర్వాహకులు క్యాటరింగ్ యజమానులు. ప్రింటింగ్ ప్రెస్ యజమానులు, ఫోటో, వీడియో గ్రాఫర్లు అందరు తప్పక పాల్గొనాలని కలెక్టర్ ఆదేశించారు.

# రైతులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోం

- మాజీ మంత్రి జోగు రామన్న
- ఎంపీ నగేష్ ఇంటిని ముట్టడించిన బీఆర్ఎస్ నేతలు
- జోగు రామన్న అరెస్టు, స్టేషన్‌కు తరలింపు
- పత్తి కొనుగోళ్లలో కొర్రీలు పెట్టడంపై తీవ్ర ఆగ్రహం
- అడ్డుకున్న పోలీసులు తీవ్ర ఉద్రిక్తత



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** జిల్లాలో పత్తి పండించే రైతులకు తేమ పేరిట మోసం చేస్తే చూస్తూ ఊరుకోం అని బీ ఆర్ ఎస్ మాజీ మంత్రి జోగు రామన్న కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదిలాబాద్జ్ జిల్లా కేంద్రంలో బుధవారం ఉదయం బీ ఆర్ ఎస్ నేతలు బీజేపీ ఎంపి నగేష్ ఇంటిని ముట్టడించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సీసీఐ ఆధ్వర్యంలో చేపడుతున్న పత్తి కొనుగోళ్ళలో కేంద్ర ప్రభుత్వం కొర్రీలు పెడుతుందని దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ చేతిలో ఫ్ల కార్డులు పట్టుకుని నిరసన చేశారు. ఎంపీ ఇంటి లోనికి వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. పోలీసులు లోనికి ఎవరిని వెళ్లకుండా భారీ పహార చేపట్టారు. మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ పత్తి కొనుగోలులో తేమ శాతం కొర్రీలు పెట్టడం కారణంగా జిల్లా లోని రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి కొనుగోళ్లలో కొర్రీలు వెంటనే ఎత్తి వేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హెచ్చరించారు. రైతులకు నష్టం కలిగిస్తే చూస్తూ ఊరు కునేది లేదని తెలిపారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో రామన్నను పోలీసులు అరెస్టు చేసి రూరల్ పోలిస్ స్టేషన్ కు తరలించారు. ఎంపీ ఇంటి లోనికి ఎవరూ వెళ్లకుండా పోలీసులు భారీ కేడ్లు ఏర్పాటు చేశారు. ఐనప్పటికీ భారీ కెడ్లు దాటుకుని లోనికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు బీ ఆర్ ఎస్ నేతల మధ్య తీవ్ర తోపులాట జరిగి తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. దాదాపు రెండు గంటల పాటు ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. డీఎస్పీ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ ఇంటికి ఎవరూ వెళ్లకుండా భారీ భద్రత ఏర్పాటు చేశారు.



# రేవంత్ రెడ్డి సర్కారుతో రైతుల పరిస్థితి అగమ్యగోచరం

- అన్యాయాన్ని ప్రతిపక్ష నేతగా సహించను
- నష్టపరిహారం ఎకరాకు 25 వేల రపాయలు ఇవ్వాలి
- ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి



**శాయంపేట, నవంబర్ 5 (జనం సాక్షి) :** రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా అగమ్య గోచరంగా ఉందని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి అన్నారు. బుధవారం మండలంలో అకాల వర్షానికి దెబ్బతిన్న వరి పంటలను రైతులతో కలిసి పరిశీలించారు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడక ముందు రైతులు ఏ విధంగా గోసపడ్డారో మళ్లీ ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయని, ఏ ఒక్క విషయంలో అవి అమలు కావడం లేదని అన్నారు. ప్రభుత్వం ఆదుకుంటుందనే భావన రైతులలో కనిపించడం లేదని అన్నారు .రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. తుఫాను ప్రభావంతో రైతులు నష్టపోతే ప్రభుత్వానికి చలనం లేదని విమర్శించారు. వరి పూర్తిగా నీటిలో నాని మొలకలు వస్తున్నాయని అన్నారు .ఇప్పటివరకు ఏ ఒక్క అధికారి గానీ ప్రజా ప్రతినిధులు గాని చూసి అంచన వేసిన దాఖలాలు లేవని అన్నారు. ప్రభుత్వానికి రైతుల పట్ల ఎంత నిర్లక్ష్యం ఉందో అర్థమవుతున్నదని అన్నారు. రైతులను శపించడానికే అధికారంలో కొనసాగుతున్నదనే భావన కలుగుతున్నదని అన్నారు .కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నామని అన్నారు. చంద్రబాబు హయాంలో వ్యవసాయం దండగ అనే దానిని కెసిఆర్ హయాంలో పండగలాగ చేశామని అన్నారు. జిల్లా కలెక్టర్ కు, వ్యవసాయ అధికారులకు విజ్ఞప్తి సూచన చేస్తూ హెచ్చరిక చేస్తున్నామని అన్నారు. అధికారులు ఎవరు పంటలను పరిశీలించడానికి రావడం లేదని రైతులు చెబుతున్నారు.

# రైతుల బాధలు పట్టని ఎమ్మెల్యే

- కష్టాల్లో ఉంటే.. జూబ్లీహిల్స్ ప్రచారంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**పాలకుర్తి, నవంబర్ 5(జనంసాక్షి) :** నియోజక వర్గంలో మొంథా తుఫాన్ వల్ల పంటలు నష్టపోయి. ఆంధోళన చెందుతున్న రైతులను ఓదార్చకుండా. స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం చేస్తోందని. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలోని సోమేశ్వర ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి రామ్మోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొంథా తుఫాన్ వలన పంటలు నష్టపోయి తిండి గింజలు కూడా దక్కడంలేదని. రైతుల పరిస్థితి జీవన మరణ సమస్యగా మారిందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రైతులకు పరిహారం ఎకరానికి రూ. 10 వేలు పరిహారం ప్రకటించడం సిగ్గుచేటన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 50 వేలు పరిహారం ఇవ్వాలని డిమండ్ చేశారు. ప్రభుత్వం జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి కేంద్రానికి నివేదిక పంపిస్తే. రైతుల పక్షాన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సహకారంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్లి జాతీయ విపత్తుగా ప్రకటింప చేసి రైతులకు పరిహారం అందించే విధంగా కృషి చేస్తామన్నారు. పాలకుర్తి ప్రజలు తుపాన్ తో వందలాది ఎకరాల పంటలు నష్టపోయి రైతులు రోదిస్తుంటే, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుకు ప్రచారం చేస్తుండడం ఏమిటని ప్రశ్నించారు. నియోజక వర్గంలో టీపీసీసీ ఉపాధ్యాక్షురాలు ఝాన్సీరెడ్డి, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి వ్యవహార శైలీ సినిమా ఎపిసోడ్ లను తలిపిస్తుందని విమర్శిం చారు. పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల పూర్తి కాకపోవడంతో నీరంతా వృదాగా పోతుందని, వీటిని ఎప్పుడు పూర్తి చేస్తారో ప్రజలకు వివరిం చాలని సూచించారు. పోతన సమాధి వద్ద జరిగే అభివృద్ధి పనులు రెండేళ్లుగా నిలిచిపోయా యని ఇప్పటి వరకు కూడా మట్టి పోసిన దాఖలాలు లేవని విమర్శించారు. ఈ సమావే శంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మారం రవికుమార్, జిల్లా కార్యదర్శి దుంపల సంపత్, పల్లె కుమార్, దారావత్ శ్రీనివాస్, లకావత్ రవి. తదితరులు ఉన్నారు.

# చిల్పూర్ మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తా

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- అభివృద్ధిపై ఎమ్మెల్యేను కలిసిన చిల్పూర్ మండల ప్రజలు
- ఎమ్మెల్యేను సన్మానించిన పొట్లపల్లి శ్రీధర్ రావు



**స్టేషన్ ఘన్ పూర్, నవంబర్ 05 (జనంసాక్షి) :** చిల్పూర్ మండలాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తానని మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. చిల్పూర్ మండల కేంద్రంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై హన్మకొండ కనకదుర్గ కాలని లోని ఎమ్మెల్యే నివాసంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని బుధవా రం చిల్పూర్ గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు ఆధ్వర్యంలో చిల్పూర్ ప్రజలు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామస్తులందరి అందరి సహకారంతో చిల్పూర్ మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసు కుందామని తెలిపారు. వేంకటాద్రిపేట నుండి చిల్పూర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణంతోపాటు గుట్ట వద్ద సెంట్ర ల్ లైటింగ్ ఏర్పాటు చేస్తానని హామీఇచ్చారు. చిల్పూర్ మండల కేంద్రమాలోనే మండల కార్యాలయాల సము దాయం గ్రామస్తుల ఏకభిప్రాయం మేరకు నిర్మాణం చేస్తానని తెలిపారు. చిల్పూర్ గ్రామం నుండి సమ్మక్క సారలమ్మ జాతర వరకు గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేయ నున్నట్లు వెల్లడించారు. చిల్పూర్ శ్రీ బుగులు వెంకటేశ్వ రస్వామి ఆలయ అభివృద్ధికి 5 కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. అలాగే చిల్పూర్ గ్రామం లోనే ఎస్బిఐ బ్యాంక్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఇంకా గ్రామంలో అంతర్గత సిసి రోడ్లు, డ్రైనే జిల నిర్మాణానికి త్వరలోనే మంజూరు ఇస్తానని పేర్కొ న్నారు. చిల్పూర్ మండలాన్ని అన్ని రకాలుగా అభివృ ద్ధి చేసేబాధ్యత తనదని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఇందుకు గ్రామస్తుల సహకారం కూడా అవసరమని అన్నారు. గ్రామస్తులు అడిగిన అన్నిపనులుచేసే బాధ్య త తనదని, అందుకు ప్రతిగా స్థానికసంస్థల ఎన్నికలలో చిల్పూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. అందరూ కలిసి కట్టుగా పని చేసి సర్పంచ్, ఎంపిటిసి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలి పించాలని అన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అడిగిన పనులన్నింటిని చేస్తానని హామీ ఇచ్చిన నేప థ్యంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిరికి కృతజ్ఞతలు తెలిపుతూ దేవస్థానం చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు ఆధ్వర్యంలో చిల్పూర్ మండలం ప్రజలు ఎమ్మెల్యే కడి యం శ్రీహరిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిల్పూర్ గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవాలయకమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, నాయకులు బొమ్మిశెట్టి బాలరాజు, వివిధ కుల సంఘా ల నాయకులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కుమారుడు పట్టెడన్నం పెట్టడం లేదు!

- భూమి తిరిగి ఇవ్వాలని వృద్ధ దంపతుల ఆర్డీవోకు విన్నపం




**భీమదేవరపల్లి, నవంబర్ 05(జనం సాక్షి) :** కుమారుడు పట్టెడన్నం పెట్టకపోగా తల్లిదండ్రులను మానసికంగా వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తూ వృద్ధ దంపతులు ఆర్డీవోను ఆశ్రయించారు. వివరాల ప్రకారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన మట్టెడ ఆదాం లక్ష్మి దంపతులు బుధవారం ఆర్డీవో రాథోడ్ రమేష్‌ను కలసి ఫిర్యాదు చేశారు.

ఆదాం తన పేరుమీద ఉన్న ఐదు ఎకరాల భూమిలో చెరో రెండు ఎకరాల చొప్పున ఇద్దరు కుమారులు రవి దేవేందర్‌లకు పట్టా ఇచ్చాడు. పెద్ద కుమారుడు రవి తల్లిదండ్రుల సేవలో ఉండి వారి బాగోగులు చూసుకుంటుండగా చిన్న కుమారుడు దేవేందర్ దంపతులు మాత్రం తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తూ వారిని మానసికంగా వేధిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో దేవేందర్‌కు ఇచ్చిన రెండు ఎకరాల భూమి పట్టాను రద్దు చేసి తిరిగి తమ పేరుమీదే పట్టా చేయాలని ఆర్డీవోను వృద్ధ దంపతులు కోరారు. ఫిర్యాదును స్వీకరించిన ఆర్డీవో రాథోడ్ రమేష్ మాట్లాడుతూ విషయంపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# బుగులోని వెంకన్న గోవిందా...గోవిందా

- రెండో రోజూ తగ్గని జోరు
- కార్తీక పౌర్ణమి కావడంతో పోటెత్తిన భక్తులు
- వేంకటేశ్వరుని దర్శించుకున్న ఎమ్మెల్యే గండ్ర,మాజీ స్పీకర్ మధుసూదనా చారి





**రేగొండ,నవంబర్ 05(జనం సాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరి గ్రామ చివారులో ప్రతి ఏటా కార్తీక మాసంలో జరిగే శ్రీ బుగులోని వెంకటేశ్వర స్వామి జాతర బుధవారం రెండవ రోజుకు చేరింది. కార్తీక మాసం పురస్కరించుకొని చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఎంతో భక్తి శ్రద్ధలతో వెంకన్న స్వామికి మొక్కలు సమర్పించుకున్నారు.

**ప్రత్యేక ఆకర్షణగా ప్రభ బండ్లు**

బుగులు పోగొట్టే దైవంగా స్వామివారికి ప్రత్యేక పేరుండగా కొన్ని కుటుంబాలు స్వామివారికి ప్రభ బండ్లు మొక్కు చెల్లించడం అనవాయితీ. జాతర రెండో రోజున అధిక సంఖ్యలో ప్రభ బండ్లు రావడం జాతరకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**వేంకటేశ్వరుని దర్శించుకున్న ప్రముఖులు**

భక్తులతో పాటు భూపాలపల్లి శాసనసభ్యుడు గండ్ర సత్యనారాయణ రావు,మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనా చారి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి స్వామి వారిని దర్శించుకొని మొక్కలు సమర్పించుకున్నారు. జాతర కార్యనిర్వాహణ అధికారి బిల్లా శ్రీనివాస్,చైర్మన్ రమణారెడ్డి వారికి స్వాగతం పలికారు.

## మతసామరస్యాన్ని చాటిన ముస్లిం యువకుడు

**కొత్తగూడ నవంబర్ 5 (జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం లో ముస్లిం యువకుడు సల్మాన్ పాషా మాలధారణ ధరించిన అయ్యప్ప స్వాములకు బిక్ష ఏర్పాటు చేసి మరోమారు మత సామరస్యాన్ని చాటాడు. అయ్యప్ప స్వాములకు సల్మాన్ స్వయంగా దగ్గరుండి ఆహారం వడ్డించాడు. హిందూ-ముస్లిం భాయి భాయి అనే పదానికి ప్రతీకగా నిలిచినా సల్మాన్ పలువురికి ఆదర్శప్రాయుడని అభినందించారు. తమకు అల్పాహారం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని అయ్యప్ప స్వాములు తెలిపారు. అయ్యప్ప స్వాములు అతడిని నిండు మనసుతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గురు స్వామీ యాదగిరి గోవర్ధన్,వాసం వీరస్వామి, వాసం సురేష్, అజ్మీరా రమేష్, గంగిశెట్టి రాకేష్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

# శివనామస్మరణతో మార్మోగిన రామప్ప ఆలయం

- కార్తీక పౌర్ణమి సందర్భంగా దీపారాధనలో దీపారాధనలో మహిళలు
- కనీస వసతులు లేక భక్తులకు ఇబ్బందులు



**ములుగు/వెంకటాపూర్,నవంబర్ 05(జనం సాక్షి):** కార్తిక మాసం అత్యంత పవిత్రమైన మాసం ఇందులో కార్తీక పౌర్ణమి పర్వదినం భక్తులు అత్యంతమైన విశేషమైన రోజు గా భావిస్తారు. వెంకటాపూర్ మండలం లోని రామప్ప దేవాలయం లో భక్తజన సందోహంతో కిటకిటలాడింది. ఉదయం తెల్లవారుజామున నుంచే మహిళలు భక్తులు పెద్ద సంఖ్యలో రామప్ప రామలింగేశ్వర స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. అనంతరం మామిడి చెట్టు కింద ఉన్న శివునికి పూజలు చేసి దీపారాధన చేశారు. అనంతరం నందీశ్వరుడి పూజలు నిర్వహించారు.

కార్తీక పౌర్ణమి అంటే దీపారాధనకు ఒక ప్రత్యేకమైన రోజుగా మహిళలు భక్తులు భావిస్తారు. రామప్ప రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శివునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి అనంతరం నందీశ్వరుడికి పూజలు చేసి మామిడి చెట్టు వద్ద దీపారాధన చేసి దేవుని వేడుకుంటారు. దీనికిగాను భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా ములుగు సీఐ సురేష్,వెంకటాపూర్ ఎస్సై చల్ల రాజు దగ్గరుండి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా ఇబ్బందులు జరగకుండా ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం భక్తులు సరస్సు ను సందర్శించి తిరుగు ప్రయాణం అవుతారు.

**వసతుల్లో ఇబ్బందులు...**

రామలింగేశ్వర స్వామి ఆలయంలో వసతుల్లో కొంత మహిళలకు భక్తులకు ఇబ్బందులు జరిగాయి. గుడి పక్కన ఉన్న చెట్టు వద్ద దీపారాధనకు టెంటు సౌకర్యం లేక ఎండలో దీపారాధన చేయాల్సిన పరిస్థితి భక్తులకు రావడం జరిగింది. భక్తులు కొంత ఇబ్బందులకు గురి కావడం జరిగింది. కనీస వసతులు ఏర్పాటు చేయనందుకు భక్తులు ఎండోమెంట్ అధికారులపై కొంత అసహనం వ్యక్తం చేశారు.

# అంతర్రాష్ట్ర పశువుల అక్రమ రవాణా రాకెట్ భగ్నం

**నెరడిగొండ నవంబర్5 (జనంసాక్షి):** మహారాష్ట్రలోని గాడ్చుందూర్ నివాసి ఇమ్రాన్ బాబుషేక్,ఇచ్చోడకు చెందిన మొహమ్మద్ జాకిర్ ఒక వ్యవస్థీకృత నేర రవాణా రాకెట్‌లో పాలుపంచుకున్నారు. వీరు ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామాల్లో పశువులను సేకరించి, మొహమ్మద్ ఇమ్రాన్‌కు చెందిన వాహనం ద్వారా అనంతపూర్ మీదుగా కొచ్చిన్‌లోని మహేంద్ర త్రిమూర్తి వద్దకు తరలిస్తారు. అక్కడ ఈ ఎద్దులను ఎక్కువ ధరకు విక్రయించేవారు. వారికి సఫాన్ హనీఫ్ సేథ్,అస్లాం, మెహబూబ్ అలీ ఖురేషి సహాయం చేసేవారు. స్థానిక ఎస్ఐ ఇమ్రాన్ తెలిపిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఇదే క్రమంలో 03/11/2025 రోజున మొహమ్మద్ జాకిర్ షేక్ ఇమ్రాన్ ఇచ్చోడ మార్కెట్ నుండి 16 ఎద్దులను కొనుగోలు చేసి,అదనంగా 3 ఎద్దులను దొంగిలించారు. మొహమ్మద్ ఇమ్రాన్ వాహనంలో వాటిని కొచ్చిన్‌కు తరలిస్తుండగా, ముందస్తు సమాచారం ఆధారంగా వారిని మండలంలోని రోల్ మామడ టోల్ ప్లాజా వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేయబడిందని, ఈ కేసులో పాలుపంచుకున్న 10 మందిలో 8 మందిని రిమాండ్‌కు తరలించారు. మిగిలిన ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ పేర్కొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
06 నవంబర్ 2025

# రామారావు హత్య కేసులో దోషులను కఠినంగా శిక్షించాలి

**• నున్న నాగేశ్వరరావు సిపిఎం పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి**



**మధిర, నవంబర్ 5 (జనంసాక్షి) :** మధిర పట్టణంలో కామ్రేడ్ సామినేని రామారావు దారుణమైన హత్యకు నిరసనగా హత్య కేసులో దోషులు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం భారీ నిరసన ర్యాలీని నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఎం పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ నున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ మధిర నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ హత్యా రాజకీయాలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. 74 సంవత్సరాల వయసు గల సిపిఎం పార్టీ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఉమ్మడి రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శిగా పనిచేసిన సామినేని రామారావును స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులే పథకం ప్రకారం హత్య చేయించినట్లు మృతుని భార్య పాతర్లపాడు మాజీ సర్పంచ్ సామినేని స్వరాజ్యం తమ ఫిర్యాదును నందు పేర్కొనగా కనీసం వారిని స్టేషన్కు పిలిపించి విచారించి వారి ఫోన్ ఇతర వివరాలు సేకరించలేదన్నారు. పైగా కుటుంబ సభ్యులను ఫోనులు ఆధార్ కార్డులు పాన్ కార్డులు బ్యాంక్ అకౌంట్లు విచారణ పేరుతో సేకరిస్తున్నారు ఈ హత్యను కుటుంబ కలహాల లేదా వ్యక్తిగత ఘర్షణలు కారణంగా జరిగిన హత్యగా చిత్రీకరించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. రామారావు హత్య జరిగి ఆరు రోజులు గడుస్తున్నప్పటికీ కుటుంబ సభ్యుల విచారణతో పోలీసులు కాలం వెళ్ళదీస్తున్నారు తప్ప రామారావు హత్యకు రాజకీయ కారణాలు తప్ప మరి ఏమీ లేదని పాతరలపాడు గ్రామం ప్రజలంతా ముక్తకంఠంతో చెప్తున్నా పోలీసులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇప్పటికైనా రామారావు హత్య కేసులో నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు చింతలచెరువు కోటేశ్వరరావు జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు మందా సైదులు దివ్వెల వీరయ్య బోనకల్ పార్టీ మండల కార్యదర్శి కీలార్ సురేష్ మధిర పట్టణ కార్యదర్శి పడకంటి మురళి డివిజన్ నాయకులు పాపినేని రామ నర్సయ్య ఎర్రుపాలెం పార్టీ కార్యదర్శి మద్దాల ప్రభాకర్ మల్లారం మాజీ సర్పంచ్ మందడపు ఉపేంద్ర మహిళా సంఘం డివిజన్ నాయకులు సునీత ధనలక్ష్మి గుండ్లపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ బై ఎలక్షన్‌లో బీఆర్ఎస్ పార్టీ విజయం ఖాయం

**• ఎమ్మెల్సీ కోటిరెడ్డి**



**హాలియా, నవంబర్ 5 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ బై ఎలక్షన్‌లో బిఆర్ఎస్ పార్టీ విజయం ఖాయమని ఉమ్మడి నల్గొండ జిల్లా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. బుధవారం మాగంటి సునీత గోపీనాథ్ గెలుపుకై గోపినాథ్ కుమార్తెలతో కలిసి బోర్ బండ డివిజన్‌లో 342, 343 బూతుల్లో గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో ప్రజలకు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలు అమలు చేయలేదని త్రీవంగా విమర్శించారు. మంత్రులను జూబ్లీహిల్స్ ప్రజలు ఎన్నికల వాగ్దానాలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నిస్తున్నారని 4000 పెన్షన్ 2500 ఆడపిల్లలకు స్కూటీలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించడంతో మంత్రులు మొహం చాటేస్తున్నారని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ లో టిఆర్ఎస్ పార్టీ విజయం ఖాయమని అన్నారు.

## కోడిపందాల స్థావరంపై బోడు పోలీసులు దాడులు

**• ఆరుగురుపై కేసు నమోదు**
**• బోడు ఎస్సై శ్రీనివాస్ రెడ్డి**



**టేకులపల్లి, నవంబర్ 5 (జనంసాక్షి) :** బోడు పోలీస్ స్టేషన్ పరిధిలో మోట్ల గూడెం అటవీ ప్రాంతంలో కోడిపందాలు నిర్వహిస్తున్నారని సమాచారం మేరకు బుధవారం సాయంత్రం బోడు ఎస్సై శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వారి సిబ్బందితో వెళ్లి కోడిపందాలు నిర్వహిస్తున్న స్థావరంపై దాడులు నిర్వహించి ముగ్గురు పరారీ కాగ, మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న ముగ్గురిని పట్టుకొని వారిని విచారించి వారి వద్ద నుండి రెండు సెల్ ఫోన్లు, 2500 రూపాయల నగదును, రెండు మోటార్ సైకిల్ ను,(బైకులు) ,2 నాటు కోళ్లు ను స్వాధీన స్వాధీన పరుచుకుని, ఈ ఆరుగురు పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు అయిన వారి వివరాలు : నిట్ట రమేష్, ఆళ్లపల్లి, ఎస్.కె సోహేల్, ఆళ్లపల్లి, కుంట ప్రకాష్, ఆళ్లపల్లి, పెండకట్ల ఆనంద రావు, రాయపాడు, ఆళ్లపల్లి మండలం, కొలగాని కృష్ణ, మొట్లగూడెం, తాటి జగదీశ్, మద్రాస్ తండా గ్రామాలకు చెందిన వారు కాగా, వీరిలో నిట్ట రమేష్, పెండగట్ల ఆనందరావుని, కొలగని కృష్ణలను అరెస్టు చేసినట్లు తెలిపారు.

## ఎలాంటి షరతులు లేకుండా సీసీఐ పత్తి కొనుగోలు చేయాలి

**• రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి**



**రామన్నపేట, నవంబర్ 5 (జనంసాక్షి) :** పత్తి కొనుగోళ్లపై ఎలాంటి షరతులు పెట్టకుండా మొత్తం పంటలను సీసీఐ కొనుగోలు చేసి, ఎకరాకు 7 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామనే నిబంధన ఎత్తివేసి, 20శాతం తేమ ఉన్నా పత్తిని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సిరిపురం గ్రామంలో సిపిఎం-రైతు సంఘం ఆధ్వర్యంలో ఇటీవల కురుస్తున్న తుఫాను మూలంగా నష్టపోయిన పత్తి పంటను పరిశీలించి, రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అప్పులు చేసి పెట్టుబడి పెట్టి చేతికివచ్చే సమయానికే వర్షాలు నిండా ముంచాయని ఇదిలా ఉంటే ఎకరాకు కేవలం 7క్వింటాలు మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం షరతులు పెట్టడంతో కపాస్ కిసాన్ యాప్ గురించి రైతులకు సాంకేతిక అవగాహన లేక ముందస్తుగా నమోదు చేసుకోలేక పోవడంతో పత్తిని సీసీఐ కేంద్రాలు కొనుగోలు చేయడం లేదని అన్నారు. కొనక పోవడంతో నాలుగు వేల ధరకు ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకొని నష్టపోవాల్సి వస్తుందన్నారు. కపాస్ కిసాన్ యాప్ తో కాకుండా టోకెన్ విధానంతో వ్యవసాయ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా ఎకరానికి 12 క్వింటాళ్ళు కొనుగోలు చేయాలని అన్నారు. తేమ 20 శాతం ఉన్నా మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. మోడీ ప్రభుత్వం పత్తి పంటపై విదేశీ సుంకం 11శాతం కు తగ్గించాలని చూస్తుందని అలా అయితే మద్దతు ధర తగ్గుతుందని రైతులకు నష్టం జరుగుతుందన్నారు. అధిక వర్షాలకు నష్టపోయిన పత్తి రైతులకు ప్రభుత్వం ఎకరానికి 50వేల రూపాయలు నష్టపరిహారం అందించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు బల్గురి అంజయ్య, శాఖ కార్యదర్శి అంబటి సురేందర్ రెడ్డి,కునూరు వెంకటేశం,దాడి మల్లారెడ్డి, సుభాష్ రెడ్డి, పల్లె సత్యం, కునూరు గణేష్,మల్లేష్, మార్త భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోడు భూముల్లో పత్తి పంట ధ్వంసం చేసిన ఫారెస్ట్ అధికారులు



**చంద్రుగొండ, నవంబర్ 5 (జనం సాక్షి) :** చంద్రుగొండ మండలం రావికంపాడు శివారు అటవీ భూముల్లో పోడు సాగు చేసుకుంటూ పత్తి పంటను వేసిన వారి భూముల్లో ఫారెస్ట్ అధికారులు మంగళవారం సాయంత్రం వాటిని ధ్వంసం చేశారు. పోడు సాగుదారులైన గుగులోతు వాలి, తేజావత్ సరోజాలకు చెందిన సుమారు 5 ఎకరాల రేపు మాపో చేతికి వచ్చే పత్తి పంటను ఫారెస్ట్ అధికారులు ధ్వంసం చేశారు. పీకిన పంటను విలేకరులకు చూపిస్తూ వారు బోరున విలపిస్తూ తెలియజేశారు. ఇదే పని సాగుకు ముందు తమకు తెలియజేస్తే వేల రూపాయలు నష్టం వాటిల్లేదు కాదని అప్పుడు రాణి ఫారెస్ట్ అధికారులు ఇప్పుడు వచ్చి ఎందుకు ధ్వంసం చేశారని ప్రశ్నించారు. ఇదే విషయమై ఫారెస్ట్ రేంజర్ ఎల్లయ్య ను విలేకరులు వివరణ కోరగా గతంలో పలుమార్లు వారిని హెచ్చరించామని తమ దగ్గర ఎటువంటి ఆధారాలు ఉన్న పోడు పట్టాల ఉన్న తమకు చూపించాలని కోరామని తెలిపారు. వారు తమకేటువంటి ఆధారాలు చూపలేదని తెలియజేశారు. అక్రమంగా పోడు నరికితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## కనకాద్రిగుట్టల్లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సందర్శన

**• ఎనిమిది కిలోమీటర్ల కాలినడక ప్రయాణం**



**చంద్రుగొండ, నవంబర్ 5 (జనం సాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సాధారణ పౌరునిగా చంద్రుగొండ మండలం బెండాలపాడు శివారులో ఉన్న కనకాద్రి (కనకగిరి) గుట్టలను బుధవారం సందర్శించి పర్యటించారు. ఉదయం 7 గంటలకు స్థానిక గిరిజనులతో కలిసి అడవిలోకి నడక ప్రారంభించిన కలెక్టర్, సుమారు 8 కిలోమీటర్ల కాలినడక ప్రయాణం చేస్తూ ప్రకృతి సోయగాలను ఆస్వాదించారు. ఈ సందర్భంగా గుట్టపై కాకతీయుల కాలంలో నిర్మించిన ప్రాచీన వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న శిలాకట్టడాలను పరిశీలించి మాట్లాడిన కలెక్టర్, "ఈ ప్రాచీన దేవాలయం మరియు పురాతన కట్టడాలు అపూర్వ సంపద. వీటిని సంరక్షించడం మనందరి బాధ్యత. రాబోయే తరాలకు ఈ వారసత్వాన్ని అందించాలి," అని పేర్కొన్నారు. త్వరలో ఈ అటవీ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే ప్రక్రియ సాగుతోందని ఆయన తెలిపారు. అలాగే కనకాద్రి గుట్టపై ఉన్న వీరభద్రస్వామి ఆలయం, హస్తాల వీరన్న స్వామి ఆలయం, సమ్మక్క – సారక్క గద్దల వద్ద సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. బెండాలపాడు గ్రామంలో స్థానిక గిరిజనులు తయారు చేసే వెదురు (బ్యాంబో) ఉత్పత్తులను పరిశీలించిన కలెక్టర్, వారి కృషిని అభినందించారు. బ్యాంబో కస్టర్ కార్యకలాపాలపై ఆసక్తి చూపిన ఆయన, గిరిజనుల ఆత్మనిర్భరతకు ప్రభుత్వం సహకారం అందిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కలెక్టర్ సౌరబ్ శర్మ, డిప్యూటీ కలెక్టర్ మురళి, దిశా కమిటీ సభ్యులు బొర్రా సురేష్, మరకాల రవీందర్ రెడ్డి, హోటల్ నాగ, వెంకటేష్, బచ్చళ్ళ వెంకటేష్, కారం నాగేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు

**• తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా అధ్యక్షులు, పాలకుర్తి శ్రీకాంత్**



**తుంగతుర్తి, నవంబర్ 5 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల వద్దకే ప్రభుత్వం చేరవేస్తుందని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి శ్రీకాంత్ అన్నారు, బుధవారం మద్దిరాల మండలం చందుపట్ల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై కళాజాత ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు , ఇందిరమ్మ ఇళ్ల ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ అందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం అని అన్నారు, ఇప్పటికే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు పరిసరాల పరిశుభ్రత సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు, ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారధి జిల్లా టీం లీడర్ పల్లె లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పల్లెల రాము. గంట బిక్షపతి. గడ్డం ఉదయ్. మాగి శంకర్. పాక ఉపేందర్.మద్దిరాల మంజుల. సిరిపంగి రాధ. కుందమల్ల నాగలక్ష్మి. ములకలపల్లి మల్లమ్మ. గ్రామపంచాయతీ సిబ్బంది వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి ముందు పార్క్ చేసిన ఆక్టివా దగ్ధం



**భూదాన్ పోచంపల్లి, నవంబర్ 5 (జనం సాక్షి) :** ఇంటి ముందు పార్క్ చేసిన ఆక్టివా స్కూటీ మంటల్లో దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని జూలూరు గ్రామానికి చెందిన దుర్గం మౌనిక మంగళవారం రాత్రి తన ఆక్టివా (నంబర్ టీజీ 30 టీ 7881) ను ఇంటి గేట్ ముందు పార్క్ చేసింది. అయితే, బుధవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో వాహనం పూర్తిగా మంటల్లో తగలబడినట్లు గుర్తించింది. ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్ రెడ్డి తెలిపారు.

## మైనారిటీలకు కొండంత అండగా ఉంటాం

**• జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**



**హైదరాబాద్, నవంబర్ 5 (జనంసాక్షి) :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు హయాంలో మైనారిటీల సంక్షేమం, భద్రత, సముద్ధరణకు సముచిత ప్రాధాన్యతనివ్వడంతో సుఖ సంతోషాలతో జీవించారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. మహమూద్ అలీకి ఉప ముఖ్యమంత్రి పదవితో పాటుగా హోం మంత్రిత్వ శాఖనిచ్చి గౌరవించారని, నిన్నగాక మొన్న అజారుద్దీన్‌ను మంత్రిమండలిలోకి తీసుకుని మైనారిటీ శాఖను కట్టబెట్టారన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీ రవిచంద్ర బుధవారం రాత్రి యూసఫ్ గూడ డివిజన్ లక్ష్మీనరసింహ నగర్‌లో ముస్లిం మైనారిటీలకు చెందిన పలువురి నివాసాలకు వెళ్లి బీఆర్ఎస్ కు సంపూర్ణ మద్దతునివ్వాలని కోరారు. ముస్లిం ప్రముఖులు షబ్బీర్, కైసర్, ఫయీమ్, సలీం, ఇమ్రాన్, అస్లాం, సమీ, ఆజామ్, వాజీద్, ఇబ్రహీం, ఖాన్ మహ్మద్ ఖాన్,ముస్తాక్, మహ్మద్, ఇస్మాయిల్, సర్వర్, మహబూబ్,మహిళలు తన దృష్టికి తెచ్చిన అంశాల పట్ల ఎంపీ వద్దిరాజు సానుకూలంగా స్పందించారు.

## జూబ్లీహిల్స్‌లో అశ్వారావుపేట వాసుల ప్రచారం



**అశ్వరావుపేట, నవంబర్ (జనంసాక్షి) :** నవీన్ యాదవ్ గెలుపు కోరుకుంటూ అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సారథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ గెలుపే లక్ష్యంగా అశ్వారావుపేట కాంగ్రెస్ నాయకులు విస్తృతంగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో రహమత్ నగర్ ప్రాంతానికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రచార ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇంటింటికి తిరుగుతూ తనదైనా శైలిలో ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారింటల అమలు ప్రజలకు ఉపయోగకరమైన పథకాలు తీసుకురావడం వాటిని అమలు పరచడంపై వివరంగా ప్రజలకు వివరిస్తూ ప్రచారం కొనసాగిస్తుండటంతో ప్రజలు వీరికి బ్రహ్మరథం పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ గెలుపు ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త నవీన్ యాదవ్ గెలుపుకు తమ వంతు కృషి చెయ్యాలని కోరారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలి




**ఖమ్మం, నవంబర్ 5 (జనం సాక్షి) :** ప్రభుత్వం విద్యార్థుల బోధనా రుసుములు, ఉపకార వేతనాలను తక్షణమే మంజూరు చేయాలని పిడిఎస్ యు ఖమ్మం జిల్లా కార్యదర్శి గోకినపల్లి మస్తాన్ ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, మంద సురేష్, జిల్లా కార్యదర్శి జమ్మి అశోక్ రాష్ట్ర ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. స్థానిక ఖమ్మం పిడిఎస్ యు జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత నాలుగేళ్లగా ఫీజు రియంబర్స్మెంట్, ఉపకార వేతనాలను ప్రభుత్వం ఇవ్వడం లేదని, ప్రభుత్వం మారిన, పాలన మాత్రం అలానే ఉందని,విద్యార్థు పట్ల వివక్ష చూపిన ప్రభుత్వాలు మనుగడ సాధించలేదని వారు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్,స్కాలర్షిప్స్ 10,300 కోట్ల రూపాయలు బకాయిలు ఉండడంతో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పలుమార్లు నిరవధిక బంద్ నిర్వహించిన ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందనలేదని వారు విమర్శించారు. ప్రభుత్వం పేద విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమను కనబరుస్తుందన్నారు. గత నాలుగు ఏళ్లుగా పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారిందన్నారు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఎక్కువ శాతం ఫీజు రీయింబర్స్మెంట్ పై ఆధారపడి చదువుకుంటున్నారన్నారని, గత నాలుగేళ్లగా లక్షల సంఖ్యలో బీటెక్ డిగ్రీ విద్య వైద్యం ప్రొఫెషనల్ కోర్సులు కొనసాగిస్తున్నారని అన్నారు. ఎస్సీ ఎస్టీ విద్యార్థులు చదివే ఇంజనీరింగ్ కళాశాల కు పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్ అందించాల్సిన అవసరం ఉందన్నారు ఈబిసి మరియు మైనార్టీ ఒక్కొక్క విద్యార్థికి 35000 ఫీజు రియంబర్స్మెంట్ అందించాల్సిన అవసరం ఉందన్నారు డిగ్రీ విద్యార్థులకు ఒక్కొక్క విద్యార్థికి సుమారుగా 18000 నుంచి 35 వరకు అందించాల్సి అవసరం ఉందన్నారు. ఈ విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పైన ఉందని, అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ని విడుదల చేయకపోతే వాము పక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు శివ అజయ్ గాంధీ వెంకటేష్. వంశీ భాను సాగర్ తదితరులు పాల్గొన్నారు.




## మా 'పండుగ లోన్స్' పెరిగాయి : బజాజ్ ఫైనాన్స్

**న్యూఢిల్లీ:**ప్రముఖనాన్-బ్యాంకింగ్ ఫైనాన్సుంస్థ, బజాజ్ ఫిన్‌సర్వ్‌లో భాగమైన బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్.. ఈ పండుగ సీజన్‌లో తమవినియోగ ఫైనాన్స్‌లో పెరుగుదల కనిపించిందని, రికార్డు స్థాయిలో కన్స్యూమర్ రుణాలను పంపిణీ చేసినట్లు తెలిపింది . గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే రుణ వాల్యూమ్‌లో 27 శాతం , విలువలో 29 శాతం పెరిగిందని పేర్కొంది .విని యోగ వస్తువులకోసంఅందించేరుణాలకేటాయింపులుపెరగడం, వినియోగదా రుల కొనుగోలు శక్తిని పెంచే లక్ష్యంతో ప్రభుత్వం తీసుకొచ్చినజీఎస్టీ సంస్కరణలు, వ్యక్తిగత ఆదాయ పన్నులో మార్పుల సానుకూల ఫలితాన్ని బజాజ్ ఫైనా(న్సుణాలపెరుగుదలప్రతిబింబిస్తోంది.బజాజ్ ఫైనాన్స్ సెప్టెంబర్ 22 నుండి అక్టోబర్ 26వరకు సుమారు 63 లక్షల రుణాలను పంపిణీ చేసింది. ఈ కాలంలోకంపెనీ 23 లక్షల కొత్త కస్టమర్లను సంపాదిం చు కుంది. రుణాల్లో52% కొత్తగా ఇచ్చినవేననికంపెనీవివరించింది.టీవీలు, ఎయిర్ కండిషనర్లపైజీఎస్టీ తగ్గించడం వలన వినియోగదారులు ఉన్నత స్థాయి ఉత్పత్తులకు అప్‌గ్రేడ్చేసుకోవడానికి వీలుకలిగింది. ముఖ్యంగా టీవీలవిషయంలో ప్రీమియంవైపువినియోగదారులుమొగ్గుచూపారు. 40-అంగుళాలు, అంతకంటే ఎక్కువ సైజ్స్క్రీన్‌ల కోసం చాలామందిరుణాలు తీసుకున్నారు. కంపెనీ ద్వారా ఫైనాన్స్ చేసినమొత్తం టీవీలలో 71% వాటావీటిదేకావడంవిశేషం.

### అలసిన పసిడి ధరలు..

*ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.గత కొన్ని రోజులుగా బంగారం ధరలు భారీగా పెరిగి ఇటీవల కాలంలో తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. మంగళవారంతో పోలిస్తే బుధవారం బంగారం ధరలు తగ్గాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో ఈరోజు బంగారం, వెండి ధరలుఎలా ఉన్నాయో కింద తెలుసుకుందాం.*

# కాపర్‌కే ఓటు..

- భవిష్యత్తు బంగారు లోహం!
- మార్కెట్లో మదుపరులకు ఆకర్షణీయంగా కనిపిస్తున్న రాగి

**ఏడాది కాలంగా బంగారం, వెండి ధరలు అసాధారణ రీతిలో దూసుకుపోతున్నాయి. ధరల ర్యాలీతో సంతోషిస్తున్న పెట్టుబడిదారులు ఇప్పుడు కీలక దశలో ఉన్నట్లు కొందరు నిపుణులు చెబుతున్నారు.రానున్న కాలంలో బంగారం, వెండి పెరుగుదల ఇలాగే కొనసాగుతుందా.. లేదా అనే అనుమానం వ్యక్తం కావడమే ఇందుకు కారణం. ఈ తరుణంలో కామొడిటీ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టేవారికి కాపర్(రాగి) ఆకర్షణీయంగా కనిపిస్తున్నట్లు కొందరు భావిస్తున్నారు.**




**న్యూఢిల్లీ:**పారిశ్రామిక డిమాండ్, సరఫరా కొరత కారణంగా కాపర్ ధరలు సైతం కొంతకాలంగా పెరుగుతున్నాయి. దాంతో కాపర్ 'భవిష్యత్తు బంగారం'(లాభాల పరంగా)గా మారుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.కాపర్ ధరలు గడచిన ఏడాది కాలంలో దాదాపు 25 శాతం పెరిగాయని కొన్ని రిపోర్టులు చెబుతున్నాయి. ప్రస్తుతం కేజీ కాపర్ ధర సుమారు రూ.750గా ఉంది. ఇది 2026లో రూ.1500-రూ.1800 వరకు పెరిగే అవకాశం ఉందని కొందరు అంచనా వేస్తున్నారు.బంగారం, వెండి ధరలు ఇటీవల కాలంలో భారీగా పెరగడానికి అనేక అంతర్జాతీయ, దేశీయ అంశాలు దోహదపడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు ప్రజలు తమ డబ్బు విలువను కాపాడుకోవడానికి సురక్షితమైన పెట్టుబడి మార్గాల కోసం చూస్తారు. చరిత్రలో బంగారం ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా పనిచేసే సాధనంగా ఉంది. దీనివల్ల డిమాండ్ పెరిగి ధరలు అధికమయ్యాయి.అనేక దేశాల కేంద్ర బ్యాంకులు భౌగోళిక రాజకీయ అనిశ్చితి, ఆర్థిక అస్థిరత నేపథ్యంలో తమ నిల్వలను పెంచుకోవడానికి భారీ మొత్తంలో బంగారాన్ని కొనుగోలు చేశాయి.సాధారణంగా యూఎస్ డాలర్ విలువ తగ్గినప్పుడు డాలర్ ఆధారిత బంగారం ఇతర కరెన్సీలు ఉన్న కొనుగోలుదారులకు చౌకగా మారుతుంది. తద్వారా డిమాండ్ పెరుగుతుంది.రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, మిడిల్ ఈస్ట్ దేశాల్లో సంక్షోభం వంటి సంఘటనలు ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితిని పెంచాయి. దీనితో పెట్టుబడిదారులు భద్రంగా ఉండే బంగారం వైపు మళ్లారు.ఎలక్ట్రానిక్స్, సోలార్ ప్యానెల్స్, ఎలక్ట్రిక్ వాహనాలు వంటి పరిశ్రమల నుంచి వెండికి పారిశ్రామిక డిమాండ్ పెరుగుతుంది.

**కాపర్ (రాగి) ధరల పెరుగుదలకు కారణాలు..**

ఒకప్పుడు కేవలం పారిశ్రామిక లోహంగా మాత్రమే పరిగణించబడిన కాపర్ ఇప్పుడు ఇన్వెస్ట్‌మెంట్ మెటల్‌గా మారుతుంది. కొన్ని నివేదికల ప్రకారం కాపర్ లోహం గత రెండు దశాబ్దాల్లో దాదాపు 700 శాతం పెరిగింది. ఇది పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తోంది.ప్రపంచవ్యాప్తంగా గనుల్లో ఉత్పత్తి సమస్యలు, స్థానిక ఆందోళనలు, కొత్త గనుల అభివృద్ధిలో జాప్యం కారణంగా కాపర్ సరఫరా గణనీయంగా తగ్గింది. దీనికి తోడు పెరిగిన డిమాండ్ ధరలను మరింత పెంచింది.ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తుండడం, భారీ స్థాయి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, భవన నిర్మాణ రంగం నుంచి కాపర్‌కు డిమాండ్ బలపడుతోంది. మార్కెట్ నిపుణులు, మైనింగ్ దిగ్గజాలు రాగిని 'తదుపరి బంగారం'గా పేర్కొంటున్నారు. కాపర్ ధరలు భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

**ఎలక్ట్రిక్ వాహనాలు:**

ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో రాగి కీలక పాత్ర పోషిస్తుంది. ఒక సంప్రదాయ కారు కంటే ఒక ఎలక్ట్రిక్ కారుకు దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ కాపర్ అవసరం అవుతుంది. ఈవీల అమ్మకాలు పెరిగే కొద్దీ కాపర్ డిమాండ్ అపారంగా పెరుగుతుంది.క్లీన్ ఎనర్జీ: పునరుత్పాదక ఇంధన వనరుల్లో ముఖ్యంగా సోలార్, పవన విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణకు కాపర్ అవసరం అనివార్యం. కేబుల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ సరఫరా వ్యవస్థల్లో రాగి కీలకమైన లోహం.

**డిజిటలైజేషన్:**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్లు, టెక్నాలజీ, ఇతర ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో కాపర్‌కు డిమాండ్ పెరుగుతోంది.
కాపర్ వినియోగించే పరిశ్రమలు

# ఇక మరో దర్యాప్తు

### అనిల్ అంబానీకి మరిన్ని చిక్కులు..

**న్యూఢిల్లీ:**అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ గ్రూప్ చుట్టూ ఉచ్చుమ రింతబిగిసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీబీఐ, సెబీలతర్వాతతాజాగాకేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ కూడా రంగంలోకి దిగింది . రిలయన్స్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, రిలయన్స్ కమ్యూనికేషన్స్, రిలయన్స్ కమర్షియ ల్ ఫైనాన్స్ , సీఎల ఈ ప్రైవేట్ లిమిటెడ్ తో సహా పలు గ్రూప్ కంపెనీల ద్వారా నిధుల మళ్లింపుపై కార్పొరేట్ వ్యవ హారాల మంత్రిత్వ శాఖ దర్యాప్తును ప్రారంభించింది. రూ.17,000కోట్ల బ్యాంక్ రుణాలు దారి మళ్లించినట్లు అనిల్ అంబానీసంస్థలుఆరోపణలుఎదుర్కొంటున్నాయి. పెద్ద ఎత్తున నిధులను దారిమళ్లించడం, కంపెనీల చట్టం కిందతీవ్రఉల్లంఘనలకుపాల్పడినట్లుప్రాథమికంగాగుర్తించి నకార్పొరేట్ వ్యవహారాల శాఖ.. ఈ కేసును తీవ్రమైన మోసాలపైదర్యాప్తు చేసే 'సీరియస్‌ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్‌ఆఫీస్‌కు బదిలీ చేసినట్లు తెలిపింది. ఈఎస్ఎఫ్ఐవోదర్యాప్తు చేసిసీనియర్ మేనేజ్మెంట్ స్థాయిలో బాధ్యులను గుర్తించనుంది. దీనిఫలితంగా తదుపరిచర్యలు ఉండనున్నాయి.అప్పుల్లో కూరుకుపోయిన అనిల్‌అంబానీగ్రూప్సంస్థలపైఇప్పటికే ఈడీ, సీబీఐ, సెబీవిచారిస్తున్నాయి. ఈ వారం ప్రారంభంలోనేరిలయన్స్ గ్రూప్ సంస్థలకు చెందిన దాదాపు రూ .7,500 కోట్ల విలువైన ఆస్తులను ఈడీఅటాచ్ చేసింది.వీటిలోరిలయన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కు చెందిన 30 ఆస్తులు, అధార్ ప్రాపర్టీ కన్సల్టెన్సీ, మోహన్ బీర్ హైటెక్ బిల్డ్, గమేసా ఇన్వెస్ట్ మెంట్ మేనేజ్ మెంట్, విహాన్ 43 రియల్టీ, కాంపియన్ ప్రాపర్టీస్ తో ముడిపడి ఉన్న ఆస్తులు ఉన్నాయని ఈడీ అధికారులు తెలిపారు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.70 | ₹ 5.72 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,11,350 | ₹ 1,21,480 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,63,000

# దొంగలించి 'ట్రేడ్-ఇన్' ద్వారా కొత్త ఫోన్!

### యూకే మెట్ పోలీస్ పార్లమెంట్‌లో నివేదిక



**న్యూఢిల్లీ:**దొంగిలించబడిన ఐఫోన్ల వ్యాపారాన్ని అరికట్టే ప్రయత్నంలో టెక్ దిగ్గజం యాపిల్ సహకరించడం లేదని యూకే మెట్రోపాలిటన్ పోలీస్ సర్వీస్ తీవ్రంగా ఆరోపిం చింది.దొంగిలించబడిన ఫోన్లకు క్రెడిట్ పొందేందుకు నేరస్థులు యాపిల్ ట్రేడ్-ఇన్ ప్రోగ్రామ్‌ను దుర్వినియోగం చేస్తున్నారని పోలీసులు పేర్కొంటున్నారు.యూకే పార్లమెంటు సభ్యులకు మెట్ పోలీస్ సమర్పించిన నివేదికలో.. యాపిల్ సంస్థకు ప్రభుత్వ ఆధ్వర్యంలోని నేషనల్ మొబైల్ ప్రాపర్టీ రిజిస్టర్‌కు అవకాశం ఉందని తెలిపారు. ట్రేడ్-ఇన్ పరికరాల నెట్‌వర్క్ స్థితిని తనిఖీ చేయడానికి మాత్రమే యాపిల్ ప్రతిరోజూ దీన్ని ఉపయోగిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే ఇందులో ఫోన్ల దొంగతనానికి సంబంధించిన అంశాలను తనిఖీ చేయడం లేదని చెప్పారు. అంటే ఎవరైనా ఐఫోన్లు దొంగతనం చేసి ట్రేడ్-ఇన్ ప్రోగ్రామ్ ద్వారా క్రెడిట్లు పొంది తిరిగి కొత్త ఫోన్‌ను పొందవచ్చు. లేదా యాపిల్ గిఫ్ట్ కార్డులు పొందవచ్చు. యాపిల్ సరైన తనిఖీలు చేయకుండా దొంగిలించబడిన పరికరాలు మళ్లీ చలామణిలోకి రావడానికి సమర్థవంతంగా అనుమతిస్తుందని పోలీసులు చెబుతున్నారు.నేషనల్ మొబైల్ ప్రాపర్టీ రిజిస్టర్ అనేది దొంగిలించబడిన పరికరాలను గుర్తించడానికి, తిరిగి వాటిని బాధ్యులకు ఇవ్వడానికి చట్ట పరంగా అధికారులు ఉపయోగించే డేటాబేస్. యాపిల్ తన ట్రేడ్-ఇన్ పథకంలో ఈ రిజిస్టర్‌ను ఉపయోగించడం లేదని పోలీసులు ప్రధానంగా ఆరోపిస్తున్నారు.వినియోగదారులు తమ పాత ఐఫోన్‌ను మార్చుకున్నప్పుడు కొత్త ఐఫోన్ కొనుగోలుకు ట్రేడ్-ఇన్ ప్రోగ్రామ్‌లో ఉదాహరణకు సుమారు 670 యూరోల వరకు క్రెడిట్ పాయింట్లు ఇస్తారు. సరైన దొంగతనం తనిఖీలు లేకుండా దొంగిలించబడిన ఐఫోన్‌లను ఈ వ్యవస్థలోకి అంగీకరించి తిరిగి విక్రయించడం లేదా పునరుద్ధరి రిస్తున్నటు పోలీసులు చెబుతున్నారు.
పెరిగిన దొంగతనాలు:మెట్ పోలీస్ అందించిన సమాచారం ప్రకారం 2024లోనే లండన్‌లో 80,000 కంటే ఎక్కువ ఫోన్లు దొంగిలించబడ్డాయి. ఇది 2023లో నమోదైన 64,000 దొంగతనాల కంటే పెరిగింది. దొంగిలించబడిన ఈ ఫోన్ల స్థానంలో కొత్త వాటిని కొనుగోలు చేయాలంటే 50 మిలియన్ యూరోలు ఖర్చవుతుందని పోలీసులు అంచనా వేశారు. ఈ ఫోన్లలో 75% పైగా విదేశాలకు తరలివెళు తున్నాయని, అక్కడ వాటిని విడదీసి విడిభాగాల కోసం ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు.
యాపిల్ ప్రతిస్పందన
మెట్ పోలీస్ విమర్శలను యాపిల్ ఖండించింది. దొం గిలించబడిన డివైజ్‌ల కోసం కంపెనీ అధునాత సాంకేతికత వంటి చర్యలు తీసుకుంటుందని హైలైట్ చేసింది. ఫోన్ యజమాని ధ్రువీకరణ లేకుండా నేరస్థులు డివైజ్‌లోని డేటాను తొలగించడం లేదా తిరిగి విక్రయించకుండా నిరోధించడానికి ఈ ఫీచర్ ఉపయోగపడుతుందని స్పష్టం చేసింది.

# భవిష్యత్తు మన చేతుల్లో ఉంది

- నెహ్రూను గుర్తు చేసుకున్న మమ్దానీ
- సంతోషం వ్యక్తం చేసిన తల్లి మీరా నాయర్

**న్యూయార్క్:** అమెరికాలోని న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో డెమొక్రాట్ సోషలిస్ట్ జోహ్రాన్ మమ్దానీ చారిత్రాత్మక విజయాన్ని సాధించారు. ఈ సందర్భంగా మద్దతుదారుల హర్షధ్వానాల మధ్య న్యూయార్క్ వాసులకు జోహ్రాన్ మమ్దానీ ధన్యవాదాలు తెలిపారు.ఈ విజయంతో న్యూయార్క్ నగరానికి ఎన్నికైన అని పిన్నవయస్కుడైన మేయర్‌గా మమ్దానీ గుర్తింపు పొందారు. అలాగే తొలి ఇండియన్-అమెరికన్ ముస్లిం మేయర్‌గానూ పేరొందారు.ఈ సందర్భంగా మమ్దానీ మాట్లాడుతూ 'న్యూయార్క్ కొత్త తరానికి ధన్యవాదాలు. మేము మీ కోసం పోరాడుతాం. ఎందుకంటే మేము మీలాంటివాళ్లమే.. భవిష్యత్తు మన చేతుల్లో ఉంది. స్నేహితులారా.. మేము ఒక రాజకీయ రాజవంశాన్ని కూల్చివేసాం' అని పేర్కొన్నారు. 30 నిమిషాల కన్నా తక్కువగా సాగిన ఈ ప్రసంగంలో ఆయన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను నేరుగా ఉద్దేశించి, 'డోనాల్డ్ ట్రంప్.. మీరు దీనిని చూస్తున్నారని నాకు తెలుసు. మీకు చెప్పేందుకు నా దగ్గర నాలుగు మాటలు ఉన్నాయి.. వాల్యూమ్ పెంచండి' అని అన్నారు. మాలో ఎవరినైనా సంప్రదించాలంటే, మీరు మా అందరినీ దాటాలి. మీకు జన్మనిచ్చిన నగరంలో మీరు ఓటమి పాలయ్యారు' అని అన్నారు. తన ప్రధాన ప్రత్యర్థి ఆండ్రూ క్యూమోను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యక్తిగత జీవితంలో ఉత్తమంగా ఉండాలని సూచించారు.న్యూయార్కర్లకు మమ్దానీ కృతజ్ఞతలు చెబుతూ వారు మార్పు కోసం, కొత్త రాజకీయాల కోసం ఆదేశించారని అన్నారు. 2025, జనవరి ఒకటిన తాను న్యూయార్క్ నగర మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తానని మమ్దానీ ప్రకటించారు. న్యూయార్క్ ..వలసదారుల నగరంగానే ఉంటుంది. ఇది వలసదారులచే నిర్మితమైన నగరం.ఈ రాత్రి నుండి ఇది వలసదారుడి నేతృత్వంలో ఉంటుందని మమ్దానీ అన్నారు.భారత సంతతికి చెందిన మమ్దానీ తన విజయ ప్రసంగంలో భారతదేశ తొలి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ చేసిన 'ట్రైస్ట్ విత్ డెస్టినీ' ప్రసంగాన్ని గుర్తుచేసుకున్నారు. 'మనం పాత నుండి కొత్త వైపు అడుగు పెట్టే క్షణం చాలా అరుదుగా వస్తుంది. ఒక యుగం ముగిసినప్పుడు.. చాలా కాలంగా అణచివేతకు గురైన ఒక దేశ ఆత్మ ఉవ్వెత్తున ఎగసిపడే క్షణం వస్తుంది' అని ఆయన అన్నారు. తన విజయం న్యూయార్క్ వాసులందరికీ అంకితం అని ఆయన అన్నారు. వలసదారుల నేతగా పేరొందిన మమ్దానీ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఎన్నికల ప్రచారంలో మమ్దానీ పలు హామీలు ఇస్తూ, ఓటర్లను ఆకట్టుకున్నాడు. వీటిని ప్రముఖ హిందీ సినిమాల క్లిప్‌లతో అన్వయిస్తూ, పొందుపరిచిన



వీడియో అందరినీ ఆకట్టుకుంటోంది.

**తల్లి మీరా నాయర్ తొలి స్పందన**

ప్రముఖ సినీ దర్శకురాలు మీరా నాయర్ తన కుమారుడు జోహ్రాన్ మమ్దానీ న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన నేపథ్యంలో తొలిసారి స్పందించారు.తన కుమారుడి సంచలనాత్మక విజయంపై ఆమె సంతోషాన్ని వ్యక్తం చేశారు. దీంతో ఆమె సోషల్ మీడియా పోస్ట్ నెట్టింట సందడి చేస్తోంది.కుమారుడు జోహ్రాన్ మమ్దానీ విజయంపై మీరా నాయర్, బాలీవుడ్ దర్శకురాలు జోయా అక్తర్ ఇన్‌స్టా పోస్ట్‌ను షేర్ చేశారు. హార్ట్, బాణసంచా ఎమోజీలతో "జోహ్రాన్ యు బ్యూటీ" అనే శీర్షికతో ఆమె స్టోరీని రీ పోస్ట్ చేశారు.అమెరికాలో, ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కి కీలకమైన న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో మమ్దానీ విజయంపై జోయా అక్తర్ ప్రశంసలు కురిపించారు."జోహ్రాన్ మమ్దానీ 34 ఏళ్ల వయసులో అధికారికంగా %చీజ% మేయర్ రేసులో గెలిచారు" అంటూ కొనియాడారు.కాగా ఉగాండాలో జన్మించిన మమ్దానీ, ప్రఖ్యాత చరిత్రకారుడు మహమూద్ మమ్దానీ , మీరా నాయర్ దంపతుల కుమారుడు.జోహ్రాన్‌కు ఐదేళ్ల వయసున్నప్పుడు ఆ కుటుంబం దక్షిణాఫ్రియాలోని కేప్‌టౌన్‌కు చేరుకుంది. రెండేళ్ల తర్వాత అమెరికాలోని న్యూయార్క్‌లో స్థిరపడింది. జోహ్రాన్ మమ్దానీకి 2018లో అమెరికా పౌరసత్వం లభించింది. బ్రాంక్స్ హైస్కూల్ ఆఫ్ సైన్స్‌తోపాటు బౌడిన్ కాలేజీలో విద్యాభ్యాసం చేశాడు. 2017లో డెమొక్రటిక్ సోషలిస్టు ఆఫ్ అమెరికా అనే సంస్థలో చేరాడు. తర్వాత డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా 2020, 2021, 2022, 2024లో క్వీన్స్ 36వ జిల్లాకు ప్రతినిధిగా న్యూయార్క్ స్టేట్ అసెంబ్లీకి ఎన్నికయ్యాడు. తాజాగా న్యూయార్క్ సిటీ మేయర్ ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. తద్వారా న్యూయార్క్ సిటీకి మొట్టమొదటి ముస్లిం మేయర్‌గా, తొలి ఇండియన్-అమెరికన్ మేయర్‌గా చరిత్ర సృష్టించాడు.

**రిపబ్లికన్ అభ్యర్థులు ఓటమి.. ట్రంప్ వింత సమాధానం**

వాషింగ్టన్: అమెరికా స్థానిక ఎన్నికల్లో ఫలితాలు అమెరికాలోని అధికార రిపబ్లికన్ పార్టీకి ఊహించని షాకిచ్చాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఓటర్లు ఝలక్ ఇచ్చారు.అధికార పార్టీకి చెందిన కీలక నేతలను ఓడించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాలపై తాజాగా ట్రంప్ స్పందించారు.అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియా ట్రుత్ వేదికగా స్పందిస్తూ.. ఎన్నికల బ్యాలెట్ పేపర్‌లో ట్రంప్ ఫొటో లేదు. అమెరికాలో షట్‌డౌన్ ఉంది. ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ నేతలు ఓడిపోవడానికి ఇవే రెండు ముఖ్య కారణాలు అని చెప్పుకొచ్చారు. దీంతో, ఆయన వ్యాఖ్యలపై నెటిజన్లు సెటైరికల్ కామెంట్స్ చేస్తున్నారు.
గవర్నర్, మేయర్ ఎన్నికల్లో పలుచోట్ల రిపబ్లికన్ పార్టీ ఓటమి
వర్జీనియా ఎన్నికల్లో రిపబ్లిక్ పార్టీ అభ్యర్థి ఓటమి
వర్జీనియా గవర్నర్‌గా డెమోక్రాట్ అభ్యర్థి అబిగైల్ స్పాన్‌బర్గర్
వర్జీనియా తొలి మహిళా గవర్నర్‌గా అబిగైల్ స్పాన్‌బర్గర్ రికార్డు
సిన్సినాటి మేయర్‌గా డెమోక్రాట్ అభ్యర్థి అఫ్తాబ్ పురేవాల్ గెలుపు
అట్లాంటా మేయర్‌గా డెమోక్రాట్ అభ్యర్థి ఆండ్రీ డికెన్స్ తిరిగి ఎన్నిక
పిట్స్‌బర్గ్ మేయర్ రేసులో డెమోక్రాట్ అభ్యర్థి కోరీ ఓకానర్ విజయం

**రిపబ్లికన్లకు ఎదురుదెబ్బ..**

వర్జీనియాలో ట్రంప్ రిపబ్లికన్ పార్టీకి ఇక్కడ ఎదురు దెబ్బ తగిలింది. రిపబ్లికన్ పార్టీ సీయర్స్ ఓటమి పాలవ్వగా.. డెమోక్రాట్ అభ్యర్థి అబిగైల్ స్పాన్‌బర్గర్ గవర్నర్‌గా ఎన్నికయ్యారు. అబిగైల్ కు 14.80 లక్షల ఓట్లు పోలవ్వగా, సీయర్స్ కు 11.61 లక్షల ఓట్లు వచ్చాయి. అబిగైల్ 3.20 లక్షల ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. వర్జీనియా చరిత్రలో మొదటి మహిళా గవర్నర్ గా అబిగైల్ చరిత్ర సృష్టించారు.
జేడీవాన్స్ తమ్ముడికీ తప్పని ఓటమి..
మరోవైపు సిన్సినాటి మేయర్ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సవతి తమ్ముడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి కోరీబౌమన్ కూడా ఓడిపోయారు. ఈయనపై డెమోక్రాట్ అఫ్తాబ్ పురేవాల్ గెలుపొందారు. పురేవాల్ రెండవ సారి మేయర్ గా ఎన్నికయ్యారు. తొలిసారి 2021లో మేయర్‌గా ఎన్నికయ్యారు. మే నెలలో జరిగిన ఆల్ పార్టీ మున్సిపల్ ప్రైమరీలో ఆయన 80% కంటే ఎక్కువ ఓట్లతో గెలిచారు.

# వర్జీనియా గవర్నర్‌గా అబిగైల్ స్పాన్‌బెర్గర్




**వర్జీనియా:** అమెరికాలోని వర్జీనియా మేయర్ ఎన్నికల్లో సరికొత్త రికార్డు నమోదయ్యింది. డెమొక్రాట్ అబిగైల్ స్పాన బెర్గర్ మంగళవారం జరిగిన వర్జీనియా గవర్నర్ ఎన్నికల్లో గెలిచారు. రిపబ్లికన్ లెఫ్టినెంట్ గవర్నర్ విన్సమ్ ఎర్లే-సియర్స్‌ను ఓడించిన ఆమె 2026 మధ్యంతర ఎన్నికలకు వెళ్లే డెమొక్రాట్‌లకు కీలక విజయాన్ని అందించి, సరికొత్త చరిత్ర సృష్టించారు.కామన్వెల్త్‌కు నాయకత్వం వహించిన తొలి మ హిళగా నిలిచిన అబిగైల్ స్పాన్‌బెర్గర్ ఇటీవలే పదవీ విరమణ చేసిన రిపబ్లికన్ గవర్నర్ గ్లెన్ యంగ్‌కిన్ స్థానాన్ని భర్తీ చేయనున్నారు. ఈ విజయంతో తాము కామన్వెల్త్‌లోని ప్రతి మూలకు ఒక సందేశాన్ని పంపామని, దేశవ్యాప్తంగా ఉన్న మా తోటి అమెరికన్లకు తమ సత్తా చూపామని స్పాన్‌బెర్గర్ రిచ్‌మండ్ తన ఉత్సాహభరిత ప్రసంగంలో పేర్కొన్నారు.మంగళవారం జరిగిన ఈ ఎన్నికల్లో డెమొక్రాట్ గజాలా ఎఫ్. హష్మీ లెఫ్టినెంట్ గవర్నర్ రేసులో గెలిచారు. ఈ పదవిని దక్కించుకున్న తొలిమహిళగా హష్మీ నిలిచారు. సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజన్సీ(సీఐఏ) అధికారి అయిన స్పాన్‌బెర్గర్ ప్రచార సమయంలో దేశంలోని ఆర్థిక సమస్యలను ఎత్తిచూపారు. ఆమె అనుసరించిన వ్యూహం వచ్చే ఏడాది జరిగే ఎన్నికలలో ఇతర డెమొక్రాట్లకు ఒక నమూనాగా ఉపయోగపడనుంది. తన ప్రచారంలో స్పాన్‌బెర్గర్ .. అధ్యక్షుడు ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా, ఆయన రూపొందించిన ఆర్థిక ప్రణాళికలను ఎండగట్టారు. ఆమె రిపబ్లికన్ మద్దతు కలిగిన ప్రాంతాలతో సహా వర్జీనియా అంతటా ప్రచారం సాగించారు. యూఎస్ ప్రభుత్వ షట్‌డౌన్, సమాఖ్య ఉద్యోగులున్న వర్జీనియాపై దాని ప్రతికూల ప్రభావాన్ని స్పాన్‌బెర్గర్ సమర్థవంతంగా వివరించారు. ఆమె అనుసరించిన ప్రచార విధానం డెమొక్రాట్లను ఏకం చేయడంలో సహాయపడింది.

### నూతన ఎల్‌జీ గజాలా హష్మీ.. మన హైదరాబాదీ!

న్యూఢిల్లీ: భారత సంతతికి చెందిన డెమొక్రాట్ గజాలా హష్మీ వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్‌జీ) రేసులో విజయం సాధించారు. ఆమె రిపబ్లికన్ జాన్ రీడ్‌ను ఓడించారు.హష్మీ.. వర్జీనియా సెనేట్‌లో పనిచేసిన మొదటి ముస్లిం మహిళ. అలాగే మొదటి దక్షిణాసియా అమెరికన్‌గా గుర్తింపు పొందారు. గజాలా హష్మీ 15వ సెనేటోరియల్ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2019లో రాజకీయాల్లోకి ప్రవేశించిన ఆమె రిపబ్లికన్ ఆధీనంలో ఉన్న రాష్ట్ర సెనేట్ స్థానంపై ఆధిపత్యం సంపాదించి, వర్జీనియా జనరల్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు.హష్మీ సొంత వెబ్‌సైట్‌లో.. 'ఇతరుల జీవితాలను మెరుగు పరిచే దిశగా తన ప్రయత్నాలు కొనసాగుతాయని' పేర్కొన్నారు. ఆమె గృహనిర్మాణం, విద్య, ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ న్యాయం తదితర సమస్యలపై దృష్టి సారించారు. 1964లో హైదరాబాద్‌లో జియా హష్మీ, తన్వీర్ హష్మీ దంపతులకు జన్మించిన గజాలా తన బాల్యాన్ని మలక్‌పేటలోని తన తాత ఇంట్లో గడిపారు. హష్మీ తన నాలుగేళ్ల వయస్సులో తన తల్లి, అన్నయ్యతో కలిసి భారతదేశం నుండి అమెరికాకు వలస వెళ్లారు. అక్కడ వారంతా జార్జియాలో తండ్రితో పాటు ఉన్నారు.గజాలా తండ్రి ప్రొఫెసర్ జియా హష్మీ అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థి. అక్కడ అతను ఎంఏ, ఎల్‌ఎల్‌బీ చేశారు. తరువాత సౌత్ కరోలినా విశ్వవిద్యాలయం నుండి అంతర్జాతీయ సంబంధాలలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. అనంతరం బోధనా వృత్తిని స్వీకరించారు. అతను స్వయంగా స్థాపించిన సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేశాడు. హష్మీ తల్లి తన్వీర్ హష్మీ హైదరాబాద్‌లోని కోఠి ఉమెన్స్ కాలేజీలో బీఏ, బీఈడీ చేశారు.హష్మీ తన విద్యాభ్యాసం సమయంలో పలు స్కాలర్‌షిప్‌లు, ఫెలోషిప్‌లను అందుకున్నారు. జార్జియా సదరన్ విశ్వవిద్యాలయం నుండి బీఏ, అట్లాంటాలోని ఎమోరీ విశ్వవిద్యాలయం నుండి అమెరికన్ సాహిత్యంలో పీహెచ్‌డీ చేశారు. 1991లో హష్మీ, ఆమె భర్త అజార్ రఫీక్‌తో పాటు రిచ్‌మండ్ ప్రాంతానికి తరలి వెళ్లారు. ఈ దంపతులకు యాస్మిన్, నూర్ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిద్దరూ చెస్టర్‌ఫీల్డ్ వర్జీనియా విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రులయ్యారు. హష్మీ దాదాపు 30 సంవత్సరాల పాటు ప్రొఫెసర్ గా పనిచేశారు. మొదట రిచ్మండ్ విశ్వవిద్యాలయంలో, తరువాత రేనాల్డ్స్ కమ్యూనిటీ కళాశాలలో పనిచేశారు.

# భారత్‌తో సంబంధాలకు కట్టుబడి ఉన్నాం

మీడియా ప్రతినిధి కరోలిన్ లీవిట్ వెల్లడించారు. "వైట్‌హౌస్ ప్లాన్-బితో సిద్ధంగా ఉంటుంది. ఎలాంటి పరిస్థితికి అయినా సిద్ధంగా ఉండకపోవడం అజాగ్రత్తే అవుతుంది. సుప్రీంకోర్టు తీర్పు మాకు సానుకూలంగా వస్తుందన్న ఆశాభావంతో ఉన్నాం" అని లీవిట్ అన్నారు."ప్రస్తుత కేసు ట్రంప్ గురించి మాత్రమే కాదు. భవిష్యత్తులో అధికారాన్ని చేపట్టేవారికి సుంకాల విషయంలో అత్యవసర అధికారాన్ని ఉపయోగిం చడం గురించి కూడా" అని ఆమె అన్నారు. ఆర్థిక భద్రత, జాతీయ భద్రత వేర్వేరు కాదని ట్రంప్ భావిస్తున్నారని చెప్పారు. ఈ కేసు విచారణకు ముందు ట్రంప్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఇది దేశ భవిష్యత్తుకు కీలకమని వ్యాఖ్యానించారు.

# 'షట్‌డౌన్'తో ఆహారానికి కటకట

ప్రస్తుతం అమెరికాలో ఆహార సంక్షోభం తలెత్తింది. ఈ మాట వినడానికే వింతగా ఉన్నా... వాస్తవం! అక్కడ ప్రస్తుతం 'షట్‌డౌన్' కొనసాగుతున్న సంగతి తెలిసిందే.ఈ షట్‌డౌన్ ప్రభావం అనేక రంగాలపై పడింది. తాజాగా వివిధ రాష్ట్రాలలో ఆహార సంక్షోభా నికి దారి తీసింది. ప్రధానంగా వాణిజ్య రాజధాని అయిన న్యూయా ర్క్‌పై పడింది. ఫెడరల్ ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆహార సాయం నిలిచిపోయింది. దీంతో ఆ రాష్ట్రం 'స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీ'ని ప్రకటించింది. ఫెడరల్ ప్రభుత్వ షట్‌డౌన్ అమెరికాలోని కోట్లాది మంది అల్పాదాయ కుటుంబాలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఈ అల్పాదాయ కుటుంబాలకు జీవనాధారమైన 'సప్లి మెంటల్ న్యూట్రిషన్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్' లేదా 'ఫుడ్ స్టాంప్స్' ప్రయోజనాలు అందకుండా పోయే ప్రమాదం ఏర్పడింది. అమెరికాలో ఈ ప్రోగ్రామ్ ద్వారా దాదాపు నాలుగున్నర కోట్ల మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారు. వీరిలో ఎక్కువమంది పేద వారే!ఇదిలా ఉంటే, నిధుల కొరత కారణంగా నవంబరు నెల ప్రయోజనా లను తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు నిలిపివేయాలని ఇటీవల రాష్ట్ర ఏజెన్సీ లను అమెరికా వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆదేశించింది. కాగా ఆహార సంక్షో భాన్ని పరిష్కరించాలన్న చిత్తశుద్ధి అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు లేదని గవర్నర్ కేథీ హెూచుల్ ఆరోపించారు. చట్టబద్ధంగా ఆమోదించిన ఎమర్జెన్సీ ఫండ్‌ను విడుదల చేయడానికి ట్రంప్ సర్కార్ నిరాకరిస్తోందని కేథీ ఘాటు ఆరోపణలు చేశారు. ఆహార సంక్షోభాన్ని పరిష్కరించడానికి అమెరికాలోని అనేక రాష్ట్రాలు సొంతంగా చర్యలు తీసుకుంటున్నాయి. ఈ జాబితాలో లూసియానా, వెర్మంట్, న్యూ మెక్సికో ముందు వరుసలో ఉన్నాయి.అమెరికా ఫెడరల్ ప్రభుత్వ కార్యకలాపాలను నిర్వహించడానికి ప్రతి ఏడాది తప్పనిసరిగా ఒక బడ్జెట్‌ను లేదా తాత్కాలిక ఖర్చులను అమెరికన్ కాంగ్రెస్ ఆమోదించాల్సి ఉంటుంది. ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందు అంటే అక్టోబరు ఒకటో తేదీలోగా కాంగ్రెస్ ఈ బడ్జెట్‌ను ఆమోదించాల్సిఉంటుంది. అలా జరగకపోతే, ప్రభుత్వంలో అత్యవసరం కాని సేవలు తాత్కా లికంగా నిలిచిపోతాయి. దీనినే 'ప్రభుత్వ షట్‌డౌన్' అంటారు. వాస్తవానికి ప్రభుత్వ సొమ్ము వృథా కాకుండా చూడాలనే సదుద్దేశంతో షట్‌డౌన్ చట్టాన్ని తొలి రోజుల్లో తీసుకువచ్చారు. కానీ ఇప్పుడు ప్రభుత్వ సొమ్ము వృథా కాకుండా చూడాలనే నియమాన్ని అన్ని రాజకీయ పార్టీలూ పక్కన పెట్టి... తమ విధానపరమైన డిమాండ్లను నెరవేర్చుకోవడానికి బడ్జెట్ ఆమోదాన్ని అడ్డుకుంటున్నాయి.

# కాంటా చేస్తారా.. ఆందోళన చేయమంటారా!

**సదాశివనగర్ నవంబర్ 5 (జనం సాక్షి):**
చైర్మన్ సీఈవో హామీతో శాంతించిన రైతులు టీఆర్ఎస్ మద్దతుతో మొక్కజొన్న రైతులు కాంటాలు చేయడం లేదని ఆందోళనకు దిగుతున్నారని విషయం తెలుసుకొని మాజీ జెడ్పిటిసి రాజేశ్వరరావుతో మాట్లాడి ఆందోళనలను విరమింప చేసిన పద్మాజివాడి సింగిల్ విండో చైర్మన్ సీఈవోలు ప్రయత్నించి విజయవంతమయ్యారు. కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండలం భూంపల్లి గ్రామంలో మొక్కజొన్న రైతులు ప్రభుత్వ కొనుగోలు కోసం కాంటాలు ప్రారంభించడం లేదని మంగళవారం ఆందోళన చెందారు. రైతులు సదాశివ నగర్ మండల మాజీ జెడ్పిటిసి పడిగెల రాజేశ్వరరావు ఫోన్ ద్వారా సమాచారం అందించి తామరభూపణ స్థలానికి రావాలని విజ్ఞప్తి చేశారు. మాజీ జెడ్పిటిసి తో పాటు మాజీ ఎంపీపీ అనసూయ రమేష్ గ్రామ పార్టీ అధ్యక్షుడు గడీల చక్రరావు, రైతుల వద్దకు చేరుకున్నారు. గాంధారి వెళ్లే మార్గంలో లింగంపల్లి స్టేజి వద్ద రాస్తారోకో చేస్తామని రైతులు పట్టుపట్టారు దీంతో మాజీ జెడ్పిటిసి జిల్లా అధికారులతో మాట్లాడారు .తాము గోనే సంచులు సమస్యలు తొలగించి పంపామని వారు తెలిపారు. దాంతో వెంటనే స్థానిక సింగిల్ విండో చైర్మన్ గంగాధర్ కు సింగిల్ విండో సీఈవోకు దేవేందర్ కు ఫోన్లో మాట్లాడగా బుధవారం సెంటర్ ను ప్రారంభిస్తున్నామని రైతులను



ఆందోళన చేయవద్దని సూచించాలని మాజీ జెడ్పిటిసి కోరారు .అయితే 14% తేమ ఉన్న మొక్కజొన్నలను బుధవారం నుండి కాంటాలు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో మాజీ జెడ్పిటిసి అక్కడున్న రైతులను శాంతింప చేసి వారి హామీ మేరకు ఆందోళన చేయవద్దని సూచించారు . ఈ కార్యక్రమంలో గ్రామ బిజెపి అధ్యక్షుడు మంగలి స్వామి రైతులు బాలచంద్రం యూత్ నాయకుడు మోహన్రావు దంతేపల్లి రాజు పోలీస్ సంజీవరావు ,వెంకట్ నర్సు నారాయణ ,మంగళ్ ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి ఆదివాసి నాయకపోడు కబడ్డీ పోటీలు ప్రారంభం

**ముఖ్యఅతిథిగా హాజరైన ఉమ్మడి జిల్లా డీఎస్పీ మధుసూదన్**

**ఆర్మూర్ నవంబర్ 5 ( జనంసాక్షి):**
ఆర్మూర్ మండలంలోని చేపూరు గ్రామంలో భీమన్న దేవుడి కళ్యాణం ఆదివాసి నాయకపోడు సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. భీమన్న గుడి నిర్మించి 17వ సంవత్సరాల అవుతున్న సందర్భంగా చేపూర్ గ్రామానికి చెందిన మీసాల నాగరాజు వారి తండ్రి గార్లైన కీర్తిశేషులు మీసాల అమ్మన్న పెద్ద రాజన్న జ్ఞాపకార్థం సంఘ సభ్యుల సహకారంతో జిల్లా స్థాయి ఆదివాసి నాయకపోడ్ కబడ్డీ పోటీలను నిజామాబాద్ ఉమ్మడి జిల్లా డిఎస్పి మధుసూదన్,జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో గోపి సాయన్న,ఆదివాసి నాయకపోడ్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల రాంచందర్,బందారి భోజన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఆదివాసి నాయకపోడు కులస్తుల ఐక్యంగా జిల్లాస్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహించడం శుభ పరిణామని,ఆదివాసీ నాయకపోడ్ కులస్తులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యోగుల సేవా సంఘం అధ్యక్షులు పుట్ట



రాజేశ్వర్,ప్రధాన కార్యదర్శి కోసిదారు రవి,ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్, ఆర్మూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే చిన్న రెడ్డి,మాజీ జడ్పిటిసి సారంగి నడిపి సంధన్న,జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కే గంగాధర్,చేపూర్ మాజీ సర్పంచులు పి సత్యనారాయణ,సే గంగారెడ్డి,తాజా మాజీ సర్పంచ్ ఇందూర్ సాయన్న,మాజీ ఎంపీటీసీ జక్కపల్లి గంగాధర్, ఆర్మూర్ మండల ఆదివాసి నాయకపోడ్ ప్రధాన కార్యదర్శి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థి
# ఎస్జీఎఫ్ జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక

**అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి**

**కరీంనగర్, నవంబర్ 05 (జనంసాక్షి) :**
ఆర్చరీ క్రీడకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉన్నదని ఈ క్రీడలో పాల్గొనడానికి చాలామంది ఉత్సాహం చూపుతారని తెలిపారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో విద్యార్థి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా అభినందన సభకు వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అన్ని రంగాలలో అన్ని రకాలుగా చేయూతనివ్వడం జరుగుతుందని తెలిపారు. పాఠశాల స్థాయిలో పోటీలు నిర్వహించి వివిధ స్థాయిలలో నిర్వహింపబడేటువంటి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని, అలాగే మహబూబాబాద్ జిల్లాలోని నెల్లికోడూరులో ఎస్జీఎఫ్ వారు నిర్వహించినటువంటి అండర్ 17 బాలుర ఆర్చరీ పోటీలలో పాఠశాలకు చెందినటువంటి కూన మాణికేశ్వర్ అత్యుత్తమ ప్రతిభతో జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అవడం చాలా హర్షించదగ్గ విషయమని, విజయ డంకా మ్రోగించి కరీంనగర్ జిల్లా క్రీడా రంగానికి ఖ్యాతి తేవాలని ఆకాంక్షిస్తూ పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# నేత్రదాత కుటుంబానికి అభినందన జ్ఞాపిక అందజేత

**ప్రాణం ఆగినా, చూపు కొనసాగింది.. నేత్రదాత కుటుంబానికి అభినందనలు**

**రామగిరి, జనంసాక్షి :** రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన కేశెట్టి రాజేశ్వరి ఈ లోకాన్ని విడిచిపెట్టినా, ఆమె చూపు మాత్రం సజీవంగానే ఉంది. ఆమె అమూల్యమైన నేత్రాలను దానం చేయడం ద్వారా ఇద్దరు వ్యక్తుల జీవితాల్లో వెలుగు నింపిన ఈ సేవాభావం అందరికీ ఆదర్శంగా నిలిచింది.మానవతా భావంతో చేసిన ఈ మహోన్నత నిర్ణయాన్ని గుర్తిస్తూ లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ, లయన్స్ క్లబ్ ఆఫ్ కమాన్‌పూర్ మరియు సదాశయ ఫౌండేషన్ సంయుక్తంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి సదాశయ ఫౌండేషన్ అధ్యక్షులు సాన రామకృష్ణారెడ్డి మరియు జాతీయ కార్యదర్శి లింగమూర్తి చేతుల మీదుగా నేత్రదాత కుటుంబానికి అభినందన జ్ఞాపికను అందజేశారు.అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ మనిషి తన జీవితంలో సేవ చేయడం గొప్పది, కాని మరణానంతరం కూడా మరొకరికి వెలుగు ఇవ్వడం అత్యున్నతమైన సేవ. ఇలాంటి నిర్ణయం తీసుకున్న కేశెట్టి రాజేశ్వరి కుటుంబం సమాజానికి ప్రేరణగా నిలిచింది అని పేర్కొన్నారు. అలాగే వారు కుటుంబ సభ్యులైన కుమారులు సత్యనారాయణ, నాగరాజు, కుమార్తెలు అరుణ, స్వరూప, స్వప్న గార్లకు మరియు ఇతర కుటుంబ సభ్యులకు,బంధువులకు లయన్స్ క్లబ్ మరియు సదాశయ ఫౌండేషన్ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మేకల మారుతి యాదవ్, సానా రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ ,మాజీ జడ్పీటీసీ గంట వెంకట రమణ రెడ్డి, కల్వచర్ల మాజీ ఉప సర్పంచ్ వేము కనకయ్య, దొంతుల సురేష్,కొత్త కమలాకర్, బంధువులు, గ్రామ ప్రజలు పాల్గొని నేత్రదాత కుటుంబానికి గౌరవప్రదంగా నివాళి అర్పించారు.




## ప్రధాన రహదారిపై గుంతలతో
# జంకుతున్న వాహనదారులు

- ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకోరాంటూ ప్రశ్నిస్తున్న ప్రయాణికులు..
- ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలంటున్న వాహనదారులు



**చిగురుమామిడి నవంబర్ 5 (జనంసాక్షి):** ప్రధాన రహదారులపై ఉన్న గుంతలను పూర్చడంలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక వాహన దారులు ప్రయాణికులు జంకుతున్నారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామ పరిధిలో కంకర తెలి లోతుగా ఉన్న గుంతలు ప్రయాణికుల ప్రాణాల మీదకి తెచ్చేలా ఉందని,ఇప్పటికే చాలామంది వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నిత్యం ఇదే రహదారిపై అధికారులు రాకపోకలు సాగిస్తున్న తమకెందుకులే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.రోడ్డు సాఫ్ గా ఉండి అక్కడక్కడ భారీ గుంతలు పడడంతో చీకట్లో అకస్మాత్తుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రాణాపాయం జరగకముందే ఈ గుంతలను పూడ్చాలని ప్రజలు వేడుకుంటున్నారు.నాణ్యత పనుల లోపంతో నిత్యం అదే స్థలాల్లో గుంతలు పడడంతో వాహనదారులు ప్రయాణికులు అరిచేతిలో ప్రాణాలు పెట్టుకుని ఇంటికి చేరుకుంటున్నారు.రాష్ట్రంలో పలుచోట్ల ఇలాంటి గుంతలతో భారీ ప్రమాదాలు జరుగుతున్న ఇక్కడ అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నిస్తున్నారు.ముల్కనూర్ నుండి కొండాపూర్ వరకు ఉన్న మూలమలుపుల వద్ద,ప్రమాదకరంగా ఉన్న చోట హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహనదారులు పదేపదే కోరుతున్న ఎందుకు స్పందించడం లేదంటున్నారు.ఈ గుంతల కారణంగా ద్విచక్ర వాహనాల టైర్లు పెలడంతో పాటు నడుము నొప్పులతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

*కుటుంబ కలహాలతో ఓ గృహిణి రెండున్నర ఏండ్ల కూతురుతో కలిసి హుస్సేన్ సాగర్ నీటిలో దూకి ఆత్మహత్య పాల్పడింది. ఈ ఘటన రెండు రోజుల క్రితం హుస్సేన్‌సాగర్ లేక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓల్డ్ సిటీకి చెందిన పృథ్వీలాల్, కార్తీక అగర్వాల్ భార్యభర్తలు, వీరికి రెండున్నర ఏండ్ల కూతురు ఉంది. పృథ్వీలాల్ చార్టర్డ్ అకౌంటెంట్. గత కొంత కాలంగా భార్యభర్తల మధ్య కలహాలు రావడంతో కార్తీక బహదూర్‌పల్లిలోని పుట్టింట్లో ఉంటుంది. ఈ నెల రెండవ తేదీన కార్తీక తన కూతురుతో కలిసి ఎవ్వరికి చెప్పకుండా బయటకు వచ్చింది. దీనిపై కుటుంబ సభ్యులు బహదూర్‌పుర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.*

# టెన్త్ విద్యార్థులకు బండి సంజయన్న నజరాన

- ‘మోదీ గిఫ్ట్ పేరుతో ఎగ్జామ్ ఫీజును’ చెల్లిస్తానని ముందుకొచ్చిన కేంద్ర మంత్రి
- అన్ని జిల్లాల కలెక్టర్లకు లేఖ రాసిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్.



**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 05 (జనంసాక్షి):**
కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుకునే విద్యార్థులందరికీ శుభవార్త, ఈ ఏడాది టెన్త్ ఎగ్జామ్ ఫీజును పూర్తిగా చెల్లించేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముందుకొచ్చారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు కేంద్ర మంత్రి లేఖ రాశారు. అధికార వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 12,292 మంది విద్యార్థినీ, విద్యార్థులు పదో తరగతి చదువుకుంటున్నారు. వీరిలో కరీంనగర్ జిల్లాలో 4,847, సిరిసిల్ల జిల్లాలో 4,059, సిద్దిపేట జిల్లాలో 1,118, జగిత్యాల జిల్లాలో 1,135, హన్మకొండ జిల్లాలో 1,133 మంది విద్యార్థులున్నారు. వీరందరికీ పరీక్ష ఫీజు చెల్లించాలంటే రూ.15 లక్షలకుపైగా ఖర్చవుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారే. వారిలో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు కూలీ పని చేసి బతికేటోళ్లు, పిల్లలకు పరీక్ష ఫీజు కూడా చెల్లించే పరిస్థితి లేదని తెలుసుకున్న బండి సంజయ్ తన నియోజకవర్గ పరిధిలోని ఆయా స్కూళ్లలో చదివే విద్యార్థుల ఫీజు మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించుకున్నారు. ఆ మొత్తాన్ని తన వేతనం నుండి చెల్లించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖలు పంపారు. వాస్తవానికి బండి సంజయ్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులతోపాటు సరస్వతి శిశు మందిరాల్లో చదువుకునే విద్యార్థులుసహా దాదాపు 20 వేల మందికి “మోదీ గిఫ్ట్” పేరుతో బ్రాండెడ్ సైకిళ్లను పంపిణీ చేశారు. అతి త్వరలోనే సర్కారీ స్కూళ్లలో 9వ తరగతి చదువుకునే విద్యార్థులకు సైతం సైకిళ్లను పంపిణీ చేస్తామని ప్రకటించారు. అట్లాగే వచ్చే ఏడాది విద్యా సంవత్సరం ఆరంభంలోనే ‘మోదీ కిట్స్’ పేరుతో విద్యార్థులందరికీ స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్, జామెట్రీ బాక్స్, పెన్ను, పెన్సిళ్లు, స్టీల్ వాటర్ బాటిల్ ను పంపిణీ చేయబోతున్నారని తెలిపారు.

# విజయవంతమైన ప్రజా ఆశీర్వాద సభ





- జోరుగా సాగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం
- జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్ పట్ల విశ్వాసంతో ఉన్నారు
- స్థానికుడైన నవీన్ యాదవ్ కు ఓటు వేసి ఆశీర్వదించండి

**సుల్తానాబాద్, నవంబర్ 5 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల సందర్భంగా సోమాజిగూడ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా మంగళవారం రోజున ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ,అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శాసన సభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ స్థానిక కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్‌లతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ చేతి గుర్తుకు ఓటు వేసి ఆశీర్వాదించాలని, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు కోరారు.ముందుగా ఎల్లారెడ్డిగూడ అంబేద్కర్ నగర్ ప్రాంతంలో బిఆర్ఎస్ పలువురు నాయకులు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, రాబోయే ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించి ప్రజలు అదే నమ్మకాన్ని మరోసారి చాటాలని కోరారు.గత పది సంవత్సరాలుగా ఈ నియోజకవర్గం అభివృద్ధి అంధకారంలో నెట్టివేయ బడిందని, ప్రజలు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారని తెలిపారు. ఇప్పుడు ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఆ మార్పుకు ప్రతీకగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తక్కువ కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని, అందులో భాగంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. జూబ్లీహిల్స్ ప్రజలు సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న, అభివృద్ధి దిశను విశ్వసించి, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, “చేతి గుర్తుకు” ఓటు వేయాలని ఎమ్మెల్యే విజయ రమణా రావు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతి నిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీలో
# కౌన్సిలింగ్ కాలయాపన

**జాప్యం వల్ల నిరుపేద విద్యార్థులకు ఇబ్బందులు**

**హైదరాబాద్, నవంబర్ 05 (జనంసాక్షి) :** రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో రాజేంద్రనగర్‌లో గల ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ యూనివర్సిటీ యాజమాన్యం జనరల్ కేటగిరీ కోట పూర్తిచేయకుండా స్పెషల్ కోట ఎన్ఆర్ఐ కోటాలో పేమెంట్ రుసుములతో కూడిన సీట్ల కౌన్సెలింగ్ కొనసాగుతుందని పలువురు గుసగుసలాడుతున్నారు. ఈ మహాత్మ జ్యోతిబా పూలే బిఎస్సి అగ్రికల్చర్‌కు సంబంధించిన విద్యార్థినులకు కేటాయి ంచిన 60 సీట్లను సైతం ఎటు తేల్చకుండానే పెండింగులో ఉంచారు. తెలంగాణ రాష్ట్రం పేద మధ్యతరగతి విద్యార్థిని విద్యార్థులకు మంచి భవిష్యత్తును ఇచ్చేందుకు గాను ఉన్నత విద్యాభ్యాసంలో ఎలాంటి ఒడిదొడుకులు ఎదుర్కో కుండా ముందుకు సాగేలా ఉన్నత విద్యాభ్యాసం చేపట్టేందుకు పలు సంక్షేమ కార్యక్రమాలను చేపడుతూ ప్రభుత్వపరమైనటువంటి ఉన్నత విద్య శాఖల యూనివర్సిటీలకు మార్గదర్శకాలు ఇస్తున్నప్పటికీ అవి తుంగలో తొక్కిపెట్టేలా వ్యవహరిస్తున్నారని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయ తీరుపై పలు విమర్శలు వస్తున్నాయి. ఇక వివరాల్లోకి వెళితే సదరు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ పరిధిలోకి రాష్ట్రంలోని మరో వ్యవసాయ యూనివర్సిటీలు అనుసంధానంలో ఉండి జాతీయపరంగా ఐకార్ గుర్తింపు పొంది ఉన్న సంస్థగా పేరు పొంది ఉన్న తరుణంలో టీఎస్ ఎంసెట్ మరియు జాతీయస్థాయి సియుఈటి లాంటి పోటీ పరీక్షల ద్వారా సాధించిన మెరిట్ ర్యాంకులు మార్కుల ప్రతిపాదనకంగా అడ్మిషన్ల ప్రక్రియను కొనసా గించాల్సి ఉండగా అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా సదరు విశ్వవిద్యాలయంలో ఈ జూన్ నెలలో రెండవ వారం నుండి దరఖాస్తు ప్రక్రియను కొనసాగించి జూలై మాసం వరకు కొనసాగించి ఆపై నుండి కౌన్సిలింగ్ ప్రక్రియ ద్వారా సీట్ల భర్తీని చేపడుతున్నప్పటికీ అడ్మిషన్ల ప్రక్రియ నత్తనడకన సాగేలా మూడు నెలల నుండి విడతల వారీగా ర్యాంకుల వారీగా కౌన్సిలింగ్ ప్రక్రియను నేటి వరకు పూర్తి కాకపోవడం గమనించదగ్గ విషయం. ఇదిలా ఉంటే అర్హులైనటువంటి విద్యార్థిని విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియను ర్యాంకుల ద్వారా మెరిట్ ద్వారా జనరల్ కోట కింద ముందస్తుగా అడ్మిషన్లను భర్తీ చేయాల్సి ఉండగా ఇవేమీ పట్టకుండానే కొంతమేర అలా సాగించి స్పెషల్ కోట ఎన్ఆర్ఐ కోటాల మాటున అడ్మిషన్ల ప్రక్రియను మరింత జాప్యం చేస్తూ విద్యను వ్యాపారంగా చేసే తరహాలో జనరల్ కోటాను అసంపూర్తిగా ఉంచి రుసుములతో కూడిన సీట్ల భర్తీ ప్రక్రియకు ప్రాధాన్యతనిస్తూ నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు జనరల్ కోట ప్రక్రియలో భాగంగా అడ్మిషన్ల ప్రక్రియను నేటి వరకు అనగా మూడు నెలలు దాటిన ముగియకపోవడంతో ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్ ను పొందలేక స్పెషల్ కోట ఎన్ఆర్ఐ కోటాల్లో ఫీజులు చెల్లించలేని దీనస్థితుల్లో ఉన్నటువంటి విద్యార్థిని విద్యార్థుల పాలిట కౌన్సిలింగ్ నిర్వహణ పర్యవేక్షణ చేస్తున్నటువంటి ఉన్నతాధికారుల తీరు వారి పాలిట శాపంగా మారింది. ఇదిలా ఉంటే ప్రతి ఏడు నిరుపేద విద్యార్థినుల ప్రతిభను ఆధారంగా పలు గురుకుల సొసైటీలైనటువంటి సోషల్ వెల్ఫేర్ మహాత్మ జ్యోతిబాపూలే వంటి గురుకుల సొసైటీలు కేవలం బాలికలకు మాత్రమే రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో సొసైటీ 240 సీట్లను భర్తీ చేసేవారు కానీ ఐకార్ నిబంధనలను అడ్డం పెట్టుకొని సదరు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారుల చేష్టల కారణంగా గురుకులాల సీట్లను విలీనం చేసే ప్రక్రియలో భాగంగా ఒక్కో సొసైటీకి కేవలం 60 సీట్లు మాత్రమే కేటాయించి ఆలస్యంగా దరఖాస్తు ప్రక్రియ ప్రకటన విడుదల చేసి దరఖాస్తు ప్రక్రియ సైతం ముగిసి నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ కనీసం తాము ఫీజుల భారం మోయలేనటువంటి వారికి ప్రభుత్వ చేయూత సహాయం ద్వారానైనా ఉన్నత విద్యను అభ్యసించాలన్న గంపెడాశలతో ఎదురుచూస్తున్నటువంటి విద్యార్థిని ల భవిష్యత్తు ఏంటన్న వాదనలు వినవస్తున్నాయి. ఇకనైనా రాష్ట్రస్థాయి ఉన్న త విద్యా మండలి ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి ఆయా శాఖల మంత్రులు కలుగజేసుకొని ఈ అడ్మిషన్ల ప్రక్రియ త్తగతిన పూర్తయ్యేలా జనరల్ కేటగిరి సీట్ల కోసం ఎదురుచూస్తున్నటువంటి విద్యార్థిని విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని గురుకులాల సొసైటీల తరపున కేటాయించిన మహిళ విద్యార్థినుల సీట్ల భర్తీ ప్రక్రియను సైతం యుద్ధ ప్రతిపాదికన ముగిసేలా ఉన్నత విద్యా మండలి ఉన్నతాధికారులు మొదలు కొని రాష్ట్రస్థాయి మంత్రులు ముఖ్యమంత్రి కలుగజేసుకొని పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థిని విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసం అందేలా శాఖపరమైన చర్యలు తీసుకుంటూ తమ భావిష్యత్తును బంగారు బాటలో నిలపాలని పలువురు విద్యార్థిని విద్యార్థులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.



# కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి

- మేనేజర్‌తో చర్చించిన ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి ఎల్లాగౌడ్



**గోదావరిఖని, జనంసాక్షి :**
సింగరేణి ఆర్‌జీ–వన్ ఏరియాలోని జీడీకే.11వ గనిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ గని మేనేజర్‌ను కోరారు. బుధవారం ఆయన మేనేజర్‌ను కలిసిన అనంతరం మాట్లాడుతూ ముఖ్యంగా గనిలో పని స్థలాల్లో గాలి సరఫరా సరిగా లేకపోవడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, యాజమాన్యం మెరుగైన గాలి సరఫరా చేయకుండా కార్మికులను విధులు నిర్వహించాలని ఒత్తిడి చేయడం సరైంది కాదని ఆయన అన్నారు, వెంటనే యాజమాన్యం స్పందించి గాలి సరఫరా మెరుగ్గా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.అదేవిధంగా కార్మికులకు తగినన్ని పని ముట్లు ఇవ్వడం లేదని, పని ముట్లు పూర్తి స్థాయిలో అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మికులు విధులకు వెళ్ళే సమయంలో చైర్ కారు లు సరిపడా లేవని,వారు పని చేసే స్థలాలకు వెళ్ళేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే చైర్ కారుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గని మేనేజర్ స్పందించి వారంలో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిఎం కమిటి సభ్యులు సిద్దమల్ల రాజు, పిట్ సెక్రటరీ నాయిని శంకర్, సహాయ కార్యదర్శి గొడిశల నరేశ్, నాయకులు ఎం.చక్రపాణి, మైన్స్,సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

**మంథని, (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డిని బుధవారం మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుపతి యాదవ్ కమాన్ పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్ఎస్ అన్వర్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు ఎల్ల రామ్మూర్తి, తీగల సమ్మయ్య, ఎరుకల బాబురావు, గొర్రె నరేష్, మల్లయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మం సోషల్ కిల్లర్స్ ఎక్కడా..!?



## ప్రస్తుత మంత్రులపై అసభ్యకర పోస్టింగులు

- బిఆర్ఎస్ అండతో అడ్డగోలు రాతలు
- ప్రభుత్వ కార్యాలయాల్లో సెటిల్మెంట్స్ వారిపై చర్యలేవి..?

**ఖమ్మం, నవంబర్ 05 (జనంసాక్షి) :**
ఖమ్మం నగరంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోషల్ మీడియాలో కొందరు కూలీలు రెచ్చిపోయి పోస్టులు పెట్టారు. చిన్న .. పెద్ద అనే తేడాలేకుండా అసభ్యంగా కామెంట్లు చేసారు. వాట్సప్, ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్ లలో ప్రస్తుత మంత్రులు తుమ్మల , పొంగులేటి, భట్టీల గురించి ఇష్టమొచ్చిన భాష వాడారు. చేతికి ఎంతొస్తే అంత రాసి వారి వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. లేని అంశాలను కల్పించి కట్టు కథలు అల్లి మనిషి అనే వాడు సిగ్గుతో తలదించుకునే పరిస్థితులు కల్పించారు. వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని పలువురు కాంగ్రెస్ శ్రేణులు కోరుతున్నారు.

**మాజీ మంత్రి శిబిరంలో ఎక్కువ**

ఖమ్మం నగరంలో కొందరు మాజీ మంత్రి వద్ద కూలీకి పనిచేసారు. మాజీ మంత్రి విదిలించే వాటి కోసం వికృత రాతలు రాసి ప్రజలను తప్పుదోవ పట్టించారు. చరిత్రను వక్రీకరించి విషపు రాతలు రాశారు. సోషల్ మీడియాలో వచ్చిన పోస్టులను చూసి ప్రస్తుత అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. సోషల్ మీడియాలో ఖమ్మం బిఆర్ఎస్ నాయకులు వేధించిన తీరుకు ఎంతటి కఠినమైన శిక్ష విధించినా తప్పులేదనే ఆలోచన కలగక మానదు. మాజీ మంత్రి వద్ద పని చేసిన సోషల్ కూలీల భరతం పట్టాలని పలువురు కోరుతున్నారు.

**సెటిల్మెంట్.. పైరవీలు**

మాజీ మంత్రి వద్ద ఉన్న కొందరు సోషల్ మీడియా కూలీ గ్యాంగ్ ప్రభుత్వ కార్యాలయాల్లో పైరవీ కారులుగా చెలామణి అయ్యారు. పోలీసులకు ఫోన్లు చేయడం , ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు ఫోన్ కాల్స్ చేయడం తప్పుడు పనులు చేయించిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి. మునిసిపల్ కార్పోరేషన్ పెత్తనం చేయడం తప్పుడు పత్రాలతో అనుమతులు ఇప్పించడం , తహసీల్దార్ కార్యాలయాల్లో పైరవీలు చేయడం వారి ప్రధాన వృత్తిగా మార్చుకొని పని చేసారు. అలాంటి వారి పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలి.

**నోటికొచ్చిన భాష**

మాజీ మంత్రి ఏర్పాటు చేసిన సోషల్ మీడియా కూలీ.. బిఆర్ఎస్ లో ఉన్న సాటి కార్యకర్తలను , నాయకులను బెదిరించడం వేధింపులకు గురి చేసిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి. సొంత పార్టీ నాయకులు ప్రశ్నిస్తే వారి పై విరుచుకుపడటం వారి పై కేసులు నమోదు చేయించిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి. మానసిక క్షోభకు గురైన వారు అనేక మంది ఉన్నారు. ఏకంగా మీడియా ప్రతినిధులను సైతం టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించి అవమానకర భాష మాట్లాడిన మాజీ మంత్రి కిమ్మనకుండా ఉండటం గమనార్హం. మాజీ మంత్రి వద్ద పని చేసిన సోషల్ మీడియా బ్రోకర్స్‌ని పట్టుకొని పోలీసులు విచారిస్తే అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# హారిస్ రౌఫ్ మూల్యం చెల్లించుకున్నాడు

**దుబాయ్, నవంబర్ 5:** సెప్టెంబర్‌లో జరిగిన ఆసియా కప్ సమయంలో క్రికెట్ ప్రతిష్టకు భంగం కలిగించినందుకు ఐసీసీ చర్యలు చేపట్టింది. పాకిస్తాన్ ఫాస్ట్ బౌలర్ హారిస్ రౌఫ్‌పై రెండు వేర్వేరు ఘటనలకు గాను మ్యాచ్ ఫీజులో 30 శాతం చొప్పున జరిమానా విధించింది. దీంతోపాటు నాలుగు డీమెరిట్ పాయింట్లు రావడంతో అతన్ని రెండు వన్డే మ్యాచ్‌ల నుంచి సస్పెండ్ చేసింది. దక్షిణాఫ్రికాతో మంగళవారం ప్రారంభమైన వన్డే సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లు (నవంబర్ 6న రెండో మ్యాచ్) రౌఫ్ ఆడలేడు. భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌పై మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా, రెండు డీమెరిట్ పాయింట్లు విధించింది. పహల్గామ్ ఉగ్రదాడి బాధితులకు సంఘీభావం తెలుపుతూ భారత సాయుధ దళాలకు మద్దతు ఇచ్చినందుకు ఈ చర్య తీసుకుంది. జస్ప్రీత్ బుమ్రాపై ఒక డీమెరిట్ పాయింట్ విధించగా, పాక్ బ్యాటర్ సాహిబ్జాదా ఫర్హాన్‌కు కూడా ఒక డీమెరిట్ పాయింట్ జారీ చేసింది. భారత ఫాస్ట్ బౌలర్ అర్షదీప్ సింగ్‌ను మాత్రం ఎలాంటి జరిమానా లేదా డీమెరిట్ పాయింట్ విధించలేదు. సెప్టెంబర్ 14న జరిగిన మ్యాచ్‌లో విమానం కూలిపోవడాన్ని సూచించే అభ్యంతరకర సంజ్ఞలు చేసినందుకు రౌఫ్ తప్పు చేశాడని ఐసీసీ తేల్చింది. ఆపరేషన్ సింధూర్‌లో భారత సైనిక చర్యను ఎగతాళి చేస్తూ, పాకిస్తాన్ వాదనకు మద్దతు తెలిపినట్లు భావించింది. సెప్టెంబర్ 28న బౌండరీ వద్ద ఫీల్డింగ్ చేస్తూ భారత అభిమానులను రెచ్చగొట్టేలా మరోసారి అదే సంజ్ఞ చేశాడు. ఫైనల్‌లో రౌఫ్‌ను ఔట్ చేసిన బుమ్రా 'విమానం కూలిపోయింది' అని సైగ చేయడంతో అతనికి డీమెరిట్ పాయింట్ వచ్చింది. భారత్‌పై హాఫ్ సెంచరీ చేసిన ఫర్హాన్ బ్యాట్‌తో తుపాకీ కాల్చినట్లు సంజ్ఞ చేసి సంబరాలు చేసుకున్నాడు. అర్షదీప్ సోషల్ మీడియా క్లిప్‌లో పాక్ అభిమానులను ఎగతాళి చేసినట్లు కనిపించినా మ్యాచ్ రిఫరీకి అభ్యంతరకరంగా అనిపించలేదు. సెప్టెంబర్ 21 సూపర్ 4 మ్యాచ్, సెప్టెంబర్ 28 ఫైనల్ ఘటనలకు సంబంధించి ఐసీసీ ప్రకటనలు జారీ చేసింది. "సూర్యకుమార్ యాదవ్ (భారత్) ఐసీసీ ప్రవర్తనా నియమావళి నిబంధన 2.21ను ఉల్లంఘించాడు.



చారిత్రాత్మక విజయం సాధించిన తర్వాత భారత మహిళల క్రికెట్ జట్టు ఢిల్లీలో ప్రధానిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసింది. 52 సంవత్సరాల మహిళా క్రికెట్ ప్రపంచ కప్ చరిత్రలో తొలిసారిగా ట్రోఫీని గెలుచుకున్నందుకు హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని జట్టును ప్రధాని మోదీ అభినందించారు

మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో టీమిండియా విజేతగా నిలిచింది. అద్వితీయమైన ప్రదర్శనతో అర్ధశతాబ్దపు కలను సాకారం చేసుకుంది. 2005, 2017 ఫైనల్లో తృటిలో టైటిల్ చేజారగా.. ఈసారి మాత్రం భారత మహిళల జట్టు ఏ తప్పు చేయలేదు. ఒత్తిడిని చిరునవ్వుతో ఛేదిస్తూ తొలిసారి ఫైనల్ చేరిన సౌతాఫ్రికాను మట్టికరిపించింది.

ఇండియా ఉమెన్స్ టీమ్ మొదటిసారి వన్డే ప్రపంచకప్‌ను ముద్దాడింది. నవంబర్ 2న నవీ ముంబై వేదికగా జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్ 2025 ఫైనల్ మ్యాచ్‌లో.. దక్షిణాఫ్రికాను ఓడించి హర్మన్ ప్రీత్ కౌర్ నాయకత్వంలోని టీమిండియా విశ్వ విజేతగా నిలిచింది. దీంతో సర్వత్రా భారత్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. అయితే ఈ గెలుపును ఎప్పటికి గుర్తుంచుకునేలా.. టీమిండియా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ ఓ నిర్ణయం తీసుకుంది. ప్రపంచకప్ ట్రోఫీని టాటూగా తన చేయిపై వేయించుకున్నవిషయాన్ని.. సోషల్ మీడియా వేదికగా తన ఫ్యాన్స్‌తో పంచుకుంది.

# హర్మన్‌ప్రీత్‌కు అరుదైన గౌరవం

- జైపూర్ వ్యాక్స్ మ్యూజియంలో మైనపు విగ్రహం
- వరల్డ్‌కప్ విజయానికి అంకితం
- మహిళా దినోత్సవంపై ఆవిష్కరణ
- ధోనితోపాటు ఛాంపియన్ కెప్టెన్ల జాబితా



**జైపూర్, నవంబర్ 5:** భారత మహిళల క్రికెట్ జట్టుకు తొలి వన్డే వరల్డ్‌కప్ అందించిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు అరుదైన గౌరవం దక్కనుంది. జైపూర్ వ్యాక్స్ మ్యూజియంలో ఆమె మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ విగ్రహాన్ని టీమ్ఇండియా వరల్డ్‌కప్ విజయానికి అంకితం ఇవ్వనున్నట్లు మ్యూజియం వ్యవస్థాపకులు అనూప్ శ్రీవాస్తవ తెలిపారు. "భారత మహిళల క్రికెట్ జట్టుకు వరల్డ్‌కప్ అందించిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మైనపు విగ్రహాన్ని జైపూర్ వ్యాక్స్ మ్యూజియంలో ఏర్పాటు చేయనున్నాం. ఈ విగ్రహాన్ని మహిళల ప్రపంచకప్ విజయానికి అంకితం ఇస్తాం. ఆమె క్రికెట్‌కు సేవలు అందించడమే కాదు, ఈ గెలుపుతో మహిళా సాధికారతకు తోడ్పడింది. మేం ప్రముఖ వ్యక్తులను మాత్రమే కాదు, హర్మన్‌లా భవిష్యత్ తరానికి స్ఫూర్తినిచ్చే వాళ్ల విగ్రహాలు కూడా పెడతాం. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ విగ్రహాన్ని ఆవిష్కరిస్తుంది" అని శ్రీవాస్తవ పేర్కొన్నారు. దీంతో జైపూర్‌లోని నహర్‌గఢ్ కోటలో ఉన్న ఈ మ్యూజియంలో మార్చి 8, 2026న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు హర్మన్ మైనపు విగ్రహం ఆవిష్కరించనున్నారు. కాగా, ఈ మ్యూజియంలో ఇప్పటికే ఎంఎస్ ధోని, సచిన్ తెందుల్కర్, విరాట్ కోహ్లీ వంటి దిగ్గజ క్రికెటర్ల మైనపు విగ్రహాలు ఉన్నాయి. తాజా విగ్రహంతో ప్రపంచ కప్ విజేతలు ధోనీ, హర్మన్ ఇద్దరు కెప్టెన్ల విగ్రహాలు ఉండనున్నాయి. వీటితోపాటు ఇదే మ్యూజియంలో కల్పనా చావ్లా, సైనా నెహ్వాల్, మదర్ థెరిసా, రాజమాత గాయత్రి దేవి, హాది రాణి వంటి మహిళా విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇక ఈ జాబితాలో హర్మన్‌ప్రీత్ కౌర్ చేరనుంది. 2025 వరల్డ్‌కప్ ఫైనల్‌లో సౌతాఫ్రికాపై భారత్ 52 పరుగుల తేడాతో నెగ్గి ఛాంపియన్‌గా నిలిచింది. 52 ఏళ్ల వరల్డ్‌కప్ హిస్టరీలో భారత్ ట్రోఫీని అందుకోవడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ వరల్డ్‌కప్ టోర్నమెంట్‌లో హర్మన్ తన కెప్టెన్సీ స్కిల్స్‌తో ఆకట్టుకుంది. ప్రత్యర్థుల అంచనాలకు అందని వ్యూహాలతో దెబ్బ తీసింది. ఫైనల్‌లో షెఫాలీ వర్మ బౌలింగ్ అందుకు నిదర్శనం. ఈ విషయాన్ని సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ కూడా మ్యాచ్ అనంతరం అంగీకరించింది. ఇలాంటి వ్యూహాలతో హర్మన్ తనదైన మార్క్ చూపించి భారత్‌ను ఛాంపియన్‌గా నిలిపింది. ఇక భారత్‌కు (పురుషులు, మహిళలు) వన్డే వరల్డ్‌కప్ అందించిన మూడో కెప్టెన్‌గా హర్మన్ రికార్డు సాధించింది. ఇప్పటికే పురుషుల జట్టు రెండుసార్లు (1983 కపిల్ దేవ్, 2011 మహేంద్రసింగ్ ధోనీ) విజేతగా నిలవగా, తాజాగా మహిళల జట్టును హర్మన్ విజేతగా నిలిపింది.

## మైనార్టీలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న

# కాంగ్రెస్ ప్రభుత్వం

- ఇందుకు నిదర్శనమే అజారుద్దీన్‌కు మంత్రి పదవి
- మంత్రి అజారుద్దీన్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ హుస్సేన్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 05 (జనంసాక్షి):**
నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన పబ్లిక్ ఎంటర్ప్రైజెస్ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ ను బుధవారం హైదరాబాద్ బంజారాహిల్స్ లోని ఆయన స్వగృహంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ హుస్సేన్ కలిశారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి కి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిరాజు హుస్సేన్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మైనార్టీల సంక్షేమానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. మైనార్టీల పక్షపాతిగా వ్యవహరిస్తున్నదని ఇందుకు నిదర్శనమే ప్రముఖ మాజీ క్రికెటర్ అజారుద్దీన్ కు మంత్రి పదవి లభించడమేనని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్లో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి హైదరాబాద్ వాసిగా తెలంగాణ రాష్ట్రానికి ఎంతో పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చిన ఘనత అజారుద్దీన్ కు దక్కుతుందని సిరాజు హుస్సేన్ పేర్కొన్నారు. క్రికెట్ లో ఏ విధంగానైతే ప్రతిభ చూపి పేరు సంపాదించారో మంత్రిగా అదేవిధంగా మంచి పేరు తీసుకొస్తారని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిగా అజారుద్దీన్ నియమితులు కావడంతో మైనార్టీలకు ఇంకా మరింత అండా దండ లభించిందన్నారు. మైనార్టీలు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి పథంలో పయనిస్తారని ఆ విధంగా మైనార్టీ శాఖను మంత్రి అజారుద్దీన్ దేశంలోనే మంచి శాఖగా నిలబెడతారని గట్టి నమ్మకం ఉందని సిరాజు హుస్సేన్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల నేపథ్యంలోనే అజారుద్దీన్ మంత్రి పదవి ఇచ్చారని ఆరోపణలు చేయడం సరైనది కాదని పేర్కొన్నారు. నీచమైన ఆరోపణలు చేయడంలో బీఆర్ఎస్ నేతలు ముందుంటారని జూబ్లీహిల్స్ లో ఓడిపోతామని పర్స్టేషన్లో ఏం మాట్లాడుతున్నారో వారికి అర్థం కావడం లేదన్నారు. జూబ్లీహిల్స్ లో బీఆర్ఎస్ కు ఆదరణ కరువైందని ఓటర్లు వారి అభ్యర్థికి దూరంగా ఉంటున్నారని స్పందన కరువైందని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు అజారుద్దీన్ పై ఇష్టం వచ్చినట్లు ఆరోపణ లు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని సిరాజు హుస్సేన్ సూచించారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా

# వరి ధాన్యం కొనుగోళ్లు



**మంథని, (జనంసాక్షి) :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం కొనుగోళ్లు చేపడుతామని మంథని ఏఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న అన్నారు. బుధవారం మంథని ఏఎంసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ ఎక్లాస్ పూర్ సెంటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న మాట్లాడుతూ రైతుల ఇబ్బందులు గ్రహించిన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలోనే వ్యవసాయ మార్కెట్ యార్డును నిర్మించడం జరిగిందని, దీనిని ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సహకారం తో మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ కొన్ని ప్రత్యేక పరిస్తితుల కారణంగా ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రారంభోత్సవానికి రాలేక పోయారని, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీను బాబు ఆదేశాల మేరకు ఏఎంసి, ఎక్లాస్ పూర్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రార%శీ%భించుకోవడం జరిగిందని తెలిపారు. వర్షాలకు ధాన్యం తడిసినప్పటికి రైతులు ఏ మాత్రం అధైర్య పడవద్దని, ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని అన్నారు. హమాలి సమస్య అయినా, ఇతర సమస్య అయినా ఏ సమస్య వచ్చినా సింగిల్ విండో, ఏఎంసి పాలకవర్గం, సంఘ సిబ్బంది నిత్యం రైతులకు అందుబాటులో ఉండి పరిష్కరిస్తామని అన్నారు. ధాన్యం విక్రయించిన వెంటనే రైతులకు చెల్లింపులు జరుపుతామని తెలిపారు. ఎన్నికలకు ముందు మానిపేస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్ బాబు మానిపేస్టో లో పెట్టిన మాదిరిగా కాంగ్రెస్ అధికారం లోకి రావడం తోనే సన్న వడ్ల కు క్వింటాల్ కు రూ.500 బోనస్ చెల్లింపు జరిగిందని తెలిపారు. రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర తో పాటు సన్న వడ్లు క్వింటాల్ కు రూ.500 బోనస్ పొందాలని కోరారు. రైతులు సుభిక్షంగా ఉండాలని తపన పడే నాయకుడు మన శ్రీధర్ బాబు అని అన్నారు. ఈ కార్యక్రమం లో సహకార సంఘం ఉపాధ్యక్షుడు బెల్లంకొండ ప్రకాష్ రెడ్డి, డైరెక్టర్లు ఆకుల రాజబాబు, పెద్దిరాజు ప్రభాకర్, రావికంటి సతీష్ కుమార్, లెక్కల కిషన్ రెడ్డి, కొత్త శ్రీనివాస్, దాసరి లక్ష్మి-మొండయ్య, దేవల్ల విజయ్ కుమార్, ఏఎంసి ఉపాధ్యక్షుడు ముస్కుల ప్రశాంత్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్లు అంకుస్, ఓదెలు, ఊదరి శంకర్, జగన్ మోహన్ రావు, మంథని రాజు, నర్సింగరావు, గడ్డం పోచం, రావికంటి వెంకటేష్, టీజీఈఆర్సి సలహాదారు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎలక్షన్ కో ఆర్డినేషన్ సభ్యుడు శశిభూషణ్ కాచే, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురేందర్ రెడ్డి, నాయకులు పేరవేన లింగయ్య, బూడిద శంకర్, ఆకుల కిరణ్, పెంటరి రాజు, సాదుల శ్రీకాంత్, ఎరుకల ప్రవీణ్, అరెల్లి కిరణ్ గౌడ్, మంథని శ్రీనివాస్, పర్శవేన మోహన్, ఆర్ల నాగరాజు, అక్కపాక సది, అయిలి శ్రీనివాస్, చొప్పకట్ల హనుమంతు, రాం రాజశేఖర్, సేమంతుల ఓదెలు, దొరగోర్ల శ్రీనివాస్, పెండ్లి ప్రభాకర్ రెడ్డి, పుల్లె రవి, కొండ మహేందర్, బొడ్డు శ్రీనివాస్, పేరవేన రాజేష్, అర్థం సదానందం, నాంపల్లి సతీష్, రాదారపు నితీష్, శైలెందర్, రంజిత్, ఇందారపు సది, మార్కెట్ కమిటి సెక్రటరీ సతీష్, సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, పెద్ద సంఖ్య లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ ఫీజు బకాయిలను విడుదల చేయాలి

- నేడు కలెక్టరేట్ వద్ద నిరసన
- టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :**
తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం రోజున రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేసి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేయడం జరుగుతుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు తెలియజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా కళాశాల యజమాన్యాలు పెండింగ్ ఫీజు బకాయిల కొరకై బందును నిర్వహిస్తున్నాయని ఈ బందుకు టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పూర్తి మద్దతును ప్రకటించినది,దానిలో భాగంగానే రేపు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పర్లపల్లి రవీందర్, కరీంనగర్ పార్లమెంట్ అధ్యక్షులు మోతే రాజిరెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు బోండ్ల అంజల్ రెడ్డి,నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సచిన్, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ యూసఫ్,మైపాల్ రెడ్డిలు రావడం జరుగుతుందని ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న పూర్తి ఫీజు బకాయాలను స్కాలర్షిప్లను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని అన్నారు.

# టీంలోకి రిషబ్ పంత్..

- వైస్ కెప్టెన్‌గా ఎంపిక
- దక్షిణాఫ్రికా టెస్ట్ సిరీస్‌కు జట్టు ప్రకటన
- ఆకాష్ దీప్ కూడా తిరిగి వచ్చాడు
- పంత్ గాయం నుంచి తిరిగి.. 100 రోజుల తర్వాత రాక



ముంబై, నవంబర్ 5: దక్షిణాఫ్రికాతో జరిగే టెస్ట్ సిరీస్ కోసం టీమ్ ఇండియాను బీసీసీఐ ప్రకటించింది. రిషబ్ పంత్ తిరిగి జట్టుకు వైస్ కెప్టెన్‌గా వచ్చాడు. 2025-27 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భారత్ ఆడుతున్న మూడో టెస్ట్ సిరీస్ ఇది. బుధవారం నాడు ప్రెస్ రిలీజ్ విడుదల చేస్తూ బోర్డు జట్టును ప్రకటించింది. నేషనల్ టీంతో పాటు, దక్షిణాఫ్రికా 'ఏ'తో మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్ కోసం ఇండియా 'ఏ' జట్టును కూడా ప్రకటించింది. దీనికి తిలక్ వర్మ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఇంగ్లాండ్ పర్యటనలో నాల్గో టెస్ట్‌లో పంత్‌కు గాయమైంది. ఇందులో అతని కాలి వేలికి ఫ్రాక్చర్ అయింది. ఆ తర్వాత అతను ఆసియా కప్, వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్, ఆస్ట్రేలియా పర్యటనలకు దూరమయ్యాడు. 100 రోజులకు పైగా తర్వాత అతను తిరిగి వచ్చాడు. ఆకాష్ దీప్ కూడా జట్టులోకి తిరిగి వచ్చాడు. పంత్ రాకతో ఎన్ జగదీశన్ జట్టు నుంచి బయటకు వెళ్లవలసి వచ్చింది. ఫాస్ట్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ స్థానంలో ఆకాష్ దీప్ వచ్చాడు. దక్షిణాఫ్రికాతో జరిగే టెస్ట్ కోసం భారత్ జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వికెట్ కీపర్, వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్, సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీష్ కుమార్ రెడ్డి, మహ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్, ఆకాష్ దీప్.

## రంజీ ట్రోఫీలో వైభవ్ సూర్యవంశీకి చేదు అనుభవం

రంజీ ట్రోఫీ 2025-26లో బీహార్ తరఫున ఆడుతున్న కేవలం 14 ఏళ్ల యువ బ్యాట్స్‌మెన్ వైభవ్ సూర్యవంశీ తుఫాన్ ఇన్నింగ్స్‌తో ఒక్కసారిగా దేశ దృష్టిని ఆకర్షించాడు. మేఘాలయతో జరిగిన మ్యాచ్‌లో రెడ్ బాల్ (టెస్ట్ ఫార్మాట్) క్రికెట్‌ను తలదన్నేలా టీ20 స్టైల్‌లో బ్యాటింగ్ చేసిన వైభవ్, కేవలం 67 బంతుల్లో 97 పరుగులు చేసి సంచలనం సృష్టించాడు. అయితే, ఈ అద్భుతమైన ప్రదర్శన చేసినప్పటికీ, ఫస్ట్‌క్లాస్ క్రికెట్ చరిత్రలో అత్యంత పిన్న వయస్కుడైన సెంచరీ రికార్డును నెలకొల్పే సువర్ణావకాశాన్ని కేవలం 7 పరుగుల తేడాతో కోల్పోయి నిరాశ చెందాడు. బీహార్‌కు చెందిన 14 ఏళ్ల యువ బ్యాట్స్‌మెన్ వైభవ్ సూర్యవంశీ, మేఘాలయతో జరిగిన రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో సంచలనాత్మక ఇన్నింగ్స్ ఆడాడు. వర్షం కారణంగా ఆలస్యమైన ఈ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ కేవలం 67 బంతులు ఎదుర్కొని 97 పరుగుల విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. ఇందులో 9 ఫోర్లు, 4 సిక్సర్లు ఉన్నాయి. ఫోర్లు, సిక్సర్ల ద్వారానే ఆయన 60 పరుగులు సాధించాడు. ఈ మ్యాచ్‌లో గనుక వైభవ్ సెంచరీ పూర్తి చేసి ఉంటే, ఫస్ట్‌క్లాస్ క్రికెట్ చరిత్రలో సెంచరీ సాధించిన అత్యంత పిన్న వయస్కుడైన భారత క్రికెటర్‌గా నిలిచి ఉండేవాడు. కేవలం 7 పరుగుల తేడాతో ఈ చారిత్రక రికార్డును సాధించే అవకాశాన్ని కోల్పోయాడు. పాట్నా గ్రౌండ్‌లో జరిగిన ఈ రంజీ మ్యాచ్‌పై భారీగా వర్ష ప్రభావం పడింది. నాలుగు రోజుల్లో మొదటి ఇన్నింగ్స్ కూడా పూర్తి కాలేదు. మేఘాలయ తమ తొలి ఇన్నింగ్స్‌ను 408 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది.

# చెట్లకింద వైద్యం



- భారీ వర్షానికి గొడుగు
- ఎండకు మనిషి నీడ
- వీటిని అడ్డంపెట్టి చిన్నారులకు గర్భిణులకు ఇంజక్షన్లు
- రంగారెడ్డి జిల్లా షాద్ నగర్‌లో ఏఎన్ఎమ్‌ల అవస్థలు

**75 ఏళ్ల స్వాతంత్ర భారతదేశంలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని ఓవైపు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పాలకులు బహిరంగ సభల్లో, సభలు సమావేశాల్లో ఊకదంపుడు ఉపన్యాసాలు దంచుతుంటే కింది స్థాయిలో గమనిస్తే మాత్రం వారు మాట్లాడుతున్న మాటలకు పూర్తిగా విరుద్ధంగా పరిస్థితులు కళ్ళకు కట్టినట్టు కనిపిస్తున్నాయి. గర్భిణులకు, చిన్నారులకు ప్రతి నెల వారీగా వ్యాక్సినేషన్ ఇచ్చే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లేక చెట్లకింద చెత్త దుమ్ము దూళిలో వానకు తడుస్తూ వర్షానికి గొడుగులు అడ్డం పెట్టుకొని ఎండకు చిన్నారులకు ఇచ్చే వ్యాక్సినేషన్ ఉష్ణోగ్రతలో ఉండాల్సిన మెడిసిన్ ఎండకు ఉండకూడదని మనిషి నీడలో పెట్టి వ్యాక్సినేషన్ చేస్తున్నారు. నేటి కంప్యూటర్ యుగంలో కనీసం నిలువ నీడ లేకపోవడం శోచనీయం. రంగారెడ్డి జిల్లా అంటేనే ఫైనాన్షియల్ జిల్లా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను అంటిపెట్టుకొని పరిపాలన కొనసాగుతుంది. కానీ ప్రజలకు సరిపడా సౌకర్యాలు అందించడంలో మాత్రం పేరుగొప్ప ఊరు దిబ్బ అనే చందంగా తయారైంది.**

రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, (జనంసాక్షి)



రంగారెడ్డి జిల్లాలో ప్రజలకు గర్భిణులకు, చిన్నారులకు వైద్యం అందించేందుకు మొత్తం 36 రెగ్యులర్ ఆరోగ్య కేంద్రాలు 78 బస్తీ దవాఖానాలు 28 అర్బన్ ప్రాథమిక కేంద్రాలు 186 ప్రాథమిక ఉప కేంద్రాలు (సబ్ సెంటర్లు) ఉన్నాయి. గర్భిణీ స్త్రీలకు చిన్నారులకు ప్రతి నెల వారిగా ఇచ్చే వ్యాక్సినేషన్ ప్రాథమిక ఉప కేంద్రాలు (సబ్ సెంటర్ల)లో ఏఎన్ఎంలు ప్రతి నెల వారీగా ఇస్తుంటారు కానీ రంగారెడ్డి జిల్లాలో ఎక్కడా సరిపడా ప్రాథమిక ఆరోగ్యఉప కేంద్రాలు లేకపోవడంతో ఎక్కడ ఖాళీ స్థలం దొరికితే అక్కడ వ్యాక్సినేషన్ పెట్టుకొని వ్యాక్సినేషన్ చేస్తున్నారు ఇదే క్రమంలో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ఇంద్రనగర్ కాలనీలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం (సబ్ సెంటర్ )లేక చెట్లకిందే ఎండకు వ్యాక్సినేషన్ ఉండకూడదని మనిషి నీడలో పెట్టుకొని వ్యాక్సినేషన్ చేస్తుంటే వర్షానికి గొడుగులు అడ్డంపెట్టి చిన్నారులకు గర్భిణీ స్త్రీలకు వ్యాక్సినేషన్ చేస్తున్నారు సిబ్బంది జనాభా పెరుగుతున్న క్రమంలో గర్భిణీ స్త్రీలకు చిన్నారులకు వాక్సినేషన్ చేయడం చెట్లకింద ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ దుమ్ము దూలిలో తము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది ఓవైపు గైనకాలజిస్టు వైద్యులే గర్భిణీ స్త్రీలు చిన్నారులు జాగ్రత్తలు తీసుకోవాలని సలహాలు సూచనలు చేస్తూ చెట్లకింద దుమ్ము దూళి చెత్తలో మెడిసిన్ పెట్టి చిన్నారులకు గర్భిణీ స్త్రీలకు ఇస్తే వ్యాధులు దరిచేరవా అనేది మరో విమర్శ రంగారెడ్డి జిల్లాలో ఎక్కడ కూడా పూర్తిస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు (సబ్ సెంటర్లు) లేక ఆరోగ్య సిబ్బంది నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వైద్యఆరోగ్యశాఖ అధికార యంత్రాంగం స్పందించి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### ప్రభుత్వం స్పందించి ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలి



ప్రజలకు నిత్యం అవసరపడే వైద్యం విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ప్రజలకు గర్భిణీ స్త్రీలకు చిన్నారులకు అవసరపడే ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు పూర్తిస్థాయిలో సొంత బిల్డింగులు నిర్మించి ప్రజలకు వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

బిజిలి సత్యం, యూటిఎఫ్ ఫరూఖ్ నగర్ మండల ప్రధాన కార్యదర్శి

### సాధారణ వైద్యం అందించలేని స్థితిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు..



75 ఏళ్ల స్వాతంత్ర భారతదేశంలో ప్రజలకు నిత్యం అవసర పడే సాధారణ వైద్యం అందించలేని దుస్థితిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉండడం పాలకుల నిర్లక్ష్యనికి నిలువెత్తు నిదర్శనం. ప్రజలకు చిన్నారులకు గర్భిణీ స్త్రీలకు ఇచ్చే వ్యాక్సినేషన్లు భద్రంగా పెట్టుకోవడానికి కూడా సొంత భవనాలు లేకపోవడం చూస్తే ప్రజలపై పాలకుల ప్రవర్తన ఏవిధంగా ఉందో ఇట్టే అర్థమవుతుందన్నరు వెంటనే కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు వైద్య ఆరోగ్యశాఖ ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించి ఇవ్వలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం

తిరుమలయ్య, పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

# కుటుంబ కలహాలతో బిడ్డతో తల్లి ఆత్మహత్య

- హుస్సేన్ సాగర్‌లో లభించిన శవాలను గుర్తించిన పోలీసులు



**హైదరాబాద్, నవంబర్5 (జనంసాక్షి) :** కుటుంబ కలహాలతో వివాహిత తన కుమార్తెతో కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అయితే గుర్తు తెలియని శవంగా పోలీసులు భద్రపరిచారు. చివరకు దర్యాప్తులో ఆమెను కీర్తిక అగర్వాల్‌గా గుర్తించారు. లేక్ పోలీసుల వివరాల ప్రకారం..పాతబస్తీలో నివాసముంటూ వ్యాపారం చేస్తున్న పృథ్విలాల్, చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న కీర్తిక అగర్వాల్(28) దంపతులు. వీరికి రెండేళ్ల కుమార్తె బియ్యారా ఉంది. దంపతుల మధ్య గొడవలతో ఆమె ఏడాదిన్నర కిందటే బహదూర్‌పురలో నివాసముంటున్న తల్లిదండ్రుల వద్ద కుమార్తెతో కలిసి ఉంటోంది. ఈనెల 2న హుస్సేన్‌సాగర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సోమవారం నెక్లెస్ రోడ్డులోని నీరా కేఫ్ సమీపంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వివరాలు లభ్యం కాకపోవడంతో మార్చురీకి తరలించి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తమ కుమార్తె, మనుమరాలు కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఆత్మహత్యకు పాల్పడిన మహిళ కీర్తిక అగర్వాల్‌గా గుర్తించిన ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఆమె తన కుమార్తెతో కలిసి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని భావించి పరిశీలించగా మంగళవారం పాప మృతదేహాన్ని గుర్తించారు.

# చట్నీ మీదపడిందన్న కోపం

- వ్యక్తిని కిరాతకంగా హత్య చేసిన నలుగురు



**హైదరాబాద్, నవంబర్5 (జనంసాక్షి) :** బట్టలపై చట్నీ పడిందనే చిన్న కారణంతో ఒక వ్యక్తిని నలుగురు యువకులు అతి కిరాతకంగా హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ ఉప్పల్ కల్యాణపురి నివాసి మురళీ కృష్ణ(45) సోమవారం నాడు పని మీద ఎల్బీనగర్ వెళ్లాడు. అనంతరం రాత్రి ఇంటికి వెళ్లేందుకు కారులో వెళ్లున్న వారిని లిఫ్ట్ అడిగాడు. ఆ కారులో నలుగురు యువకులు ఉన్నారు. అయితే, మార్గం మధ్యలో వారికి ఆకలి వేయడంతో ఉప్పల్‌లోని ఓ టిఫిన్ సెంటర్ దగ్గర వారంతా టిఫిన్ చేయడానికి ఆగారు. అయితే, అక్కడ అనుకోకుండా మురళీ కృష్ణ ప్లేట్‌లోని చట్నీ ఒక యువకుడిపై పడింది. దీంతో ఆ యువకులు మురళీ కృష్ణతో గొడవకు దిగారు. బలవంతంగా అతడిని కారులోకి ఎక్కించుకుని సుమారు రెండు గంటలపాటు కారులోనే తిప్పుతూ చిత్ర హింసలకు గురి చేశారు. అంతేకాకుండా, నాచారం సమీపంలోని ఒక నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి కత్తితో అతడిని విచక్షణారహితంగా పొడిచారు. నిందితుల నుంచి తప్పించుకునేందుకు మురళీ కృష్ణ ప్రయత్నించి చివరికి తన ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనపై కేసు నమోదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

# భూపాలపల్లి జిల్లాలో భారీ సుడిగాలులు

- గాలుల బీభత్సానికి నేలకొరిగిన పంటలు

**జయశంకర్ భూపాలపల్లి, నవంబర్5 (జనంసాక్షి) :** జిల్లాలో భారీ సుడిగాలులు బీభత్సం సృష్టించాయి. పలిమెల మండలంలోని లెంకలగడ్డలో గోదావరి పరివాహక అటవీ ప్రాంతంలో సుడిగాలుల ఏర్పడడంతో భారీగా చెట్లు ,మిర్చి, పత్తి పంటలు నెలకొరిగాయి. గత సంవత్సరం సెప్టెంబర్ నుండి ఇప్పటి వరకు మూడు సార్లు ప్రకృతి విలయతాండవం చేయడం సంచలనంగా మారింది. అయితే గత సంవత్సరం సెప్టెంబర్, డిసెంబర్ నెలల్లో ములుగు జిల్లా మేడారం అటవీ ప్రాంతంలో బీభత్సం చోటు చేసుకోగా తాజాగా లెంకలగడ్డ అటవీ ప్రాంతంలో ప్రళయం సంభవించడం గమనార్హం. మంగళవారం సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల మధ్య ఏర్పడిన వాటర్ స్పౌట్ ఉత్తర దిశ నుండి దక్షిణం వైపు ప్రయాణం చేసింది. దాదాపు 60 మీటర్ల వెడల్పుతో 3 కిలో మీటర్ల పొడవున సుడిగాలులు బీభత్సం సృష్టించాయి. అయితే లెంకలగడ్డ అటవీ ప్రాంతంలో వచ్చిన వాతావరణ మార్పుల ప్రభావం వల్ల కొంతమంది రైతులు ప్రాణాపాయం నుండి తప్పించుకున్నారు. వ్యవసాయ అవసరాల కోసం మోటార్లను తరలిస్తున్న ఎద్దుల బండి కూడా సుడిగాలుల ఉధృతికి కొట్టుకపోయింది. దీంతో ఎడ్ల బండిలో తీసుకెల్తున్న వ్యవసాయ పనిముట్లన్ని తునాతునకలు అయ్యాయి.. వ్యవసాయ పనుల్లో నిమగ్నం అయిన కొంతమంది రైతులు వాటర్ స్పౌట్ కారణంగా పలుమార్లు గాల్లోకి లేవగా గురత్వాకర్షణ శక్తి వల్ల తిరిగి నేలపై పడిపోయారు. ఇక్కడే ఉన్నట్టయితే ప్రాణాలు పోయేలా ఉందని గమనించిన రైతులు రాత్రి వరకూ ఇండ్లకు చేరుకుని భిక్కుభిక్కుమంటూ కాలం వెల్లదీశారు. లెంకలగడ్డ అటవీ ప్రాంతంలో సంభవించిన వాటర్ స్పౌట్ ప్రభావంతో సుమారు 200 చిన్న,పెద్ద చెట్లు నేలకొరిగాయని తెలిపారు. లెంకలగడ్డ అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న వ్యవసాయ భూముల్లోని 10 ఎకరాల్లో మిర్చి, పత్తి పంటలు కూడా నాశనం అయ్యాయి. తాము తీవ్రంగా నష్టపోయా మని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ బెదిరింపులు

- అభ్యర్థి నవీన్ యాదవ్ తీరుపై బీఆర్ఎస్ మండిపాటు
- ఈ బెదిరింపులు దేనికి సంకేతం : బాల్క సుమన్




**హైదరాబాద్, నవంబర్5 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి బెదిరింపులకు పాల్పడుతున్నాడని బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి మద్దతుతోనే ఆయన బెదిరింపులకు దిగుతున్నారని మండిపడ్డారు. ఈ బెదిరింపులు దేనికి సంకేతమని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో శాంతి భద్రతలు క్షీణించాయని విమర్శించారు. పట్టపగలే హత్యలు, దోపిడీలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో హైదరాబాద్‌లో చిన్న అవాంఛనీయ ఘటన జరగలేదని తెలిపారు. హైదరాబాద్‌లో బతుకుతున్న ప్రతి ఒక్కరూ హైదరాబాదీయులే అని.. వాళ్ల కాలికి ముళ్లు గుచ్చుకుంటే.. నా పంటితో తీస్తానని కేసీఆర్ సీఎం హోదాలో అన్నారని గుర్తుచేశారు. శాంతి భద్రతలు కఠినంగా అమలుచేశారని తెలిపారు. దీనివల్ల హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఐటీ రంగం విస్తరించిందని అన్నారు. కేసీఆర్ పాలనలో పారిశ్రామికరంగం, రియల్ ఎస్టేట్ రంగం పెరిగిందని తెలిపారు. కేసీఆర్ పాలనలో పెట్టుబడులకు తెలంగాణ గేట్‌వే ఆఫ్ ఇండియాగా ఉంటే.. కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ గన్ కల్చర్‌కు అడ్డగా మారిందని బాల్క సుమన్ విమర్శించారు. జూబ్లీహిల్స్ అనేది సంగమం లాంటి నియోజకవర్గమని బాల్క సుమన్ అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రవర్తన ఎలా ఉందో ఆలోచించుకోవాలని సూచించారు. కేసీఆర్ నాయకత్వంలో హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందిందని తెలిపారు. హైదరాబాద్ ప్రగతి తెలంగాణ పురోగతికి దోహదపడిందని అన్నారు. హైదరరాబాద్ లో ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేసినందుకు .. 2018లో అత్యధిక సీట్లు వచ్చాయని తెలిపారు. రెండు సందర్భా ల్లో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మేయర్, డిప్యూటీ మేయర్ బీఆర్ఎస్ కైవసం చేసుకుందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో తిరోగమన దిశగా కొనసాగుతోందని బాల్క సుమన్ విమర్శించారు. వడ్లు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదని అన్నారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతుంటే మంత్రి, ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో తిరగడం లేదని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు అన్నారని.. ఒక్క గ్యారంటీ కూడా అమలుకు నోచుకోలేదని తెలిపారు. రైతు డిక్లరేషన్ అన్నారని.. రైతులకు ఏమైనా చేశారా అని ప్రశ్నించారు. నిరుద్యోగులపై లాఠీచార్జ్ చేశారని మండిప డ్డారు. రేవంత్ రెడ్డి పాలనను గాలికి వదిలేశారని విమర్శించారు. మంత్రివర్గం మొత్తం జూబ్లీహిల్స్‌లో దిగారని.. జూబ్లీహిల్స్‌ను రణరంగంగా మార్చేశారని అన్నారు. ఆడబిడ్డ కన్నీళ్లపై డ్రామా అని మంత్రులు మాట్లాడుతు న్నారని.. గోపీనాథ్ కూతుళ్లు ప్రచారం చేస్తే వాళ్లపై కేసులు పెడుతున్నారని మండిపడ్డారు.

# బీఆర్ఎస్ తప్పడు ప్రచారాలు

- మండిపడ్డ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్



**హైదరాబాద్, నవంబర్ 5 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల సందర్భంగా తనపై బీఆర్ఎస్ తప్పుడు ఆరోపణలు చేస్తోందని కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు తనపై తప్పుడు నిందలు వేస్తూ, అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ప్రజలు దొంగ సర్వేలను నమ్మరని పేర్కొన్నారు. ప్రజలకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉన్నానని, గతంలో ఓటమి చెందినా ప్రజలతో మమేకం అయ్యానని నవీన్ యాదవ్ మాట్లాడారు. తాను చదువుకున్న వ్యక్తినని, ప్రజల కోసం నిజాయితీగా పని చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. గతంలో తమ గల్లీకి ఎమ్మెల్యే కూడా రాలేదని, ఇప్పుడు సీఎం వస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తనను కుడి భుజంగా భావించడం తమ అదృష్టమని ఆయన పేర్కొన్నారు. తన తండ్రి గతంలో కేసీఆర్‌కు సహాయం చేశారన్న నవీన్ యాదవ్, కేసీఆర్ తమ ఇంటికి వచ్చి సహాయం అడిగారని, శత్రువు ఇంటికి వచ్చినా సహాయం చేస్తామని నవీన్ యాదవ్ అన్నారు. 2018లో తనకు అవకాశం ఇవ్వకుండా బీఆర్ఎస్ అడ్డుకుందని ఆయన విమర్శించారు. తనపై వస్తున్న విమర్శలను పట్టించుకోనని, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి ఆధారంగా ఓట్లు అడగాలని ఆయన సూచించారు.



# అదిగో సూపర్ మూన్

ఆదిలాబాద్ జిల్లాలో సూపర్ మూన్ అత్యంత ప్రకాశ వంతంగా వెలుగులు విరజిమ్ముతూ కనువిందు చేశాడు. ఈ దృశ్యాన్ని ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ బుధవారం రాత్రి తన కెమెరాలో బంధించాడు.అప్పుడప్పుడు చంద్రుడు భూమికి అత్యంత దెగ్గరగా చేరినప్పుడు ఇటువంటి సూపర్ మూన్ దృశ్యం ఆవిష్కరింపజేస్తుంది. నిత్యం వెలిగే దానికంటే రెట్టింపు స్థాయిలో అధిక కాంతివంతంగా వెలుగులు విరజిమ్ముతున్నాయి.

– ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :

# విద్యార్థుల కుటుంబాన్ని ఆదుకుంటాం

- ప్రమాద బాధితులతో సిఎంను కలుస్తా
- పరిహారం చెక్కులు అందచేసిన ఎమ్మెల్యే



**వికారాబాద్, నవంబర్ 5 (జనంసాక్షి) :** బస్సు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి హామీ ఇచ్చారు. త్వరలోనే బాధితులతో సిఎం రేవంత్‌ను కలిసి చర్చిస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.7 లక్షల చొప్పున మొత్తం రూ. 42 లక్షలు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ వారి గ్రామాలకు వెళ్లి ఆర్థిక సహాయం అందజేశారు. చేవెళ్ల మండలం మీర్జాపూర్ వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే చెక్కులను అందించారు. యాలాల మండలం హాజీపూర్ గ్రామానికి చెందిన కురుగుంట లక్ష్మి, బందెప్ప దంపతులు, లక్ష్మీనారాయణ పురం గ్రామానికి చెందిన విద్యార్థిని అఖిలారెడ్డి, పేర్ కంపల్లి గ్రామానికి చెందిన సాయి ప్రియ, నందిని, తనూష ప్రమాదంలో మరణించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హాజీపూర్ గ్రామానికి చెందిన కురుగుంట బందప్ప, లక్ష్మి దంపతులు అక్కడికక్కడే మరణించారు. వాళ్ల పిల్లలు శివలీల, భవానీ అనాథలు కావడంతో వారికి తన సొంత డబ్బులతో ఇల్లు కట్టిస్తానని, వారి పూర్తి బాధ్యతను ప్రభుత్వమే చూసుకుంటుందన్నారు. త్వరలోనే వారిని సీఎం రేవంత్ రెడ్డి దగ్గరికి తీసుకెళ్తానని చెప్పారు. లక్ష్మీనారాయణపూర్, పేరుకంపల్లిలో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలను ఆర్థిక సహాయం చేయడంతో పాటు, ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్, ఆర్టీసీ ఆర్ఎం శ్రీలత ఉన్నారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఎసిబి దాడులు

**అమరావతి, నవంబర్5 (జనంసాక్షి) :** ఏపీ వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఏసీబీ సోదాలు చేపట్టింది. మొత్తం 120 చోట్ల ఏసీబీ తనిఖీలు కొనసాగాయి. ఎన్టీఆర్ జిల్లా, కోనసీమ, ఏలూరు, ప్రకాశం, విశాఖ, నెల్లూరు, శ్రీసత్యసాయి జిల్లా, అన్నమయ్య జిల్లాల్లో ఏకకాలంలో రైడ్స్ జరుగుతున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఈ మేరకు సోదాలు చేపట్టారు. రిజిస్ట్రేషన్ పత్రాలు, రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు.. అనుమానాస్పదంగా ఉన్న ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రకాశం జిల్లాలోని ఒంగోలు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏసీబీ అధికారులు రావడం చూసిన కొంత మంది సిబ్బంది.. తమ తమ జేబుల్లో ఉన్న నగదు బయటకు విసిరేసినట్లు తెలుస్తోంది. విశాఖపట్నంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయాలపై ఏసీబీ ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. మధురవాడ, భోగాపురం, టర్నర్ చౌల్ట్రీతో పాటు సబ్ రిజిస్టర్ కార్యాలయాలపై ఏసీబీ సోదాలు చేస్తోంది. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకే ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. శ్రీ సత్యసాయి జిల్లాలోని చిలుమత్తూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు రైడ్స్ చేశారు. ఇటీవల కాలంలో సబ్ రిజిస్టర్‌పై పలు ఫిర్యాదులు వెళ్లడంతో ఏసీబీ రంగంలోకి దిగింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370